www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 2-3-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 316 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: శు.తదియ రా.9.02 తదుపరి చవితి, నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ.8.59 తదుపరి రేవతి, వర్జ్యం: రా.7.49-9.15, అమృతఘడియలు: తె.4.29-5.55, దుర్ముహూర్తం: సా.4.44-5.31, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.36, సూర్యాస్తమయం: 6.18 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కడప కొండల్లో ఆదిమానవుని ఆనవాళ్లు

లంకమల కొండల్లో ఆవాసాలు

జంతువులను కాల్చి తిన్న ఆధారాలు

తెలుపు, ఎరుపు, నలుపు వర్ణ రేఖా చిత్రాలు

మూడు రోజులుగా అభయారణ్యంలో పురావస్తు శాఖ సర్వే



ఇద్దరు నృత్యం చేస్తున్నట్లు ఉన్న తెలుపు రంగు రేఖాచిత్రం

రాయచోటి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కడప కొండల్లో ఆదిమానవుని ఆనవాళ్లు లభించాయి. క్రీస్తు పూర్వం 15వ శతాబ్దంలో జీవించిన మనిషి ఎలా ఉండేవాడు? ఏం తిన్నాడు? ఎలా తిన్నాడు? ఎక్కడ నివసించాడు? తన భావోద్వేగాలను ఎలా పంచుకున్నాడు? వంటి ప్రశ్నలకు అక్కడ దొరికిన రేఖా చిత్రాలు సమాధానాలుగా నిలిస్తున్నాయి. కడప జిల్లా బద్వేలు, సిద్దవటం, మైదుకూరు పరిధిలోని లంకమల అభయారణ్యంలోని

మిగతా 12వ పేజీలో...

అరకు కాఫీ అదుర్స్

గిరిపుత్రుల ఉత్పత్తికి ఆర్గానిక్ సర్టిఫికేషన్

త్వరలోనే విశ్వవిపణిలోకి మన కాఫీ

యూరప్ దేశాల్లో మంచి డిమాండ్

మార్కెటింగ్ కోసం టాటా సంస్థతో డీల్

తొలి నుంచీ అరకు కాఫీకి అండగా బాబు

పెట్టుబడిదారుల సదస్సులో అరకు కాఫీ రుచి

అంతర పంట మిరియాలకూ 'అపెడా' గుర్తింపు

పసుపునకూ సర్టిఫికేషన్ కోసం ప్రయత్నాలు



విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ అరకు ఏజెన్సీలో గిరిజన రైతులు పండించే కాఫీకి ఆర్గానిక్ సర్టిఫికేషన్ లభించింది. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఇన్నాళ్లూ దీనిని 'జీసీసీ అరకు వ్యాలీ కాఫీ' పేరుతో విక్రయిస్తోంది. ఇకపై

మిగతా 12వ పేజీలో...

'తమ్ముళ్లూ'.. తొందరొద్దు!



2019లో 151 సీట్ల భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి తాను 30 ఏళ్ల పాటు అధికారంలో కొనసాగుతానని ప్రకటించారు. అయితే, ఆ తర్వాత ఆయన పాలన ఎలా సాగిందో చూశాం. ఎవరిని ఎంతకాలం అధికారంలో కూర్చోబెట్టాలో నిర్ణయించేది మాత్రం ప్రజలే.

అధికార కూటమి ఎమ్మెల్యేలు కొందరు గత ప్రభుత్వ దురాగతాలను ఆదర్శంగా తీసుకోగా, కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేస్తూ ప్రభుత్వం స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోలేని విధంగా ఒత్తిడి తెస్తున్నారు. ముఖ్యమంత్రి ఏం చేయాలో, ఎలా ఉండాలో సోషల్ మీడియా వేదికగా ప్రకటించడమే కాకుండా ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు.

పోలీసుల ద్వారా అరెస్టు చేయించడం చిటికెలో పనే కావచ్చు. అయితే ఆ తర్వాత సదరు కేసులు న్యాయ సమీక్షలో నిలబడాలి కదా? ఈ కారణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు సమయం, సందర్భం కోసం ఎదురుచూస్తున్నారు. ఏకంగా తన సతీమణి భువనేశ్వరినే దారుణంగా అవమానించిన వల్లభనేని వంశీ వంటి వారిపై చర్యలు తీసుకోవడానికి కూడా సందర్భం కోసం వేచిచూశారు.

చంద్రబాబు, పవన్ కల్యాణ్ చెబుతున్నట్టుగా కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం రాష్ట్రానికి, ప్రజలకు అవసరం! తెలుగు తమ్ముళ్లు ఈ వాస్తవాన్ని గుర్తించకుండా అతిగా స్పందిస్తూ అలజడి సృష్టిస్తున్నారు.

వైసీపీ, జనసేన పార్టీలకు కూడా సోషల్ మీడియా బలంగా ఉంది. అయితే ఆ పార్టీల మద్దతుదారులు తమ నాయకులపై ఈగ వాలనివ్వరు. తెలుగుదేశం పార్టీలో మాత్రం ఇందుకు భిన్నమైన ధోరణి కనిపిస్తున్నది. కారణం ఏమైనప్పటికీ తెలుగు తమ్ముళ్ల అతి స్పందన ముఖ్యమంత్రి చంద్రబాబుకు తలపోటుగా మారింది.

ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్న వారంతా నిజంగా తెలుగు తమ్ముళ్లేనా? లేక వారి ముసుగులో వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారా? అన్న సందేహం కూడా కలుగుతోంది. జగన్ రెడ్డి ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లీ అధికారంలోకి రారన్న నమ్మకాన్ని ప్రజాబాహుళ్యానికి కల్పించాల్సిన బాధ్యత చంద్రబాబు, పవన్ కల్యాణ్ మీదనే కాదు- తెలుగు తమ్ముళ్ల మీద కూడా ఉంది.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

వైసీపీతో వినాశనం

ఆ పార్టీకి మేలు చేస్తే పాముకు పాలు పోసినట్లే

వైసీపీ నేతలకు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఉపకారం చేసే పరిస్థితి ఉండకూడదు. వైసీపీకి ఉపకారం చేస్తే పాముకు పాలు పోసినట్లే. ఈ విషయం టీడీపీ నేతలకు నేరుగా, గట్టిగా చెబుతున్నా.

- చిత్తూరు జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు

టీడీపీ నేతలకు సీఎం హెచ్చరిక

రాష్ట్రాభివృద్ధి కోసం పరుగులు తీస్తున్నా.. తీయిస్తున్నా

బడ్జెట్‌లో బడుగుల సంక్షేమానికి ప్రాధాన్యం

64 లక్షలమందికి పెన్షన్లు.. ఏటా 33 వేలకోట్లు

జూన్‌లోగా డీఎస్సీ భర్తీ ప్రక్రియ పూర్తి

మే నెల నుంచి తల్లికి వందనం అమలు

3 విడతల్లో రైతులకు అన్నదాత సుఖీభవ

20 వేల కి.మీ. గుంతల రోడ్లు బాగు చేశాం

చిత్తూరు జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబు

జీడీ నెల్లూరులో సామాజిక పెన్షన్ల పంపిణీ



గంగాధర నెల్లూరులో పరదేశి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం

గంగాధర నెల్లూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): 'అడవి పందులు పంటల్ని నాశనం చేసినట్టు.. ఐదేళ్ల పాటు వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని నాశనం చేశారు. గత ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రానికి అప్పులిచ్చే పరిస్థితి కనిపించడం లేదు. రాష్ట్రాభివృద్ధి కోసం నేను పరిగెత్తడంతో పాటు అధికారులనూ పరుగులు తీయిస్తున్నా. నాయకులనూ భాగస్వాములను చేస్తున్నా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శనివారం చిత్తూరు జిల్లా

మిగతా 13వ పేజీలో...



వలసలు లేని సీమను చూడాలన్నదే లక్ష్యం

అమ్మ ఆజ్ఞతో రాఘవేంద్రుడిని దర్శించుకున్నా..

13

గురు వైభవోత్సవాల్లో లోకేశ్

శనివారం కర్నూలు జిల్లా మంచాలమ్మ ఆలయంలో హారతి ఇస్తున్న మంత్రి లోకేశ్

రైతుల 'బకాయిలు' క్లియర్

2023-24 ధాన్యం కొనుగోళ్ల అప్పు

1,674.47 కోట్లు చెల్లించిన ప్రభుత్వం

వైసీపీ వదిలేసిన భూసార పరీక్షలపైనా దృష్టి 3

రాయితీపై సూక్ష్మ పోషకాల పంపిణీ పునరుద్ధరణ



ఆశాలకు వరం

రిటైర్మెంట్ తర్వాత రూ.1.5 లక్షల గ్రాట్యుటీ

42,752 మందికి నేరుగా ప్రయోజనం

పదవీవిరమణ వయసు 62 ఏళ్లకు పెంపు

ప్రసూతి సెలవుల కాలంలో వేతనాలూ..

మరో ఎన్నికల హామీ అమలుకు శ్రీకారం

ఆరోగ్యశాఖపై సమీక్షలో సీఎం కీలక నిర్ణయం

మా ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం: మంత్రి సత్యకుమార్

గ్రాట్యుటీపై నిర్ణయం తీసుకున్న తొలి రాష్ట్రం

వేతనాల్లోనూ ఏపీయే టాప్.. నెలకు పది వేలు

అమరావతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారు ఎప్పటినుంచో కోరుతున్న ప్రయోజనాల అమలుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఆశా వర్కర్లకు గ్రాట్యుటీని అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. గ్రాట్యుటీ చెల్లింపు ఏ విధంగా ఉండాలనేదానిపై నిర్ణయం తీసుకోవడానికి ముందుగా వివిధ రాష్ట్రాల్లోని ఆశా వర్కర్లకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించాలని సూచించారు. 30 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రతివారూ గ్రాట్యుటీకి అర్హులవుతారు. వారికి రిటైర్మెంట్ తర్వాత

మిగతా 13వ పేజీలో...

టీచర్ల బదిలీలకు చట్టం

ఏటా వేసవిలోనే బదిలీల ప్రక్రియ.. ఐదేళ్లు దాటితే తప్పనిసరి బదిలీ

నాలుగు కేటగిరీల్లో ప్రాధాన్యతా పాయింట్లు 14

టీచర్ల పనితీరుకూ ప్రత్యేకంగా కేటాయింపు

ముసాయిదా విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ

ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే సభలో బిల్లు



13

2029లోనూ మా సార్ సీఎం కావాలి!

బడ్జెట్‌లో తక్కువ రెవెన్యూ లోటు శుభపరిణామం

చంద్రబాబుకు ఎప్పటికీ రుణపడి ఉంటాను

రాష్ట్రాభివృద్ధికి ఆయనకు మద్దతుగా నిలవాలి

'ఎక్స్'లో ఫైబర్ నెట్ మాజీ చైర్మన్ జీవీ రెడ్డి

కొలువుల పత్రాలు లేకున్నా జీతాలు!

ఫైబర్‌నెట్‌లో వెలుగు చూసిన అక్రమం

సర్కారుకు ఇన్‌చార్జి ఎండీ నివేదిక 14

అయినా.. ఈ నెల జీతాల చెల్లింపునకు సిద్ధం

15 ఏళ్లు దాటిన వాహనాలకు ఇంధనం బంద్! 12

ఢిల్లీ సర్కార్ నిర్ణయం.. మార్చి 31 తర్వాత అమల్లోకి

మాకేంటి?

అహా! మాకేంటి?



పాలనను వ్యాపారంగా మార్చిన ట్రంప్

అప్పుల సంక్షోభంలో అమెరికా

ఇలాగే కొనసాగితే ఆర్థిక ఎమర్జెన్సీ

అందుకే పాత నిర్ణయాలపై సమీక్ష

ఉక్రెయిన్‌కు సాయపడినందుకు అక్కడి సహజ వనరులు ఇవ్వాలంటూ బేరం

చైనాతో సత్సంబంధాలకు తైవాన్‌తో ఇప్పటి వరకూ ఉన్న వైఖరికి నీళ్లు

డబ్బులు ఖర్చయ్యే ఒప్పందాలకు టాటా

పెద్దన్న పాత్రను వదులుకుని ఇకపై మిగతా దేశాలలో ఒకటిగా అమెరికా

'నాకేంటి? అహా! నాకేంటి?'.. గుర్తుందా? జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన సూపర్‌హిట్ సినిమా 'అహ నా పెళ్లంట'లో లక్ష్మీపతి (కోట శ్రీనివాసరావు) అనే పిసినారి పాత్రధారి మాటిమాటికీ అనే పాపులర్, సూపర్ హిట్ డైలాగ్ ఇది! డబ్బు తప్ప మరేదీ పట్టదా పీనాసి పేరయ్యకు!! కొన్ని వందల సంవత్సరాలుగా.. అగ్ర రాజ్యంగా, పెద్దన్నగా, ప్రపంచ పోలీసుగా వ్యవహరిస్తున్న అమెరికా దేశ అధ్యక్షుడిగా రెండోసారి పగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలి కూడా అచ్చం అలాగే, ఆ సినిమాలోని లక్ష్మీపతి పాత్రలాగానే ఉంది!! అన్నిటికీ ఆయనది ఒకటే మంత్రం.. "నాకేంటి? అహా! నాకేంటి" అని!! సరిగ్గా చెప్పాలంటే.. ఆయన ప్రభుత్వాన్ని నడుపుతున్నట్టు లేదు.. ఓ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని నడిపినట్టుగా పాలనా వ్యవహారాలు చేపడుతున్నారు! పెద్దన్న పాత్ర పోషిస్తూ వివిధ దేశాలు, సంస్థలకు

మిగతా 12వ పేజీలో...

ఉక్రెయిన్‌కు ఈయూ అండ

అదే బాటలో కెనడా.. ట్రంప్-జెలెన్‌స్కీ వాగ్వాదం నేపథ్యంలో అండగా ఉంటామని పోస్టులు

ఉక్రెయిన్‌కు నాటో భద్రత.. అమెరికాకు సామంతురాలిగా ఇకపై ఈయూ ఉండొద్దు

ఐరోపా దేశాలకు ఫ్రాన్స్ సూచన.. రష్యాది దురాక్రమణ: కెనడా

ఉక్రెయిన్ ఒంటరిగా లేదు: పోలాండ్.. నేడు బ్రిటన్‌లో ఐరోపా నేతల సదస్సు 12

డాక్టర్.. గుండెనొప్పి అమ్మా.. కడుపునొప్పి

సార్.. కేన్సర్ ఉందేమో..

కడప రిమ్స్‌లో పోసాని 'ఆపసోపాలు'

మూడు గంటలపాటు పరీక్షలు

ఏమీ లేదని తేల్చిన వైద్యులు

ఆస్పత్రిలో ఉంచనక్కర్లేదని వెల్లడి



13

పవన్‌పై నోరు పారేసుకుంటే సహించం

అలా మాట్లాడినందుకే ఒకరు జైల్లో ఉన్నారు

పవన్‌ది మానవత్వం, నిజాయితీతో కూడిన ప్రయాణం

విమర్శించే హక్కు ఎవరికీ లేదు

జనసేన ఆవిర్భావ సభ సన్నాహక సమావేశంలో మంత్రి నాదెండ్ల



13

కొట్టి.. సంతకం చేయించారు

అఫిడవిట్‌లో ఏం రాశారో నాకు తెలియదు

కాగితాలపై ఉన్నదంతా వంశీ మనుషులు రాసిందే

10న రాత్రంతా వల్లభనేని వంశీ ఫ్లాట్‌లోనే ఉంచారు

కేసుతో సంబంధం లేదని కోర్టులో చెప్పించారు

సత్యవర్ధన్ వాంగ్మూలంలో ప్రధానాంశాలు 13

న్యాయస్థానం నుంచి కాపీని తీసుకున్న పోలీసులు

మా మాతృమూర్తి జ్ఞాపకాలు సదా చిరస్మరణీయం

"జాతస్య హి ధ్రువో మృత్యుః
ధ్రువం జన్మ మృతస్య చ



తస్మాదపరిహార్యే అర్థేన
త్వం శోచితుమర్హసి"

కీ.శే. శ్రీమతి వెనిగళ్ళ సూర్యకుమారి గారు

జననం: 10-10-1941 - మరణం: 16-02-2025

1941 అక్టోబర్ 10వ తేదీన, చెన్నైలో శ్రీ వీరమాచినేని సత్యనారాయణ చౌదరి, మంగమ్మ పుణ్య దంపతులకు జన్మించిన **సూర్యకుమారి** గారు, 1957 మే 19వ తేదీన శ్రీ **వెనిగళ్ళ పార్థసారథి** గారిని వివాహమాడి అన్యోన్య దాంపత్యం సాగించి ఆదిదంపతులకు మారుపేరుగా నిలిచారు. అందరికీ మంచితనాన్ని పంచి, మంచికి మారుపేరుగా వేనోళ్ళ కొనియాడబడి, అందరి హృదయాల్లో సుస్థిర నివాసం ఏర్పరుచుకున్న మా మాతృమూర్తి **కీ.శే. శ్రీమతి వెనిగళ్ళ సూర్యకుమారి** గారు భగవంతునిలో ఐక్యమయ్యారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ పరమేశ్వరుడిని ప్రార్థిస్తూ ఘన నివాళి సమర్పిస్తున్నాము.

పెద్దకర్మ
తేది: **02 మార్చి** 2025, సమయం: ఉదయం 11:30 గంటల నుండి
కార్యస్థలం: **CK కన్వెన్షన్స్, NH - 16, మంగళగిరి, గుంటూరు జిల్లా.**

ఇట్లు

పెద్ద కుమారుడు - **ఆనంద్ స్వరూప్**, భార్య - **పద్మ**
పెద్ద మనవడు - **అవినాష్**, భార్య - **అఖిల**
చిన్న మనవడు - **అనుదీప్**

పెద్ద కుమార్తె - **సుధారాణి**, అల్లుడు - **సురేంద్రబాబు**
పెద్ద మనవరాలు - **సంధ్య**, భర్త - **పవన్**
ముని మనవరాలు & ముని మనవడు - **లిఖిత & హర్షదీప్**
చిన్న మనవరాలు - **సౌమ్య**, భర్త - **అజయ్**
ముని మనవరాలు - **శరణ్య**

చిన్న కుమారుడు - **నరేంద్రబాబు**, భార్య - **ఉష**
మనవడు - **సాయి ప్రవీణ్**, భార్య - **కీర్తి**
ముని మనవరాలు - **షివి**

చిన్న కుమార్తె - **శ్రీదేవి**, అల్లుడు - **సత్యనారాయణ**
పెద్ద మనవడు - **రవితేజ**
చిన్న మనవడు - **డా. సాయి అభిషేక్**, భార్య - **డా. మధులిక**

నలుగురు ఆణిముత్యాలకు జన్మనిచ్చి, అంతులేని ప్రేమాభిమానాలను పంచి, ఉన్నత వ్యక్తిత్వం కలిగిన పిల్లలుగా వారిని పెంచిన కీ.శే. శ్రీమతి వెనిగళ్ళ సూర్యకుమారి గారు నేడు మన మధ్య లేకున్నా, వారి కుమారుడు, మా చైర్మన్ శ్రీ నరేంద్రబాబు గారు వారి ఆశయాలను కొనసాగిస్తున్నారు. గత మూడున్నర దశాబ్దాలుగా ఎందరో డాక్టర్లను తయారు చేసి, 2021 సంవత్సరంలో శ్రీ గోసలైట్స్ ఎడ్యుకేషనల్ ఇన్ స్టిట్యూషన్స్ స్థాపించి, విజయవాడలో అగ్రగామి సంస్థగా అద్భుతంగా తీర్చిదిద్దారు. స్థాపించిన తొలి ఏడాదిలోనే 721 మంది, 2022లో 1,013 మంది, 2023లో 1,250 మంది, 2024లో 1,392 విద్యార్థులు డాక్టర్లు అయ్యేలా కృషి చేసారు. ఎన్నో కుటుంబాలకు అండగా నిలబడుతూ, శ్రీ గోసలైట్స్ సిబ్బందిని తమ కుటుంబంలో భావించి, ఉన్నత ఆశయాలను కొనసాగిస్తున్నారు.

కీ.శే. శ్రీమతి వెనిగళ్ళ సూర్యకుమారి గారికి అంజలి ఘటిస్తూ, వారి ఆత్మశాంతి కోసం భగవంతుని ప్రార్థిస్తున్నాము.

ఇట్లు
శ్రీ గోసలైట్స్ కుటుంబ సభ్యులు
అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది

Sri Gosalites - Vijayawada



తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షికోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఆది దంపతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేకువజామున 4.30 గంటల ప్రాంతంలో శివ పార్వతుల కల్యాణ ఘట్టం ముగిసింది. ఆదివారం కైలాసగిరి ప్రదక్షిణ కార్యక్రమం జరగనుంది.

- ఆంధ్రజ్యోతి, శ్రీకాళహస్తి

రైతుల 'బకాయిలు' క్లియర్

- **2023-24 ధాన్యం కొనుగోళ్ల అప్పు 1,674.47 కోట్లు చెల్లించిన కూటమి ప్రభుత్వం**
- **వైసీపీ వదిలేసిన భూసార పరీక్షలపైనా దృష్టి**
- **నిలిపివేసిన రాయితీపై సూక్ష్మ పోషకాల పంపిణీ పునరుద్ధరణ**



అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం వివిధ పథకాల కింద రైతులకు రూ.కోట్లలో బకాయి పెట్టిన సొమ్మును కూటమి ప్రభుత్వం చెల్లించింది. 2023-24లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రూ.1,674.47 కోట్లు అప్పటి ప్రభుత్వం బకాయి పెడితే ఈ మొత్తాన్ని సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతులకు చెల్లించింది. గత ఐదేళ్లలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు చెల్లించాల్సిన బకాయిలు రూ.1,166.99 కోట్లలో రూ.452.55 కోట్లు ఈ ఏడాది విడుదల చేశారు. విత్తన రాయితీ రూ.120 కోట్లను ఈ ప్రభుత్వం ఇచ్చింది. 2024 మేలో వడగండ్ల వాన, అధిక వర్షాలకు ఉద్యాన పంటలు నష్టపోయిన రైతులకు రూ.4.31 కోట్లను ఈ ఏడాది జనవరిలో విడుదల చేశారు. పామాయిల్ రైతులకు, కంపెనీలకు చెల్లించాల్సిన బకాయిలు రూ.238.90 కోట్లలో రూ.29.42 కోట్లు విడుదల చేయగా, ఎంఐడీహెచ్ పథకంలో చెల్లించాల్సిన రూ.93.54 కోట్లలో రూ.33.33 కోట్లు విడుదల చేసింది. విత్తన రాయితీకి సంబంధించి, ఇంకో రూ.100 కోట్లు త్వరలో ఇవ్వనున్నట్లు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో ప్రకటించారు. కాగా 2024-25లో పంటలను కోల్పోయిన రైతులకు నష్టపరిహారంగా రూ.119 కోట్లు పాత బకాయిల్ని ఈ ప్రభుత్వం చెల్లించింది. పీఎంఎంఎస్‌వై కింద 2025-26 బడ్జెట్‌లో రూ.417 కోట్లు ప్రతిపాదించారు. రాష్ట్రంలో భూసార పరీక్షలను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. కూటమి ప్రభుత్వం 2024-25లో 'సాయిల్ హెల్త్, ఫెర్టిలిటీ' పథకం కింద రూ.13.09 కోట్లతో 4.30 లక్షల భూసార పరీక్షా పత్రాలు రైతులకు అందించింది. 2025-26లో 6 లక్షల భూసార పరీక్ష పత్రాలు రైతులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం 3 లక్షల టన్నుల సూక్ష్మ పోషకాలను రైతులకు రాయితీపై ఇవ్వగా, 2019-24 మధ్య వైసీపీ సర్కార్ సూక్ష్మ పోషకాల పంపిణీని పూర్తిగా నిలిపివేసింది. 2025-26లో 5.98 లక్షల హెక్టార్ల రైతులకు రాయితీపై సూక్ష్మ పోషకాలు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రతి పనీ ప్రభుత్వ ఉద్యోగులే చేయలేరు

- **సాగునీటి విభాగం సలహాదారు కన్నయ్య నాయుడు**
- **నాణ్యమైన విద్య అందించకుంటే ద్రోహం చేసినట్టే: విశ్రాంత ఐఏఎస్ లక్ష్మీనారాయణ**

అనంతపురం సెంట్రల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఇంజనీర్లు తమలాగా మట్టిలో పుట్టి, మట్టినుంచి రాలేదని, సంపన్న కుటుంబాల నుంచి వచ్చారని, అందుకే రిస్క్ చేసేందుకు ముందుకు రారని రాష్ట్ర సాగునీటి విభాగం సలహాదారు కన్నయ్య నాయుడు అన్నారు. అనంతపురం నగరంలోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కాలేజీ 17వ వార్షికోత్సవంలో శనివారం ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఫౌండర్ డైరెక్టర్, విశ్రాంత ఐఏఎస్ లక్ష్మీనారాయణ, అనంతపురం జేఎన్టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వరదలు వచ్చినప్పుడు ప్రభుత్వ ఉద్యోగులే అన్ని పనులు చేయలేరని, గ్రామాలలో రైతులు సంఘటితమై, ప్రభుత్వం ఇచ్చే నిధులతో కాలువలను బాగుచేసుకోవాలని కన్నయ్యనాయుడు సూచించారు. ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యనందించాలని లక్ష్మీనారాయణ సూచించారు. విద్యకు ఎంత ఖర్చు పెడుతున్నామన్నది ముఖ్యం కాదని, ఏ విధంగా ఖర్చుచేస్తున్నామనేది ముఖ్యమని అన్నారు. గురువులను గౌరవించడం, ప్రజాస్వామ్య నిర్మాణంపై తరగతి గదిలో చర్చించాలని కోరారు. విద్యలో రాశి కాదని, వాసి కూడా ముఖ్యమేనని పేర్కొన్నారు. విద్యార్థులకు డిగ్రీ ఇచ్చి పంపడం కాదని, నైపుణ్యం పెంచి పంపాలని.. లేకుంటే ద్రోహం చేసినవారవుతారని స్పష్టంచేశారు.



అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కాలేజీ వార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న కన్నయ్య నాయుడు, లక్ష్మీనారాయణ

ఏయూ వీసీగా రాజశేఖర్ బాధ్యతల స్వీకారం



విశాఖపట్నం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, ప్రిన్సిపాల్స్, ప్రొఫెసర్లు శుభాకాంక్షలు తెలియజేశారు. వర్సిటీ ప్రగతికి అంకితభావంతో పనిచేస్తానని, ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించి వర్సిటీ కీర్తి ఇనుమడింపజేస్తానని రాజశేఖర్ పేర్కొన్నారు.

ఉపాధి కోసం వెళ్లి 20 ఏళ్లుగా వెట్టిచాకిరీ!

- **తమిళనాడులో మగ్గుతున్న 'మన్యం' వాసి**
- **కార్మిక శాఖ అధికారుల తనిఖీతో విముక్తి**
- **కుటుంబీకుల ఆచూకీ కోసం ప్రయత్నం**



అప్పారావు

బెలగాం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం పొరుగు రాష్ట్రానికి వెళ్లిన ఓ వ్యక్తి 20 ఏళ్లుగా జీతం లేని కూలీగా మారి వెట్టిచాకిరీ చేస్తున్నాడు. ఎట్టకేలకు కార్మిక శాఖ అధికారుల చొరవతో వెట్టి చాకిరీ నుంచి విముక్తి లభించినా, ఇప్పటికీ తన వారిని కలుసుకోలేక ఎదురు చూపులతో కాలం గడుపుతున్నాడు. పార్వతీపురం మన్యం జిల్లాకి చెందిన జాతాపు ఆదివాసి అప్పారావు 20 ఏళ్ల క్రితం స్వగ్రామం నుంచి కొంతమందితో కలిసి పని కోసం రైలులో పాండిచ్చేరి బయలుదేరాడు. మధ్యలో టీ తాగడానికి అప్పారావు రైలు దిగినప్పుడు రైలు వెళ్లిపోయింది. డబ్బులు లేకపోవడంతో.. ఎటు వెళ్లాలో తెలియక ఆయన అక్కడే ఉండిపోయాడు. తమిళనాడులో శివగంగ జిల్లా కదంబకళం ప్రాంతంలో ఇటీవల కార్మిక శాఖ అధికారుల తనిఖీల్లో అప్పారావు వ్యవహారం వెలుగుచూసింది. తమిళనాడులో ఓ వ్యక్తి జీతం ఇవ్వకుండా గొర్రెల కాపలాదారుడిగా పని చేయించుకున్నట్టు తేలింది. దీంతో 20 ఏళ్లుగా వెట్టిచాకిరిలో మగ్గిన అప్పారావుకు అధికారులు విముక్తి కలిగించారు. తనది పార్వతీపురం మండలం జమ్మువలస అని చెప్పాడని అక్కడి అధికారులు తెలిపారు. ఈ విషయం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు. జమ్మువలస, చుట్టు పక్కల గ్రామాల్లో విచారించి, అప్పారావు ఫోటో చూపించినా ఎవరూ గుర్తుపట్టలేకపోతున్నారని పార్వతీపురం రూరల్ ఎస్ఐ సంతోషి తెలిపారు. ప్రస్తుతం అప్పారావును మదురైలోని తాత్కాలిక వసతి గృహంలోనే ఉంచారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

▪ ఆర్కే RK



కొత్తపలుకు

‘తమ్ముళ్లూ’... తొందరొద్దు!

రాష్ట్ర శ్రేయస్సు ప్రజాహితాన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్డీయే కూటమి ఐక్యంగానే ఉంటుందని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి కనీసం మరో పదిహేనేళ్లు అధికారంలో కొనసాగుతామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శాసనసభ సాక్షిగా ప్రకటించారు. దగాపడ్డ ప్రజల కోసం తాము కూటమిగా ఏర్పడ్డామని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా చెప్పారు. రాష్ట్రం హితవు కోరేవారు ఈ ఇరువురి ప్రకటనలను కచ్చితంగా స్వాగతిస్తారు. అయితే, పవన్ కల్యాణ్ చెబుతున్నట్టుగా పదిహేనేళ్లపాటు ఎన్డీయే కూటమి అధికారంలో కొనసాగాలంటే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేయాలి. 2019లో 151 సీట్ల భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి కూడా తాను 30 ఏళ్ల పాటు అధికారంలో కొనసాగుతానని ప్రకటించారు. అయితే, ఆ తర్వాత ఆయన పాలన ఎలా సాగిందో చూశాం. 2024 ఎన్నికల్లో ఆయనను 11 సీట్లకు మాత్రమే పరిమితం చేస్తూ 164 సీట్ల అతి భారీ మెజారిటీతో చంద్రబాబు నేతృత్వంలోని

> “ తెలుగు తమ్ముళ్లు సోషల్ మీడియా వేదికగా అతిగా స్పందిస్తే దాని ప్రభావం ప్రభుత్వ నిర్ణయాలపై పడే ప్రమాదం లేకపోలేదు. అదే జరిగితే తెలుగుదేశం పార్టీకే కాదు– రాష్ట్రానికి కూడా కీడు చేసిన వాళ్లవుతారు. రాష్ట్ర హితం కోసం పదిహేనేళ్లపాటు అధికారంలో ఉంటామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెబుతున్న మాటలకు విలువ లేదా? జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే... అని ఇప్పటికీ అనేక మంది భయపడుతున్నారు. ఇలా భయపడుతున్న వారిలో అధికారులు కూడా ఉన్నారు. అందుకే వారు తమ జాగ్రత్తలు తాము తీసుకుంటున్నారు. జగన్‌రెడ్డి ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లీ అధికారంలోకి రారన్న నమ్మకాన్ని ప్రజాబాహుళ్యానికి కల్పించాల్సిన బాధ్యత చంద్రబాబు, పవన్ కల్యాణ్ మీదనే కాదు– తెలుగు తమ్ముళ్ల మీద కూడా ఉంది.

ఎన్డీయే కూటమికి ప్రజలు అధికారం కట్టబెట్టారు. తాము సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగాలని నాయకులు సహజంగానే కోరుకుంటారు. అయితే ఎవరిని ఎంతకాలం అధికారంలో కూర్చోబెట్టాలో నిర్ణయించేది మాత్రం ప్రజలే. ఈ వాస్తవాన్ని కూటమి నాయకులు కూడా గుర్తించాలి. 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్లు తిరిగేసరికి 11 సీట్లకే ఎందుకు పరిమితం కావలసివచ్చిందో గుర్తించి, అవే తప్పులు చేయకుండా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తే కూటమి ప్రభుత్వం పదిహేనేళ్ల పాటు అధికారంలో కొనసాగవచ్చు కూడా! అలా కాకుండా జగన్‌రెడ్డి పాలన తరహాలోనే కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు వ్యవహరిస్తే ఐదేళ్లు గడిచేసరికి మూటా ముల్లె సర్దుకోవలసి రావచ్చు కూడా! అదే జరిగితే చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. తాము పద్ధతిగా ఉండటమే కాకుండా తమ పార్టీల ఎమ్మెల్యేలు కూడా పద్ధతిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ఈ ఇరువురు నాయకులపై ఉంది. జగన్‌రెడ్డి పుణ్యమా అని రాష్ట్రంలో పాలెగాళ్ల సంస్కృతి ప్రవేశించింది. అధికార దుర్వినియోగం, కక్ష సాధింపులు పాలకుల దినచర్యలుగా మారిపోయాయి. ఈ అవలక్షణాల వల్ల రాజకీయ నాయకులే కాదు– వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు కూడా ఇబ్బందుల పాలయ్యారు. ఈ కారణంగానే 60 శాతం ప్రజలు సంఘటితమై కూటమికి బ్రహ్మరథం పట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు దాటింది. ఈ ఎనిమిది నెలలలో ప్రభుత్వం పనితీరును ప్రజలు గమనిస్తున్నారు.

‘సోషల్’ రచ్చ...

అధికారం వచ్చిందంటే ప్రజలకు మేలు చేయడానికి కాదు, పగలూ ప్రతీకారాలు తీర్చుకోవడానికి అన్నట్టుగా ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు కలుషితమయ్యాయి. అధికార కూటమి ఎమ్మెల్యేలు కొందరు గత ప్రభుత్వ దురాగతాలను ఆదర్శంగా తీసుకోగా, కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేస్తూ ప్రభుత్వం స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోలేని విధంగా ఒత్తిడి తెస్తున్నారు. ముఖ్యమంత్రి ఏం చేయాలో, ఎలా ఉండాలో సోషల్ మీడియా వేదికగా ప్రకటించడమే కాకుండా ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఈ పరిస్థితి లేదు. ప్రభుత్వం అరాచకంగా వ్యవహరించినా సోషల్ మీడియాలో వైసీపీ అభిమానులు నోరు విప్పేవారు కారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపకపోవడం కూడా తప్పిదమే! అయితే ప్రభుత్వంలో జరుగుతున్న వాటికి సంబంధించి లోతుగా అధ్యయనం చేయకుండానే విమర్శలు చేయడం సరైనది కాదు. జగన్‌రెడ్డితో పాటు అధికారంతో విర్రవీగిన వారందరినీ వెంటనే జైల్లో పెట్టాలని తెలుగు తమ్ముళ్లు కోరుకుంటున్నారు. ప్రభుత్వం అంటే రూల్ ఆఫ్ లా పాటించాలన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరిస్తున్నారు. జగన్ పాలనలో రూల్ ఆఫ్ లా పాటించడం లేదని, ముందుగా అరెస్టులు చేసి ఆ తర్వాత కేసులు కట్టేవారని గగ్గోలు పెట్టిన వాళ్లు, అప్పుడు బాధితులైన వాళ్లు... ఇప్పుడు జగన్ హయాంలో జరిగిన విధంగా కేసులు పెట్టకుండానే జైళ్లలో పెట్టాలని కోరడం ఏమిటి? జగన్ ఎందుకు ఓడిపోయారో తెలుసుకోకపోతే ఎలా? పోలీసుల ద్వారా అరెస్టు చేయించడం చిటికెలో పనే కావచ్చు. అయితే ఆ తర్వాత సదరు కేసులు న్యాయ సమీక్షలో నిలబడాలి కదా? ఈ కారణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు సమయం, సందర్భం కోసం ఎదురుచూస్తున్నారు. ఏకంగా తన సతీమణి భువనేశ్వరినే దారుణంగా అవమానించిన వల్లభనేని వంశీ వంటి వారిపై చర్యలు తీసుకోవడానికి కూడా సందర్భం కోసం వేచిచూశారు. ‘అప్పుడు నా భార్యను అవమానించాడు కాబట్టి ఇప్పుడు జైల్లో పెట్టండి’ అంటే కుదరదు కదా? అందుకే కొంచెం ఆలస్యమైనా వల్లభనేని వంశీ ప్రస్తుతం జైలుకే పరిమితం అయ్యారు. పోసాని కృష్ణ మురళి విషయంలో కూడా ఇదే జరిగింది. ప్రభుత్వం అన్నాక అనేక సాదకబాధకాలు ఉంటాయి. వాటి గురించి తెలుసుకోకుండా విమర్శలు చేయడం సబబు కాదు. ఏ విషయంలోనైనా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆచితూచి నిర్ణయం తీసుకుంటారు. లేడికి లేచిందే పరుగు అన్నట్టుగా... అధికారంలో ఉన్నప్పుడు అరాచకాలు చేశారనుకున్న వారందరినీ కనీస ఆధారాలు సేకరించకుండా జైల్లో పెట్టడం కుదరదు. ఏపీ ఫైబర్ నెట్ సంస్థ చైర్మన్ జీవీ రెడ్డికి, ఆ సంస్థ ఎండీ దినేశ్‌కీ ఏర్పడిన వివాదంపైన కూడా సోషల్ మీడియా వేదికగా తెలుగు తమ్ముళ్లు ముఖ్యమంత్రిపై దుమ్మెత్తి పోశారు. జీవీ రెడ్డి విద్యావంతుడు–మంచివాడే! కానీ కించిత్ ఆవేశపరుడు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎలా ఉన్నా చెల్లుబాటవుతుంది. అధికారంలోకి వచ్చాకే అందరినీ కలుపుకొనివెళ్లాలి. ఫైబర్ నెట్ ఎండీ దినేశ్ వైశ్య సామాజికవర్గానికి చెందినవారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో కులాలకు ఎంత ప్రాధాన్యం ఉందో అందరికీ తెలిసిందే. ఈ కారణంగానే జీవీ రెడ్డికి ఆవేశపడకుండా సర్దుకుపోవలసిందిగా పార్టీ నాయకత్వం సూచించింది. అయితే ముక్కుసూటిగా వ్యవహరించే జీవీ రెడ్డికి ఇది రుచించినట్టు లేదు. దీంతో ఆయన చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో పాటు తెలుగుదేశం పార్టీకి కూడా రాజీనామా చేశారు. ఈ పరిణామంపై సోషల్ మీడియాలో రచ్చ జరిగింది. జీవీ రెడ్డి వంటి వారిని వదులుకోకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబుపై తెలుగు తమ్ముళ్లు ఒత్తిడి తెచ్చారు. అంతటితో ఆగకుండా రెండు రోజుల క్రితం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి బుద్ధి చెప్పాలని పోస్టులు పెట్టారు. మొదటికే మోసం వచ్చేలా తెలుగు తమ్ముళ్లు వ్యవహరించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. జగన్‌రెడ్డి పాలనలో ఎదురైన చేదు అనుభవాలను ఇంత త్వరగా ఎలా మరచిపోయారా అని మరింత ఆశ్చర్యం వేస్తోంది. జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే పరిణామాలు ఎలా ఉంటాయో తెలియదా? తెలుగు తమ్ముళ్ల ఆవేశం చల్లారక ముందే, చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌ను జీవీ రెడ్డి ప్రశంసించడంతో పాటు రాష్ట్రం కోసం 2029లో కూడా చంద్రబాబే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నానని ఎక్స్ వేదికగా ప్రకటించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ చెబుతున్నట్టుగా కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం రాష్ట్రానికి, ప్రజలకు అవసరం! తెలుగు తమ్ముళ్లు ఈ వాస్తవాన్ని గుర్తించకుండా అతిగా స్పందిస్తూ అలజడి సృష్టిస్తున్నారు. ప్రభుత్వపరంగా జరుగుతున్న లోపాలతో మంత్రి లోకేశ్‌కు నేరుగా సంబంధం లేకపోయినా ఆయనను కూడా విమర్శిస్తున్నారు.



సొంత శ్రేణులే సమస్యగా మారితే...

వైసీపీ, జనసేన పార్టీలకు కూడా సోషల్ మీడియా బలంగా ఉంది. అయితే ఆ పార్టీల మద్దతుదారులు తమ నాయకులపై ఈగ వాలనివ్వరు. తెలుగుదేశం పార్టీలో మాత్రం ఇందుకు భిన్నమైన ధోరణి కనిపిస్తున్నది. ప్రభుత్వం తప్పు చేస్తే జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారేమోనన్న భయంతో తెలుగు తమ్ముళ్లు అతిగా స్పందిస్తున్నారన్న భావన కూడా ఉంది. కారణం ఏమైనప్పటికీ తెలుగు తమ్ముళ్ల అతి స్పందన ముఖ్యమంత్రి చంద్రబాబుకు తలపోటుగా మారింది. ఒకవైపు ప్రతిపక్షమైన వైసీపీ దుష్ప్రచారాన్ని ఎదుర్కొంటూ, మరో వైపు సొంత పార్టీ కార్యకర్తల నుంచి కూడా విమర్శలు ఎదుర్కోవలసి రావడం చంద్రబాబుకు ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు. దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు ఉన్నాయి. వాటన్నింటికీ కూడా సోషల్ మీడియా వేదికలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ విషయంలోనే ఇలా ఎందుకు జరుగుతోంది? మిగతా పార్టీల కోసం పని చేస్తున్న సోషల్ మీడియా వర్కర్లు తమ పార్టీలపై ఈగను కూడా వాలనివ్వకుండా ఎందుకు కాపాడుకుంటున్నారు? పొరపాట్లను ఎత్తిచూపడం వేరు, ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టడం వేరు. వల్లభనేని వంశీ, పోసాని కృష్ణ మురళి వంటి వారిపై చర్యలు తీసుకోవడంతో జగన్ అండ్ కో చేస్తున్న దుష్ప్రచారం, పోకడలను గమనిస్తూ కూడా పార్టీకి అండగా నిలబడకుండా గుదిబండగా మారడమేమిటి? ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్న వారంతా నిజంగా తెలుగు తమ్ముళ్లేనా? లేక వారి ముసుగులో వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారా? అన్న సందేహం కూడా కలుగుతోంది. స్వల్ప విషయాలకు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు అతిగా స్పందిస్తారన్న అపవాదు ఉంది. ఈ నేపథ్యంలో తెలుగు తమ్ముళ్లు సోషల్ మీడియా వేదికగా అతిగా స్పందిస్తే దాని ప్రభావం ప్రభుత్వ నిర్ణయాలపై పడే ప్రమాదం లేకపోలేదు. అదే జరిగితే తెలుగుదేశం పార్టీకే కాదు– రాష్ట్రానికి కూడా కీడు చేసిన వాళ్లవుతారు. రాష్ట్ర హితం కోసం పదిహేనేళ్లపాటు అధికారంలో ఉంటామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెబుతున్న మాటలకు విలువ లేదా?

> “ కారణం ఏమైనప్పటికీ తెలుగు తమ్ముళ్ల అతి స్పందన ముఖ్యమంత్రి చంద్రబాబుకు తలపోటుగా మారింది. ఒకవైపు ప్రతిపక్షమైన వైసీపీ దుష్ప్రచారాన్ని ఎదుర్కొంటూ, మరోవైపు సొంత పార్టీ కార్యకర్తల నుంచి కూడా విమర్శలు ఎదుర్కోవలసి రావడం చంద్రబాబుకు ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు. దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు ఉన్నాయి. వాటన్నింటికీ కూడా సోషల్ మీడియా వేదికలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ విషయంలోనే ఇలా ఎందుకు జరుగుతోంది? పొరపాట్లను ఎత్తిచూపడం వేరు, ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టడం వేరు. వల్లభనేని వంశీ, పోసాని కృష్ణ మురళి వంటి వారిపై చర్యలు తీసుకోవడంతో జగన్ అండ్ కో చేస్తున్న దుష్ప్రచారం, పోకడలను గమనిస్తూ కూడా పార్టీకి అండగా నిలబడకుండా గుదిబండగా మారడమేమిటి? ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నవారంతా నిజంగా తెలుగు తమ్ముళ్లేనా? లేక వారి ముసుగులో వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారా? అన్న సందేహం కూడా కలుగుతోంది.

జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే... అని ఇప్పటికీ అనేక మంది భయపడుతున్నారు. ఇలా భయపడుతున్న వారిలో అధికారులు కూడా ఉన్నారు. అందుకే వారు తమ జాగ్రత్తలు తాము తీసుకుంటున్నారు. జగన్‌రెడ్డి ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లీ అధికారంలోకి రారన్న నమ్మకాన్ని ప్రజాబాహుళ్యానికి కల్పించాల్సిన బాధ్యత చంద్రబాబు, పవన్ కల్యాణ్ మీదనే కాదు– తెలుగు తమ్ముళ్ల మీద కూడా ఉంది. చంద్రబాబు వైఖరి వల్ల జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారన్న భయంతో ఆయనకు పావులుగా ఉపయోగపడుతున్న వాస్తవాన్ని తెలుగు తమ్ముళ్లు మరచిపోతున్నారు.

ఇలా చేయండి...

జగన్‌రెడ్డి తన ఒంటికి సరిపడని అనేక సూక్తులను, నీతి వాక్యాలను ఇప్పుడు అలవోకగా వల్లెవేస్తున్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం, పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు, రూల్ ఆఫ్ లా వంటి పదాలు జగన్‌రెడ్డి ఒంటికి సరిపడవు. తాను అధికారంలో ఉన్నప్పుడు ఆంధ్రజ్యోతి, ఏబీఎన్‌తో పాటు మరి కొన్ని మీడియా సంస్థలను అసెంబ్లీ సమావేశాలు కవర్ చేయకుండా ఐదేళ్ల పాటు నిషేధించిన జగన్‌రెడ్డి, ఆ సంస్థల ప్రతినిధులను ముఖ్యమంత్రి నివాసం దరిదాపులకు కూడా రానివ్వలేదు. ఇప్పటికీ తమ పార్టీ ఏర్పాటు చేసే విలేకరుల సమావేశాలకు రానివ్వడం లేదు. అలాంటి జగన్ ఇప్పుడు పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగిందని విమర్శించడం విడ్డూరంగా ఉంది. రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలు, రూల్ ఆఫ్ లా వంటి పదాలకు తన పాలనలో తావుండదని రుజువు చేసిన మనిషి ఇప్పుడు అవే సూక్తులు చెబుతున్నారు. ప్రజల జ్ఞాపకశక్తి తక్కువని అంటారు. వచ్చే ఎన్నికల నాటికి ఐదేళ్ల క్రితం ఏం జరిగిందో ప్రజలు మరచిపోయే ప్రమాదం ఉంది. ఈ కారణంగా తెలుగు తమ్ముళ్లు తమ శక్తియుక్తులను గత దురాగతాలను ప్రజలకు పదేపదే గుర్తు చేయడానికి వినియోగిస్తే మంచిది. రాష్ట్రం మేలు కోసం తాము ఐక్యంగానే ఉంటామని చెబుతున్న పవన్ కల్యాణ్ క్షేత్ర స్థాయిలో కార్యకర్తల మధ్య కూడా సఖ్యత ఏర్పడేలా చర్యలు తీసుకుంటే మంచిది. అదే సమయంలో కూటమి భాగస్వామ్య పక్షాలు తమ పార్టీ శాసనసభ్యులు కట్టు తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ దిశగా కృషి చేస్తే జగన్‌రెడ్డి అనే రాజకీయ భూతాన్ని ప్రజలే అధికారానికి దూరంగా కూర్చోబెడతారు.

> “ సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగాలని నాయకులు సహజంగానే కోరుకుంటారు. అయితే ఎవరిని ఎంతకాలం అధికారంలో కూర్చోబెట్టాలో నిర్ణయించేది మాత్రం ప్రజలే. ఈ వాస్తవాన్ని కూటమి నాయకులు కూడా గుర్తించాలి.

తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త అధ్యాయం

ఇప్పుడు తెలంగాణ రాజకీయాలకు వద్దాం! రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంచి రోజులు వస్తున్నట్టున్నాయి. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్‌ను పార్టీ అధిష్ఠానం నియమించడమే ఇందుకు నిదర్శనం. గతంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఎలా వ్యవహరించారో చూశాం. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇన్‌చార్జిలుగా వ్యవహరించినవారు పార్టీ శ్రేయస్సును పట్టించుకోకుండా స్వప్రయోజనాలనే చూసుకున్నారు. నిన్నటి వరకు ఇన్‌చార్జిగా ఉన్న దీపాదాస్ మున్షీ కూడా ఇందుకు భిన్నం కాదు. తమను సంతృప్తిపరచిన వారికి అనుకూలంగా అధిష్ఠానానికి నివేదికలు పంపేవారు. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇన్‌చార్జిగా ఉండిన గులాం నబీ అజాద్‌కు భారీగా ముడుపులు అందేవన్నది బహిరంగ రహస్యం. ఇలాంటి వారివల్ల బలమైన నాయకులు తెరమరుగయ్యారు. అంతిమంగా అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ బలహీనపడింది. ఇంతకాలానికి కాంగ్రెస్ అధిష్ఠానం అసలు సిసలైన గాంధేయవాదాన్ని నమ్ముకొని ఆచరిస్తున్న మీనాక్షి నటరాజన్‌ను తెలంగాణ ఇన్‌చార్జిగా నియమించింది. కాంగ్రెస్ పార్టీలో ఇప్పటికీ కూడా మీనాక్షి వంటి వారు ఉన్నారని నిన్నటి వరకు మనకు తెలియదు. ఆమె గురించి మీడియాలో వచ్చిన కథనాలు ఆశ్చర్యం కలిగించాయి. చోటా మోటా నాయకులు కూడా రైలు ప్రయాణాలను మరచిపోయిన ఈ రోజుల్లో రాష్ట్ర ఇన్‌చార్జిగా నియమితురాలైన తర్వాత తొలిసారిగా ఢిల్లీ నుంచి హైదరాబాద్ రైలులో ప్రయాణించిన మీనాక్షి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఫైవ్ స్టార్ హోటళ్లలో మాత్రమే బస చేయడం తెలిసిన గత ఇన్‌చార్జిలకు భిన్నంగా ఆమె ప్రభుత్వ అతిథి గృహంలో రోజుకు 50 రూపాయలు చెల్లించి బసచేస్తున్నారు. సన్మానాలు, బొకేలు, ఫ్లెక్సీల సంస్కృతి కూడా తన ఒంటికి పడదని ఆమె రాష్ట్ర నాయకుల ముఖం మీదే చెప్పారు. దీంతో శుక్రవారం నాడు గాంధీభవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగినా హడావిడి, ఆర్భాటం కనిపించలేదు. ఈ నేపథ్యంలో గాడి తప్పుతున్న కాంగ్రెస్ పార్టీని మీనాక్షి గాడిలో పెట్టగలరన్న నమ్మకం కలుగుతోంది. పార్టీకి ఉపయోగపడేవారు ఎవరు? పార్టీని ఉపయోగించుకొనేవారు ఎవరు? అన్నది అనతి కాలంలోనే ఆమె గుర్తించగలరని ఆశించవచ్చు. నిరాడంబరంగా ఉండటమే కాకుండా పార్టీ శ్రేయస్సు మాత్రమే మీనాక్షికి ముఖ్యమని స్పష్టమవుతున్నందున క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తూ ఆమె అధిష్ఠానానికి నివేదికలు పంపుతారని నమ్మవచ్చు. ప్రస్తుతానికి కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒంటరి పోరు చేస్తున్నారు. పార్టీ నాయకులు తనకు అండగా నిలవడం లేదని రేవంత్‌రెడ్డి తన మనసులోని ఆవేదనను పరోక్షంగా బయటపెట్టారు. మంచి మాటను మైక్‌లో చెప్పాలి, చెడును చెవిలో చెప్పాలి అని గుర్తు చేయడం ద్వారా రాష్ట్ర కాంగ్రెస్‌లో ఏం జరుగుతోందో చెప్పకనే చెప్పారు. ముఖ్యమంత్రిగా తాను అనుకున్నట్టుగా పని చేయలేకపోతున్నానన్న అసంతృప్తి తనకు ఉందని కూడా ఆయన తెలిపారు. గత పదిహేను మాసాలలో ప్రభుత్వం ఎన్నో చేసినా... వాటి గురించి మాట్లాడకుండా లోపాలను ఎత్తిచూపుతున్నారని కూడా రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోనే ఈ లోపం ఉంది. అధికారంలో ఉన్నప్పుడు చేసిన వాటి గురించి పార్టీ నాయకులు పెద్దగా ప్రచారం చేసుకోరు. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాత్రం ఇందుకు విరుద్ధంగా పార్టీ నాయకులు అందరూ ఆయనను మోశారు. ఫలితంగానే ఆయన రెండో పర్యాయం ముఖ్యమంత్రి అయ్యారు. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకుంది. చట్టాలు చేసింది. ఉపాధి హామీ పథకం, భూ సేకరణ చట్టం, విద్యా హక్కు చట్టాలు యూపీఏ ప్రభుత్వం హయాంలో వచ్చినవే. ఉపాధి హామీ పథకం వల్ల దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రయోజనం పొందుతున్నారు. కానీ, కాంగ్రెస్ నాయకులు ఆ పథకం తాము తెచ్చిందే అని ప్రచారం చేసుకోరు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం నాడు గాంధీభవన్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో తన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ఏకరువు పెట్టారు. అవన్నీ వింటున్నప్పుడు నిజంగా ఇన్ని నిర్ణయాలు తీసుకున్నారా అని ఆశ్చర్యం వేసింది. అయినా, అనుభవం లేనందున ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి విఫలమవుతున్నారన్న ప్రచారమే పెరిగింది. ఈ ప్రచారమే అంతిమంగా కాంగ్రెస్ పార్టీకి కీడు చేస్తుంది. ఇప్పుడు ప్రలోభాలకు లొంగని మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా వచ్చినందున పరిస్థితిలో మార్పు రావచ్చు.

మీనాక్షి కర్తవ్యం...

తెలంగాణలో మంత్రుల నుంచి కింది స్థాయి కార్యకర్తల వరకు ఎవరు ఏమిటి? ప్రజల్లో ఎవరికి బలముంది? పార్టీకి ఉపయోగపడేది ఎవరు? పార్టీకి గుదిబండలుగా మారుతున్నది ఎవరు? ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డికి స్వేచ్ఛను ఇవ్వడం అవసరమా? లేదా? వంటి విషయాలను మీనాక్షి ముందుగా అధ్యయనం చేయాలి. రాహుల్‌గాంధీకి ఆమె నమ్మకమైన వ్యక్తి కనుక మీనాక్షి ఇచ్చే నివేదికలకు విలువ ఉండవచ్చు. పనిలో పనిగా ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం తెలుసుకోవడానికి నూతన ఇన్‌చార్జి ప్రయత్నించాలి. నిష్పాక్షికంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మార్గదర్శనం చేస్తే పార్టీ పరిస్థితి మెరుగుపడవచ్చు. మంత్రులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పట్టులేదన్న అభిప్రాయం విస్తృతంగా ఉంది. ఈ అభిప్రాయాన్ని పోగొట్టేందుకు ఆమె కృషి చేయాలి. ముఖ్యమంత్రికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చినప్పుడే వారు సమర్థులో కాదో స్పష్టమవుతుంది. కొన్ని మంత్రిత్వ శాఖల్లో జోక్యం చేసుకోకూడదని ముఖ్యమంత్రిపై ఆంక్షలు పెట్టడం ఏమిటి? కాంగ్రెస్ అధిష్ఠానం చేసిన అతి పెద్ద తప్పు ఇది. ప్రజల్లో, పార్టీ శాసనసభ్యుల్లో ఎవరికి పరపతి ఉంది? ఎవరిని ఎంత వరకు ప్రోత్సహించాలి? అనే విషయమై మీనాక్షి నటరాజన్ అవగాహన ఏర్పరుచుకోవాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం నాడు తన మనసులోని ఆవేదనను బయటపెట్టుకున్నారు. నిజానికి గత కొంత కాలంగా రేవంత్‌రెడ్డి సంతోషంగా లేరు. కాళ్లూ చేతులూ కట్టేసి ఈదమన్నట్టుగా తన పరిస్థితి ఉందని ఆయన కొంత మంది వద్ద ఆవేదన కూడా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని నడపడమే కాదు– ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పైన ఉంటుంది. ఇందుకోసం ఆయనకు తగినంత స్వేచ్ఛ ఇచ్చి చూడాలి. మీనాక్షి నటరాజన్ కార్యకర్త స్థాయి నుంచి వచ్చినందున క్షేత్ర స్థాయి పర్యటనలు జరిపి ప్రజాభిప్రాయంతోపాటు కార్యకర్తల అభిప్రాయాలూ తెలుసుకునే కార్యక్రమానికి వెంటనే శ్రీకారం చుట్టాలి. మీనాక్షి మార్గదర్శకంలో రాష్ట్ర కాంగ్రెస్‌కు కాయకల్ప చికిత్స వెంటనే ప్రారంభమవ్వాలి. ఈ ఏడాది చివరి నాటికి ప్రభుత్వ ప్రతిష్ఠను ఇనుమడింపజేయడానికి కృషి జరగని పక్షంలో ప్రతిపక్షాలు బలపడతాయి. రేవంత్‌రెడ్డి అరమరికలు లేకుండా మీనాక్షి నటరాజన్‌తో చర్చలు జరపాలి. ప్రభుత్వాన్ని మరింత సమర్థంగా నడుపుతూ ప్రజల మన్ననలు చూరగొనడానికి తన వద్ద ఉన్న ప్రణాళికలను ఆమెకు వివరించి, ఆ క్రమంలో తనకు ఏ మేరకు స్వేచ్ఛ అవసరమో చెప్పుకోవాలి. కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద ఆమెకు పరపతి, విశ్వసనీయత ఉన్నందున ముఖ్యమంత్రికి ఆమె అండగా నిలబడవచ్చు. అదే జరిగితే ఇటు రేవంత్‌రెడ్డికి, అటు కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వస్తాయి. ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక నాయకురాలి గురించి నాలుగు మంచి మాటలు చెప్పుకొనే అవకాశం ఇంత కాలానికి లభించింది. ఇందుకు పార్టీ అధిష్ఠానాన్ని అభినందించాల్సిందే!

> “ జగన్‌రెడ్డితో పాటు అధికారంతో విర్రవీగిన వారందరినీ వెంటనే జైల్లో పెట్టాలని తెలుగు తమ్ముళ్లు కోరుకుంటున్నారు. ప్రభుత్వం అంటే రూల్ ఆఫ్ లా పాటించాలన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరిస్తున్నారు. జగన్ పాలనలో రూల్ ఆఫ్ లా పాటించడం లేదని, ముందుగా అరెస్టులు చేసి ఆ తర్వాత కేసులు కట్టేవారని గగ్గోలు పెట్టినవాళ్లు, అప్పుడు బాధితులైనవాళ్లు... ఇప్పుడు జగన్ హయాంలో జరిగిన విధంగా కేసులు పెట్టకుండానే జైళ్లలో పెట్టాలని కోరడం ఏమిటి? జగన్ ఎందుకు ఓడిపోయారో తెలుసుకోకపోతే ఎలా? పోలీసుల ద్వారా అరెస్టు చేయించడం చిటికెలో పనే కావచ్చు. అయితే ఆ తర్వాత సదరు కేసులు న్యాయ సమీక్షలో నిలబడాలి కదా? ఈ కారణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు సమయం, సందర్భం కోసం ఎదురుచూస్తున్నారు. ఏకంగా తన సతీమణి భువనేశ్వరినే దారుణంగా అవమానించిన వల్లభనేని వంశీ వంటి వారిపై చర్యలు తీసుకోవడానికి కూడా సందర్భం కోసం వేచిచూశారు.

సమాంతర ప్రత్యామ్నాయమే గెలుపు దారి!

భూస్వామ్యం, పెట్టుబడిదారీ వ్యవస్థలు కలగలసి అధికారం పాలుపంచుకుంటున్న వర్గ సమాజంలో సంపన్న వర్గాల సాహిత్య భాషా సంస్కృతులు ప్రధాన స్రవంతిగా అమలవుతాయి. ప్రజల సాహిత్యం, కళలు ప్రత్యామ్నాయ లేదా సమాంతర పాయగా పిలువబడతాయి. దీనినే ‘సమాంతర ప్రత్యామ్నాయం’ అందాం.

ఆధునిక కాలంలో సినిమా, నాటకం, నవల, వచన కవిత, ఫోటోగ్రఫీ, చిత్రకళ ప్రధాన స్రవంతిగా ప్రచారం పొందుతున్నాయి. సినిమాల్లో ఉన్నత శిష్ట చరిత్రలో భాగంగా పౌరాణికాన్ని ఇతివృత్తంగా గ్రహిస్తారు. ప్రత్యామ్నాయ రంగం నుండి కొన్ని పాటలను, కొందరు ప్రజావీరుల చరిత్రలను కేవలం లాభాల కోసం మాత్రమే తీసుకుంటారు. ప్రత్యామ్నాయ రంగంలో వినపడే, కనపడే భాష సినిమాల్లో విలన్లకు, జోకర్లకు మాత్రమే వాడబడుతుంది. ప్రాచీన కాలంలో వివిధ పోరాటాలలో అమరులైన ప్రజావీరుల చరిత్ర అనామకం అయిపోతుంది. ఆ ప్రజావీరులపై ప్రజలు పాడుకునే సాహిత్యం గిరిజనమై, జానపదమై అంటరాకుండా మూలల్లోకి తోసివేయబడుతుంది. ఈ దేశంలో వేలాది కులాలు, వారి దైవాలు, దేవతలు, కొలుపుల వంటివి అవమానింపబడతాయి. ఈ ధోరణిని ఆధునిక/ ప్రగతిశీల వ్యక్తులు, వేదికలు సైతం నిరాఘటంగా కొనసాగిస్తాయి. కొన్ని వేదికలు తమకు అర్థమైన, తమ పాత్ర ఉన్న రచనలకు, తమ వారిగా ముద్ర వేసుకున్న రచయితలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తాయి. ఈ కారణం చేతనే ఈ రచనలు ప్రధాన స్రవంతిలోకి వచ్చి నిలుస్తాయి తప్ప వాటి రచనా శక్తిని బట్టి కాదు.

ఈ నేపథ్యంలో ఆయా కుల వర్గాల నుండి వచ్చిన చాలామంది రచయితలు తమ గురించి తాము, తమ వర్గాల గురించి తాము అనివార్యంగా రాసుకున్నారు. ఈ సజీవ ఇతివృత్తాలు తెలుగు సాహిత్యానికి పెట్టని సొమ్ములయ్యాయి. ఆధునిక సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. ఈ సాహిత్యం లేకపోతే, ఈ రచయితలు రాయకపోతే తెలుగు సాహిత్యం పక్షవాతంతో చచ్చుపడిన శరీరంలా ఉండేది.

వివిధ భాషలలోకి తర్జుమా చేయవలసిన గొప్ప రచనలు ప్రత్యామ్నాయ సాహిత్యంలో అనేకం వున్నాయి. ఈ సాహిత్యానికి కౌంటర్‌గా శిష్ట రచయితలు భావోద్వేగ ఆరాటాలను, జ్ఞాపకాలను గ్లామరైజ్ చేస్తూ తాము ఇలాగే రాస్తున్నామనే భ్రమల్లో ఉన్నారు. కాని వాస్తవికంగా, చీమునెత్తురోడే ప్రత్యామ్నాయ సాహిత్యంతో అవి పోటీపడవు. ప్రత్యామ్నాయ రంగాన్ని ప్రజలు ప్రేమిస్తారు. కాని ప్రధాన స్రవంతి నిరాకరిస్తుంది.

ఇంతవరకు గుర్తింపబడని మనుషులు, సమూహాలు, బృందాలు... అనేక సామాజిక కోణాలు వాస్తవికతలు ఒక్కొక్కటి వెలుగులోకి రావాల్సిందే. సామాజిక సాంస్కృతిక పోరాటాలు, వాటి శక్తి యుక్తులు మట్టి చేతుల్లో దివిటీలై వెలగాల్సిందే. ఆ గాయాల హస్తాలు సమస్త రంగాలలో మార్పు కోసం ఎజెండా లిఖించాల్సిందే. అనాదిగా కొనసాగుతున్న ఈ ప్రక్రియ మరింత అర్థవంతంగా కొనసాగాల్సి ఉంది. వర్తమాన ప్రజల చరిత్రలను గుర్తించని, పఠించని యాంత్రిక నినాదప్రాయ వర్ణింపులు దండగ. వీరికన్నా శ్రమ బతుకుల్ని సాహిత్య సెర్చ్‌లైట్లుగా మార్చేవారే అవసరం. వీళ్ళు గతం నుండి నేర్చుకుంటారు. వర్తమానంలో చెమట చుక్కల్నీ, గాయాల సలుపుల్నీ గుర్తిస్తారు. ఏ మార్పులేని గత కీర్తనల వల్ల సాధించేది తక్కువ. ఈ పరిస్థితి మారాలి. ప్రత్యామ్నాయ ఆలోచనలు వికసించాలి. అనేక పూలు పూయాలి, భావజీవ వైవిధ్యత పెరగాలి. బ్యాండుమేళం నొక్కులు యాంత్రిక శబ్దాన్నే పాడతాయి. వెయ్యేళ్ల సాహిత్యంలో అధిక శాతం అలాంటిదే.

> ప్రత్యామ్నాయ సాహిత్య ధార బహుళత్వానికి, భిన్నత్వానికి, కొత్తచూపుకి, కూర్పుకి, కొత్త రచనా రీతికి, వ్యక్తీకరణలకి బాటలు వేస్తుంది. ఇక్కడ సాధారణ ప్రజల లోంచి వచ్చినవారు రచయితలు, కవులు, గాయకులు అవుతారు. వీరి నాయకత్వంలో కొత్త సాహిత్యభాష ఊపందుకొంటుంది. శిష్ట సాహిత్య కళారంగాలకు ప్రాణవాయువులు అందిస్తుంది. కొత్త పాఠకవర్గాన్ని తయారు చేసుకుంటుంది. ప్రధాన స్రవంతికి సవాలుగా నిలుస్తుంది.



ప్రత్యామ్నాయ సాహిత్య ధార బహుళత్వానికి, భిన్నత్వానికి, కొత్తచూపుకి, కూర్పుకి, ఖాళీల పూరింపుకి, కొత్త రచనా రీతికి, వ్యక్తీకరణలకి బాటలు వేస్తుంది. ఇక్కడ సాధారణ ప్రజలలోంచి వచ్చినవారు రచయితలు, కవులు, గాయకులు అవుతారు. వీరి నాయకత్వంలో కొత్త సాహిత్యభాష ఊపందుకొంటుంది. శిష్ట సాహిత్య కళారంగాలకు ప్రాణవాయువులు అందిస్తుంది. కొత్త పాఠకవర్గాన్ని తయారు చేసుకుంటుంది. ప్రధాన స్రవంతికి సవాలుగా నిలుస్తుంది. కాబట్టి బలీయ సాహిత్య సాంస్కృతిక వ్యవస్థ దీనిని వీలైనంత పక్కన పెడుతుంది. ఐతే ఈ మధ్య ప్రత్యామ్నాయ రచయితలు గతంలో లాగా రచనలు చేసి ఊరుకోవడం లేదు. తమ గురించి తాము పట్టించుకుంటున్నారు.

అజ్ఞాత అనామక కులవర్గాల నుండి ఈ రచయితలు సొంత శక్తితో, సృజనాత్మక బలంతో ప్రతిభా సంపన్నతలతో తమని విస్మరించలేని పరిస్థితి కల్పిస్తున్నారు. నాయకత్వాలకు, ఆధిపత్యాలకు పరిమితమైన శిష్ట రచయితలు విఫలమైన చోట ఈ రచయితలు తమ అస్తిత్వాలకు లిఖిత మౌఖిక సాహిత్య కళా రంగంలో చలన శీల స్థానం కల్పించడంలో విజయం సాధిస్తున్నారు. ఈ సాహిత్యాన్ని కొందరు అభ్యుదయ మేధావులు కొన్ని పేర్లు పెట్టి ప్రత్యర్థి సాహిత్యంగా భావిస్తున్నారు. శిష్టులు ఒక విధంగా ప్రజల సాహిత్య కళా సంస్కృతులను పరాయీకరిస్తే, ఈ అభ్యుదయవాదులు మరోవిధంగా పరాయీకరిస్తున్నారు. ప్రత్యామ్నాయ రచయితలు ఈ ఉచ్చుల్లో పడవద్దు. ప్రధాన స్రవంతి పన్నాగాలలో చిక్కుపడిపోవద్దు. తమ తమ వ్యక్తిత్వాలను, అస్తిత్వాలను కాపాడుకోవాలి.



▪ జయధీర్ తిరుమలరావు
(నేడు హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రత్యామ్నాయ సాహిత్య భాషా సంస్కృతులపై సదస్సు)





● ఇంటర్ పరీక్షలు ప్రారంభం



అమ్మో దోమ

నగరంపై దోమల దండయాత్ర

దాదాపు అన్ని ప్రాంతాల్లో విజృంభణ

- జ్వరాల బారిన పడుతున్న నగరవాసులు
- తూతూమంత్రంగా యాంటీ లార్వా ఆపరేషన్
- రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా ఫలితం శూన్యం
- కొరవడిన కార్పొరేషన్ అధికారుల పర్యవేక్షణ

దోమా దోమా.. ఎందుకు కుట్టావ్.. అంటే వి జయవాడ కార్పొరేషన్ అధికారుల పనితనానికి లాము బతికి బట్టకడుతున్నామని, జనాల్ని పీల్చిపిప్పి చేస్తున్నామని చెప్పాయంట. వినడానికి ఇది ఫన్నీగానే ఉన్నా.. దోమల తీవ్రత మాత్రం నగరాన్ని పట్టిపీడిస్తోంది. సాధారణంగా వర్షాకాలంలో విజృంభించే దోమలు ఫిబ్రవరి, మార్చిలో కూడా ప్రతాపం చూపిస్తుండటంతో నగరవాసులు జ్వరాల బారిన పడుతున్నారు. యాంటీ లార్వా ఆపరేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించడంలో కార్పొరేషన్ అధికారులు వి ఫలమవుతున్నారు. దోమల నియంత్రణ కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా ఫలితం మాత్రం శూన్యం. మురుగు కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేసినా దోమల లార్వాను అరికట్టలేకపోతున్నారు. ఫాగింగ్ చేసినా పట్టుమని పది నిమిషాలు కూడా ఊరట లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

(ఆంధ్రజ్యోతి, కార్పొరేషన్) : సాధారణంగా నగరంలో ఏటా జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబరులో వర్షాకాలం నాలుగు నెలలు దోమల వ్యాప్తి అధికంగా ఉంటుంది. కానీ, ఎన్నడూ లేనివిధంగా మార్చిలో దోమలు విజృంభిస్తున్నాయి. నగరంలో 286 వార్డు సచివాలయాలు అందుబాటులో ఉన్నా 245 మంది శానిటరీ కార్యదర్శులతో ప్రతివారం డ్రైడే పాటిస్తున్న ట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ఫలితాలు అంత గా లేవనే చెప్పాలి. దోమల నిర్మూలన, యాంటీ లార్వా ఆపరేషన్ పనులు సక్రమంగా జరగట్లేదు. సాయంత్రమైతే అక్కడక్కడ పొగతో సరిపెడుతున్నా రే తప్ప పూర్తిస్థాయిలో యాంటీ లార్వా ఆపరేషన్ పనులు నిర్వహించట్లేదు. ఎంఎల్ ఆయిల్ బాల్స్ డ్రెయిన్లలో వదలటం, పైరత్రం స్ప్రే, మంచినీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో గంబూసియా చేపలు విడిచిపెట్ట డం, పీడీపీ వర్క్ వంటి యాంటీ లార్వా పనులు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. దీంతో దోమల వ్యాప్తి పెరుగుతోంది. ఫలితంగా ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులు మాత్రం మాలేరియా, డెంగీ కేసులుంటేనే దోమల పెరుగుదల ఉంటుందన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.





నగరంలో ప్రధాన రహదారిపై పారుదల లేని డ్రెయినేజీ కాల్వ, పాలిక్లినిక్ రోడ్డులో రోజుల తరబడి పేరుకుపోయిన మురుగు

పర్యవేక్షణ కరువు

దోమల నిర్మూలనా చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం, యాంటీ లార్వా ఆపరేషన్ పనుల పర్యవేక్షణ తదితర అంశాల్లో అధికారులు విఫలమయ్యారు. దోమలు వృద్ధిచెందే మంచినీటి ట్యాంక్ మూతలు వేయించడం, డ్రెయినేజీ గొట్టాలకు వలలు ఏర్పాటు చేసుకోవ డం, వర్షపునీటి డ్రెయిన్లు ఖాళీలు లేకుండా చూడటం, పల్లపు ప్రాంతా లు మెరక చేయించటం వంటి చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు.

ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నా పట్టించుకోవట్లేదు.

రూ.లక్షల్లో ఖర్చు చేసినా..

దోమల నివారణ చర్యలకు ప్రభుత్వం ఎబెట్, పైరత్రం, ఎంఎల్ ఆయిల్ బాల్, ఇతర మందులు ఉచితంగా ఇస్తోంది. వీటితో పాటు మిగతా 8లో..

డెంగీ, మలేరియా కేసులు

ఏటా డెంగీ, మలేరియా కేసులు తగ్గుతు న్నప్పటికీ దోమల బెడద మాత్రం అంతకం తకూ పెరుగుతోంది. నగరంలో 2016లో మ లేరియా కేసులు 580, 2017లో 290, 2018 లో 25, 2019లో 17, 2020లో 16, 2021లో సుమారు 10, 2022లో 338, 2023లో 83, 2024లో సుమారు 50 కేసులు న మోదయ్యాయి. డెంగీ కేసులు 2016లో 61, 2017లో 45, 2018లో 11, 2019లో 42, 2020లో 18, 2021లో సుమారు 92, 2022 లో 52, 2023లో 13, 2024లో సుమారు 25 కేసులు నమోదయ్యాయి.



ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 97.64 శాతం హాజరు నమోదైంది. నగరంలోని బందరురోడ్డులో ఉన్న ఓ పరీక్షా కేంద్రం వద్ద వేచి చేస్తున్న ఇంటర్ విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) తాడిగడపలోని శ్రీచైతన్య కాలేజీ పరీక్షా కేంద్రం వద్ద క్యూలో వెళ్తున్న విద్యార్థులు 6లో

పసిబిడ్డలపై పైశాచికం

ఉత్తరాది శిశువుల విక్రయం వెనుక అనేక కోణాలు

- ఉత్తరాది ముఠాతో నగరానికి చెందిన మహిళకు లింక్‌లు
- అక్కడి నుంచి తీసుకొచ్చి ఇక్కడ విక్రయాలు
- సంతాన సాఫల్య కేంద్రాలు, ఆలయాల్లో నెట్‌వర్క్
- పిల్లలు లేనివారిని టార్గెట్ చేసి రూ.లక్షలకు విక్రయాలు
- కిడ్నాప్ చేసి తెస్తున్నారా.. ఎక్కడైనా కొంటున్నారా..?
- మధ్యవర్తులే లక్ష్యంగా పోలీసుల వేట

ఆ శిశువులు ఎవరు? వారి తల్లిదండ్రులు ఎవరు? ఉత్తరాదిలో ఏ ప్రాంతానికి చెందినవారు? నగరంలో శిశువులను విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసిన తర్వాత పోలీసులకు పుట్టుకొస్తున్న ప్రశ్నలివి. పక్కా సమాచారంతో విజయవాడ పోలీసులు మహిళా గ్యాంగ్‌ను అయితే పట్టుకున్నారు కానీ, ఆ గ్యాంగ్ వారితో ఉన్న లింక్‌లను ఛేదించడంలో అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారు. అన్ని కోణాల్లో కూపీ లాగుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉత్తరాది నుంచి చిన్నపిల్లలను కొనుగోలు చేసి వి జయవాడకు తీసుకొచ్చి విక్రయిస్తున్న ఐదుగురు మహిళల ముఠాను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ముగ్గురు శిశువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలో ప్రధానంగా ఉన్న బగలం సరోజినితో సంబంధాలు ఉన్న వారిని ఎలాగైనా బయటకు లాక్కొస్తామని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. దీనికోసం నాలుగు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని వెల్లడించారు.



ఉత్తరాది నుంచి తీసుకొచ్చిన చిన్నారులను చూస్తున్న సీపీ రాజశేఖరబాబు

ముగ్గురు శిశువులను బాల సంరక్షణ కేంద్రానికి అప్పగించిన పోలీసులు మరో నలుగురు శిశువులను కూడా ఉత్తరాది నుంచి తీసుకొచ్చినట్టు సమాచారాన్ని సేకరించారు. ఈ నలుగురు శిశువులను కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఉన్న సంతానం లేని దంపతులకు విక్రయించేసినట్టు తేల్చారు. ఈ శిశువులు, వారి తల్లిదండ్రులు ఎవరన్న సమాచారం మిగతా 6లో..

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థిని మృతి

మరో విద్యార్థినికి తీవ్ర గాయాలు

- జాపూడి వద్ద జాతీయ రహదారిపై ఘటన
- కళాశాలకు వెళ్తూ కానరాని లోకాలకు..



కారు ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన స్కూటీ (ఇన్ సెట్‌లో మృతురాలు తాజ్ అఫ్సా (ఫైల్)

ఇబ్రహీంపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వైద్య విద్యార్థిని దుర్మరణం చెందగా, మరో విద్యార్థిని తీవ్ర గాయాలపాలైంది. ఈ ప్రమాదం జూపూడి వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వద్ద శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక నిమ్రా కాలేజీలో గుంటూరులోని శ్యామలానగర్‌కు చెందిన సయ్యద్ తాజ్ అఫ్సా (20) ఎంబీబీఎస్ మూడో సంవత్సరం, చిత్తూరు పట్టణం దుర్గానగర్‌కు చెందిన అర్షా మెహవిష్ (21) ఎంబీబీఎస్ నాల్గో సంవత్సరం చదువుతున్నారు. వీరు పశ్చిమ ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ స్కూటీపై కాలేజీకి వెళ్తారు. రోజూ మాదిరిగానే శనివారం కూడా బయల్దేరారు. కళాశాల వద్ద యూటర్న్ తీసుకుంటున్న వీరిని హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తాజ్ అఫ్సా అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మెహవిష్ తీవ్రంగా గాయపడింది. గాయపడిన మెహవిష్‌ను చికిత్స నిమిత్తం నిమ్రాకు తరలించడంతో మిగతా విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని సీఐ చంద్రశేఖర్ సందర్శించి మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గగుడిలో కీలక ఫైళ్ల గల్లంతు

గత ఈవోల నిర్లక్ష్యం కారణంగానే..

ఈ-వ్యవస్థ పాటించకపోవడం వల్లే.. » ఉద్యోగులను వివరణ అడిగిన ఈవో



ఇంద్రకీలాద్రి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి పై దుర్గమ్మ దేవస్థానంలో కీలకమైన పలు ఫైళ్లు గల్లంతైనట్లు సమాచారం. గతంలో పనిచేసిన ఈవోల నిర్లక్ష్యం కారణంగా, ఈ-ఆఫీసు వ్యవస్థను పాటించకపోవటం వల్లే ఇలా జరిగిందనే విమర్శలు వస్తున్నాయి. గల్లంతైన ఫైళ్ల వ్యవహారంపై ఈవో, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. కొన్నిరోజులుగా ఈవో ఫైళ్లను పరిశీలించే క్రమంలో ఈ విషయం బయటపడింది. దీంతో ఆయన ఆరా తీశారు. కోర్టుకు వెళ్లిన ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన కేసులు, ఇతర కేసులకు కోర్టులో కౌంటర్ వేయటానికి ఈ ఫైళ్లు అవసరం. ప్రస్తుతం ఇవి కనిపించకపోవటంతో ఈవో సంబంధిత విభాగ అధికారులు, ఉద్యోగులను పిలిచి అడిగారు. వారు సరైన సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండిపోయారు. కనిపించకుండా పోయిన ఫైళ్ల గురించి గతంలో పనిచేసిన ఉద్యోగులు, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులు సమాధానం చెప్పాలని ఈవో ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతానికి హెడ్డాఫీసు నుంచి ఫైళ్లను తెప్పించి కోర్టులో కౌంటర్ వేయటానికి చర్యలు తీసుకుంటున్నారు. సుమారు కీలకమైన 8 ఫైళ్లు గల్లంతైనట్లు సమాచారం.

దాహమేస్తోంది

- జీజీహెచ్‌లో తాగునీటి అవస్థలు
- కుళాయిలు కూడా లేక ఉప్పునీరే గతి
- పట్టించుకోని అధికారులు

6లో

92.48 శాతం పెన్షన్ల పంపిణీ

- జిల్లావ్యాప్తంగా 2,11,918 మందికి రూ. 90.39 కోట్లు పంపిణీ
- జి.కొండూరు మండలంలో అత్యధికంగా 94.21% పంపిణీ

8లో

అవినీతికి కేరాఫ్‌గా బీసీ హాస్టళ్లు

పిల్లలు తక్కువ.. రికార్డుల్లో ఎక్కువ

- వాచ్‌మెన్‌తో సరి.. వార్డెన్ పర్యవేక్షణ శూన్యం
- గుణదలలోని బాలికల హాస్టల్‌లో నిర్వాకం
- రిపోర్టు ఇచ్చిన అధికారి సస్పెన్షన్
- మైలవరం హాస్టల్ ఘటనపై రిపోర్టు ఇవ్వలేదనే సాకు
- ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోని ఉన్నతాధికారులు

జిల్లాలోని బీసీ వెల్ఫేర్ హాస్టళ్లు అవినీతికి కేరాఫ్‌గా మారుతుండగా, చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారు. తప్పులు చేసిన వారిని కాపాడుతూ, పట్టించిన అధికారులపై చర్యలకు దిగుతున్నారు. వి జయవాడ డివిజన్ సహాయ బీసీ వెల్ఫేర్ అధికారి సస్పెన్షన్ వెనుక జరిగింది ఇదే.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గుణదలలోని విజయవాడ సెంట్రల్ బీసీ వెల్ఫేర్ మహిళల హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యలో వాస్తవ లెక్కల కంటే చాలా తక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్నారన్న ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఈ విషయంపై గత నెలలో విజయవాడ డివిజన్ సహాయ బీసీ వెల్ఫేర్ అధికారి (ఏబీసీడబ్ల్యూ) జరిపిన తనిఖీల్లో కేవలం 73 మంది పిల్లలే హాస్టల్‌లో ఉన్నట్టు గుర్తించారు. కానీ, మొత్తం 186 మంది ఉన్నట్టు హాస్టల్ సిబ్బంది లెక్కలు రాశారు. మరి మిగిలిన పిల్లలు ఎక్కడ? వారి వివరాలు ఏంటి? అన్నది ఎవరికీ తెలియదు. లెక్కల ప్రకారం.. 186 మంది విద్యార్థినులు ఉంటే.. 18 కేజీల బియ్యం వండాలి. కానీ, కేవలం 8 కేజీల బియ్యాన్నే వండుతున్నారని పరిశీలనలో తేలింది. ఈ తనిఖీల్లో సదరు హాస్టల్‌లో నైట్ వాచ్‌మెన్ తప్ప ఎవరూ లేరని గుర్తించారు. వంటమనిషి, అటెండర్ కూడా కనిపించలేదు. ఉదయం సగం వదిలేసిన ఇడ్లీలను గుర్తించారు. కొందరు చాలీచాలనట్టుగా తింటుంటే, మరికొందరు వి ద్యార్థినులు ఇడ్లీలో చట్నీ లేక, ఇడ్లీలు కూడా నాసిరకంగా ఉండటంతో అసలు తినకుండానే స్కూల్‌కు వెళ్లినట్టు అధికారి తెలుసుకున్నారు. బాలికల హాస్టల్ విషయంలో ఎంతో జాగ్రత్తగా చూడాల్సిన వార్డెన్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని ఆయన గుర్తించారు. ముగ్గురు పనిచేయాల్సిన హాస్టల్‌లో ఒక్కరే ఉంటే బాలికల రక్షణ ఏమిటని ఆయన మిగతా 6లో..



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం): 6-14 (ఆది)
సహర్ (ఉదయం): 5-12 (సోమ)

సజావుగా తొలి పరీక్ష

● ఇంటర్ ఫస్టియర్ మొదటి పరీక్షకు సెట్-2 ప్రశ్నపత్రం

● కృష్ణాలో 98.03, ఎన్టీఆర్‌లో 97.64 శాతం హాజరు



మచిలీపట్నం పద్మావతి కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తున్న డీఎస్పీ రాజా, జిల్లా ఇంటర్ అధికారి సాల్మన్‌రాజు



ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ/ మచిలీపట్నం టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్ష సజావుగా జరిగింది. లాంగ్వేజ్ పరీక్షలకు సెట్-2 ప్రశ్నపత్రాన్ని ఎంపిక చేశారు. కృష్ణాజిల్లాలో 224,810 మంది విద్యార్థులకు 24,323 మంది హాజరయ్యారు. 487 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 63 కేంద్రాల్లో 98.03శాతం హాజరు నమోదైంది. ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 40,695 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 39,737 మంది హాజరయ్యారు. 958 మంది గైర్హాజరయ్యారు. 103 పరీక్షా కేంద్రాల్లో 97.64 శాతం హాజరు నమోదైంది. సోమవారం నుంచి ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. మచిలీపట్నంలో పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని బందరు డీఎస్పీ రాజా, జిల్లా ఇంటర్ అధికారి సాల్మన్‌రాజు సందర్శించారు.

పరీక్షా కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్: విజయవాడలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ లక్ష్మీశ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. చీఫ్ సూపరింటెండెంట్‌తో సహా ఇన్విజిలేటర్లు, పరీక్షా విధులకు కేటాయించిన ప్రతి ఒక్కరిని క్షుణంగా తనిఖీ చేసి మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. తొలిరోజు ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు బుక్ కాలేదు. నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు పలు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు విధుల్లో పాల్గొన్నాయి.

ఎస్కార్ట్‌తోనే ప్రశ్నపత్రాలను తరలించాలి: డీఎస్పీ ధీరజ్ వినీల్



పామర్రులో పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తున్న డీఎస్పీ

పామర్రు: ఇంటర్మీడియట్ ప్రశ్నపత్రాల తరలింపు, సమాధాన పత్రాల డిపాజిట్‌ను పోలీస్ ఎస్కార్ట్‌తో చేయాలని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్‌వినీల్ ఆదేశించారు. పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తన సబ్‌డివిజన్ పరిధిలో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పటిష్ఠ బందోబస్తు అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులను ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది తనిఖీ చేశాకే లోపలకు పంపాలన్నారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు వినియోగించకుండా చూడాలన్నారు. పోలీస్ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్ట్రెచర్‌పై వచ్చి పరీక్ష రాసి..



సాయిరాజును స్ట్రెచర్‌పై పరీక్షా కేంద్రానికి తరలిస్తున్న సిబ్బంది

జగ్గయ్యపేట: కళాశాలకు వెళ్లి వస్తుండగా ప్రమాద రూపంలో విధి వక్రీకరించింది. అయినా అతను ఆత్మస్థైర్యం కోల్పోలేదు. స్ట్రెచర్‌పై వచ్చి పరీక్ష రాసి, అందరిలో స్ఫూర్తి నింపాడు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని జేఆర్సీ కళాశాలలో సాయిరాజు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాడు. గత నెల 21న రోడ్డు మీద నడిచి ఇంటికి వెళ్తుండగా అమ్మాణీ కాలేజి రోడ్డులో యువకుడు బైక్‌తో వేగంగా ఢీకొట్టాడు. కుడి మోకాలి ఫ్రంట్ లిగ్మెంట్, బ్యాక్ లిగ్మెంట్ రెండు తెగిపోయాయి. విజయవాడలోని ఓ హాస్పిటల్‌లో 23న ఆపరేషన్ చేసి డిశ్చార్జ్ చేశారు. మోకాలి మీద బరువు పడకూడదని, రోడ్డు దెబ్బతగలటంతో వెన్నుపైనా బరువు పడకూడదని పూర్తి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. కానీ, సాయిరాజు ఎలాగైనా పరీక్షలు రాస్తానని తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చాడు. ఇంటర్ ఫస్టియర్ ఆందోళన అవసరం లేదని, సప్లిమెంటరీలో కొన్ని, సెకండియర్‌లో కొన్ని పూర్తి చేయొచ్చని చెప్పినా అంగీకరించలేదు. కళాశాల యాజమాన్యం దృష్టికి తేగా వాళ్లు ఇంటర్ బోర్డు అధికారులను సంప్రదించి ప్రత్యేక అనుమతి తీసుకున్నారు. వాగ్దేవి కళాశాలలో సెంటర్ ఇచ్చారు. ఇంటర్ బోర్డు అధికారులు ప్రత్యేక ఇన్విజిలేటర్‌ను నియమించి, పరీక్ష నిర్వహించారు. అతడు పరీక్ష రాసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. శనివారం అతడిని అంబులెన్స్‌లో తీసుకుని తీసుకొచ్చి, అక్కడ నుంచి స్ట్రెచర్‌పై పరీక్షాకేంద్రంలో ప్రత్యేక ఆసనంపై కూర్చోబెట్టారు. పరీక్ష విజయవంతంగా రాసిన సాయిరాజును అందరూ ప్రశంసించారు.





ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో నిరుపయోగంగా మినరల్ వాటర్‌ప్లాంట్

దాహమేస్తోంది

విజయవాడ న్యూ జీజీహెచ్‌లో తాగునీరు దొరక్క తిప్పలు | పట్టించుకోని అధికారులు

● వాటర్ బాటిళ్లతో సరిపెట్టుకుంటున్న రోగులు, వారి బంధువులు



అలంకారప్రాయంగా మినరల్ వాటర్‌ప్లాంట్

(ఆంధ్రజ్యోతి, ప్రభుత్వాసుపత్రి): రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో అతి పెద్దదైన విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(న్యూ జీజీహెచ్)లో తాగునీరు దొరక్క రోగులు, వారి బంధువులు అలమటిస్తున్నారు. కొత్త ప్రభుత్వాస్పత్రికి నగరంతో పాటు పరిసర జిల్లాలు, గ్రామాలు, పట్టణాల నుంచి నిత్యం వేలాదిగా వైద్యం కోసం వస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆస్పత్రి ప్రాంగణం రోగులతో కిటకిటలాడుతూ ఉంటుంది. భారీ సంఖ్యలో వచ్చే రోగులకు అవసరమైన వసతులు కల్పించాల్సిన బాధ్యత ఆస్పత్రి అధికారులపైన ఉంది. ఎన్నో ఏళ్లుగా ఆస్పత్రిలో తాగునీటి సమస్య ఉంది. దానిని పట్టించుకోవడం లేదు. రోగుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు వాటర్ ప్లాంట్లను వితరణగా ఇచ్చాయి. వాటి నిర్వహణను ఆస్పత్రి అధికారులు నిర్లక్ష్యం చేయడంతో అవి శిథిలావస్థకు చేరాయి. మరమ్మతులు చేయించకపోవడంతో తాగునీటి సమస్య అధికమైంది. నీరు దొరక్క వాటర్ బాటిళ్ల కొనుగోలు చేసుకుంటున్నామని రోగులు, వారి బంధువులు చెబుతున్నారు.

ఉప్పు నీరే దిక్కు

ఆస్పత్రికి మంచి నీటిని సరఫరా చేసే కుళాయిలు లేవు. ఉప్పు నీటినే రోగులు తాగాల్సి వస్తోంది. కోట్లాది రూపాయలు వెచ్చించి సర్వజన ఆస్పత్రిని నిర్మించడంలో చూపిన శ్రద్ధ తాగునీటి కుళాయిలు ఏర్పాటులో ప్రభుత్వం చూపడం లేదు. 2016లో అప్పటి టీడీపీ హయాంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కోట్లు వెచ్చించి నూతన ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. ఆరోగ్య కేంద్రంలో తాగునీటి కేంద్రాన్ని ఏర్పాటును విస్మరించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న ఒక కుళాయి ద్వారా ప్రధానమైన యూనిట్‌కు తాగునీరు సరఫరా అవుతోంది. మిగిలిన అన్ని విభాగాలకు తాగునీరు లేదు. దీంతో రోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతానికి బోరు నీటిని అందిస్తున్నారు. బోరు నీటితో రోగులు మరింత అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని వారి బంధువులు ఆందోళన చెందుతున్నారు. రోగులకు నిత్యం అందించే మధ్యాహ్న భోజనం బోరు నీటితో తయారు చేస్తున్నారని, దీనివల్ల రుచి ఉండడం లేదని, భోజనం తిన్నా రోగాల పాలవుతామేమోనని భయంగా ఉందని రోగులు, వారి బంధువులు చెబుతున్నారు. నగరపాలక సంస్థ తాగునీటిని అందించాలని కోరుతున్నారు.



ఉపకార వేతనాల చెక్కులను విద్యార్థులకు అందిస్తున్న మంత్రి కొల్లురవీంద్ర, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య

స్కాలర్‌షిప్‌లు ఇచ్చే స్థాయికి ఎదగండి

● సిద్ధార్థ ఫౌండేషన్ ఉపకారవేతనాల పంపిణీలో విద్యార్థులతో మంత్రి కొల్లు రవీంద్ర

మొగల్రాజపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ ఫౌండేషన్ నుంచి స్కాలర్‌షిప్‌లు తీసుకున్న ప్రతి విద్యార్థి భవిష్యత్‌తో స్కాలర్‌షిప్‌లు ఇచ్చే స్థాయికి ఎదగాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు. సిద్ధార్థ ఫౌండేషన్ 26వ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం శనివారం పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి విచ్చేశారు. గతంలో విద్యావకాశాలు తక్కువగా ఉండేవని ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపే కారణమన్నారు. గతంలో రాష్ట్రంలో ఒకేసారి నలభై ఇంజనీరింగ్ కళాశాలు చంద్రబాబు తెచ్చారని, వాటి ఫలితాలు ఇప్పుడు మనం చూస్తున్నామని ఆయన తెలిపారు. మంత్రి నారా లోకేశ్ విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు తెస్తున్నారని అన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో కులమతాలకు అతీతంగా పేద, బలహీన, ఆర్థికంగా వెనుకబడిన 772 మంది విద్యార్థులకు 65,74,000 రూపాయలు అందించామని సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు తెలిపారు. వీరిలో దేశంలో, రాష్ట్రంలో వివిధ చోట్ల చదువుతున్న 541 మందికి రూ.46,91,000, సిద్ధార్థ విద్యాసంస్థల్లో చదువుతున్న 231 మం దికి రూ.18,83,000 అందించామన్నారు. వీరితో పాటు ఐఐటీ, ఐఐఎం, ఐ ఐఎస్, ఎన్ఐటీ సంస్థల్లో చదివే 16 మందికి ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు అం దించామన్నారు. సిద్ధార్థ ఫౌండేషన్ తరఫున ఇప్పటివరకు 19వేల మంది విద్యార్థులకు రూ.8.09 కోట్లను అందించామన్నారు.

ఉత్కంఠభరితంగా పూటీ లాగుడు పోటీలు



పూటీ లాగుతున్న ఎడ్లు

నందిగామ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల పూటీ లాగుడు పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. శనివారం సాయంత్రం సీనియర్ విభాగంలో 14 జతల ఎడ్లు పోటీలో పాల్గొన్నాయి. యజమానులకు రైతు కమిటీ సభ్యులు గింజుపల్లి శ్రీనివాసరావు, చింతోటి సాంబశివరావు, నేవెల్లి సిద్ధార్థ జ్ఞాపికలు అందజేశారు.

జూనియర్ విభాగం విజేతలు

శుక్రవారం రాత్రి జరిగిన జూనియర్ విభాగం పూటీ లాగుడు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం సోపిరాలకు చెందిన విజయలక్ష్మి ఎడ్ల జత 3,514 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. కృష్ణాజిల్లా మోపిదేవి మండలం కె.కొత్తపాలేనికి చెందిన నాని ఎడ్ల జత 3,373 అడుగులు లాగి రెండో స్థానం, కృష్ణాజిల్లా కానూరు మండలం గార్లపాడుకు చెందిన రామినేని శ్రీనివాస్‌రెడ్డి ఎడ్ల జత 3,350 అడుగులు, తోట్ల వల్లూరు మండలం కళ్లింవారిపాలేనికి చెందిన హనూష్‌రెడ్డి ఎడ్ల జత 3,323 అడుగులు, వత్సవాయి గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి ఎడ్ల జత 3,279 అడుగుల దూరం లాగి మూడు, నాలుగు, ఐదు స్థానాలలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులను రైతు కమిటీ సభ్యులు అందజేశారు. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన సాని కొమ్ము శ్రీనివాసరెడ్డి ఎడ్ల జత 3,133 అడుగులు లాగి ఆరో స్థానంలో నిలవగా రూ.ఐదువేల నగదును ప్రత్యేక బహుమతిగా అందజేశారు.

దుర్గగుడిలో రేపు హుండీల్లో కానుకల లెక్కింపు

ఇంద్రకీలాద్రి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కిస్తామని ఈవో రామచంద్రమోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మహామండపంలోని ఆరో అంతస్థులో లెక్కింపు ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా

పటిష్ఠ నిఘా

అక్రమాలు సహించం | ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరిక



జి.కొండూరులో బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్/ జి.కొండూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): 'ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా అందించే పేదల బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్ఠ నిఘా పెట్టాం. బియ్యం ఒక్క గింజ పక్కదారి పట్టినా సహించం. ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటాం.' అని కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. శనివారం జి.కొండూరులో మూడో నెంబర్ చౌకధరల దుకాణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు, సరుకు నాణ్యతతో పాటు డీలరు సక్రమంగా రికార్డులు నిర్వహిస్తున్నారా లేదా అనేది పరిశీలించారు. ఎండీయూ-6 వాహనం ద్వారా లబ్ధిదారులకు సరుకులు అందించే ప్రక్రియను పరిశీలించారు. రేషన్ దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లు, ఎండీయూ ఆపరేటర్ల కార్యకలాపాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలోని 957 రేషన్ దుకాణాలను, ఏడు ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తామన్నారు. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు ప్రతినెలా 20 దుకాణాలను తనిఖీ చే యాల్సిందేనని, తహసీల్దార్లు నెలకు ఐదు దు కాణాలను తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. పౌరసరఫరాల డీఎం, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేయాలన్నారు.

దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే చేస్తున్నందున దీర్ఘకాలిక భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని కలెక్టర్ లక్ష్మీశ రైతులకు వివరించారు. శనివారం జి.కొండూరు మండలం గడ్డమణుగులో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. రీ సర్వే పురోగతిని పరిశీలించారు. ఫీల్డ్ గ్రౌండ్ ట్రూతింగ్(భూమిపై కచ్చితత్వం) పనులు ఏ మేరకు జరుగుతున్నాయనే దానిపై ఆరా తీశారు. మ్యాపులను పరిశీలించారు. గ్రామంలోని రైతులతో మాట్లాడారు. ఫీల్డ్‌లో రోవర్ ఎలా పనిచేస్తుందో రైతులకు వివరించారు. పొరపాట్లకు తావులేకుండా కచ్చితమైన భూ రికార్డులను అందించేందుకు చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశించుకొన్న లక్ష్యాల మేరకు సర్వే పనులను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ డైరెక్టర్(సర్వే, భూ రికార్డులు) టి.తివిక్రమరావు తదితరులు ఉన్నారు.

రంజాన్ మాసంలో మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

ఎన్టీఆర్ కలెక్టరేట్: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా మసీదుల వద్ద ఈనెల 2 నుంచి 30వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్సులో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, మున్సిపల్, వైద్యఆరోగ్యం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అగ్నిమాపక శాఖల అధికారులతో మాట్లాడారు. మసీదుల వద్ద పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. తెల్లవారుజామునే ముస్లింలు మసీదులకు వెళ్లి నమాజ్ చేస్తారని, వారికి ఏ ఇబ్బంది కలగకుండా చూడాలని, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఆటంకం రానీయొద్దన్నారు. పెద్ద, చారిత్రక మసీదుల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నమాజ్ అనంతరం ముస్లింలు ఆహార పదార్థాలు కొనుగోలు చేసుకునేందుకు దుకాణాలకు అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రార్థనలు ఆచరించే ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, ఇతర ఉద్యోగులు గంట ముందే కార్యాలయాల నుంచి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి అబ్దుల్ రబ్బాని, వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎండీ నూహూ అలీషా, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, వీఎంసీ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రామాయణ చిత్ర కథారూపం

● పదో తరగతి విద్యార్థి గాయత్రి అద్భుత కళా నైపుణ్యం



రామాయణ కథలో ఘట్టాలను వివరిస్తున్న గాయత్రి

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తన అద్భుత చిత్రాలతో రామాయణ కావ్యానికి కథారూపమిచ్చి చేగు విద్యాలయానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఎం.గాయత్రి పలువురి ప్రశంసలందుకుంది. రామాయణం మొత్తాన్ని 56 చిత్రాల్లో చూపి, విద్యాలయంలో ప్రదర్శనగా ఉంచింది. తిలకించిన తల్లిదండ్రులు, పట్టణ ప్రముఖులు రామాయణం బాలకాండలో అన్ని ప్రధాన ఘట్టాలను చిత్రాలతో కళ్లకు కట్టినట్టుగా చూపిందని ప్రశంసించారు. బాల రాముడికి అద్దంలో తల్లి చంద్రుడిని చూపిన దృశ్యం నుంచి అరణ్యాలకు వెళ్లడం, సీతాపహరణం, ఆంజనేయుడి ఆగమనం, రామ, రావణ ఘట్టాలు, సీతారాముల పట్టాభిషేకం, రామాయణ కావ్య రచయిత వాల్మీకి రచనా చిత్రాలకు ప్రదర్శనలో చోటు కల్పించింది. తనకు ఈ మొత్తం చిత్రాలు గీయడానికి ఏడాదిన్నర పట్టిందని పాఠశాల యాజమాన్యం సహకారంతో క్రేయాన్స్, స్కెచ్ పెన్స్, కలర్ పెన్సిల్స్ ఉపయోగించి చిత్రాలు గీశానని గాయత్రి తెలిపింది. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, జిల్లా జన సేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తాడేపల్లి సోమేశ్వరరావు తదితరులు గాయత్రిని అభినందించారు.

అద్దె బకాయిలు రూ.అరకోటి పైనే

● విజయేశ్వరస్వామి దేవస్థానం షాపుల అద్దె వసూళ్లపై పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి-ఇంద్రకీలాద్రి): ఇంద్రకీలాద్రి దిగువన ఉన్న విజయేశ్వరస్వామి ఆలయ షాపుల బకాయిలు రూ.అరకోటికిపైనే పేరుకుపోయాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి దేవదాయ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు సుమారు కోటిన్నరతో దేవస్థానం అభివృద్ధితో పాటు చైనావాల్ పక్కన తొమ్మిది షాపుల నిర్మించారు. ఆనాడు షాపులను పాడుకున్న అద్దెదారుల్లో కొందరు రెండు మూడు నెలలు సక్రమంగా అద్దె చెల్లించారు. మరికొందరు అద్దె చెల్లించలేదు. అద్దె బకాయిలపై అప్పటి ఈవో పట్టించుకోకపోవటంతో సుమారు అరకోటికి పైగా బకాయిలు పేరుకుపోయాయి.

ఏడాదిన్నర నుంచి షాపుల మూసివేత

అద్దెదారులు అద్దె చెల్లించకపోగా, సుమారు ఏడాదిన్నర నుంచి షాపులు మూసివేసి ఉంచారు. దేవస్థానం అధికారులు బకాయిల వసూలుపై ఒత్తిడి చేయకుండా కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారని, షాపులన్నీ ఖాళీగా ఉండటంతో దేవస్థానానికి రూ.లక్షల్లో ఆదాయం గండిపడుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. దేవస్థానం షాపుల ముందు కొందరు హాకర్లు అద్దె చెల్లించకుండా జోరుగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. దేవస్థానం అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దేవస్థానంలో పనిచేసే ఓ గుమస్తా అంతా తానై వ్యవహరిస్తున్నారని, దుకాణాల ముందు వ్యాపారాలు చేసుకుంటున్న హాకర్ల వద్ద మామూళ్లు తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎదురుగా ఉన్న దర్గా ప్రాంగణంలో షాపుల అద్దెలు వేలల్లో సక్రమంగా ప్రతినెలా వసూలవుతుంటే, విజయేశ్వరస్వామి దేవస్థానం షాపుల అద్దె వసూళ్ల చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన షాపులు ప్రస్తుతం నిరుపయోగంగా అలంకార ప్రాయంగా మారాయి.

బకాయిల వ్యవహారం తెలియదు

దేవస్థానానికి చెందిన షాపుల బకాయిల వ్యవహారం నాకు తెలియదు. నెలన్నర క్రితమే ఈవోగా బాధ్యతలు స్వీకరించా. - వెంకట రెడ్డి, ఈవో

పసిబిడ్డలపై పైసాచికం

(5వ పేజీ తరువాయి)

పోలీసులకు చిక్కలేదు. నిందితురాళ్లు ఆ విషయాలు చెప్పడం లేదు.

ఆ మధ్యవర్తులెవరు?

ఢిల్లీకి చెందిన ప్రీతి కిరణ్.. అహ్మదాబాద్‌కు చెందిన అనిల్ నుంచి శిశువులను కొంటున్నట్టు సరోజిని అంగీకరించింది. ఈ శిశువులను సరోజినికి అందజేసిన ఇద్దరూ.. మధ్యవర్తులేనని పోలీసులు గుర్తించారు. వారి వెనుక మరికొన్ని లింక్‌లు ఉంటాయని అనుమానిస్తున్నారు. ప్రీతి కిరణ్, అనిల్‌ను అరెస్టు చేసి విచారణ చేస్తే శిశువులకు సంబంధించిన సమాచారం గానీ, నెట్‌వర్క్‌లో ఉన్న ఇతర లింక్‌లు గానీ బయట కొచ్చే అవకాశం ఉంది. పోలీసులు ప్రధానంగా రెండు అంశాలపై దృష్టిపెట్టారు. ఉత్తరాదిలో ఉన్న వివిధ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులను దొంగిలించి తీసుకొచ్చి సరోజినికి విక్రయించి ఉంటారని ఓ కోణంలో అనుమానిస్తున్నారు. లేనిపక్షంలో మురికివాడల్లో ఉన్న నిరుపేదలు.. పోషించే శక్తి లేకపోవడంతో విక్రయించి ఉంటారని భావిస్తున్నారు. ప్రీతి కిరణ్, అనిల్‌తో సరోజినికి లింక్‌లు కలిపిన మహిళ కోసం పోలీసులు గాలిస్తున్నారు. సరోజిని కొన్నేళ్లు ఇలా శిశువులను విక్రయించడం ద్వారా లక్షలాది రూపాయలను సంపాదించింది.

అన్ని జిల్లాల్లో నెట్‌వర్క్

బగలం సరోజిని విజయవాడలోనే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తోంది. మారుతున్న జీవన విధానాల ప్రభావం దంపతులపై అనేక విధాలుగా పడుతోంది. ముఖ్యంగా వివాహమైన తర్వాత సంతానం కలగడం ఆలస్యమవుతోంది. దీంతో అన్ని నగరాల్లో సంతాన సాఫల్య కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. దీంతోపాటు కొంతమంది మహిళలు సంతాన సౌఖ్యం కోసం వివిధ ఆలయాల్లో పూజలు చేస్తున్నారు. ఇలా సంతాన సాఫల్య కేంద్రాలు, ఆలయాల వద్ద సరోజిని ఓ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుందని తెలుస్తోంది. వివాహమై ఏళ్లు గడుస్తున్నా సంతానం లేని వారితో పరిచయాలు పెంచుకుని ఉత్తరాది నుంచి తీసుకొచ్చిన శిశువులను విక్రయిస్తున్నట్టు తెలిసింది. ఒక్క హైదరాబాద్‌లోనే 40 మంది శిశువులను విక్రయించినట్టు అక్కడి పోలీసులు గుర్తించారు. మొత్తానికి ఈ శిశువుల విక్రయం ఓ సంచలనంగా మారింది. ఎలాంటి చట్టబద్ధత లేకుండా సరోజిని నుంచి శిశువులను కొని సంతోషపడిన దంపతులు ఇప్పుడు చిక్కుల్లో పడ్డారు. ఈ శిశువులను కొనుగోలు చేసిన వారిపైనా కేసులు న మోదు చేయడానికి పోలీసులు రంగం సిద్ధం చేశారు.

అవినీతికి కేరాఫ్‌గా బీసీ హాస్టళ్లు

(5వ పేజీ తరువాయి)

ప్రశ్నించారు. వార్డెన్ ఐదేళ్లకు పైగా ఇక్కడే పాతుకుపోయి పనిచేస్తుండటం, బాధ్యతారాహిత్యంగా ఉండటాన్ని ఆయన గుర్తించారు. హాస్టల్‌లో వాస్తవంగా ఉన్న విద్యార్థులు, అక్కడి అధ్వాన పరిస్థితులు, వార్డెన్ నిర్వాకాలపై ఆయన జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

అధికారిపై చర్యలా..?

గుణదల హాస్టల్ వార్డెన్‌పై తక్షణం చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కబెట్టారు. కానీ, నివేదిక ఇచ్చిన సహాయ బీసీ వెల్ఫేర్ అధికారిపైనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని సస్పెండ్ చేశారు. మైలవరం బాలికల హాస్టల్‌కు సంబంధించి అలక్ష్యంగా ఉన్నారని ఈ చర్యలు తీసుకున్నారు. మైలవరం బాలికల హాస్టల్ వార్డెన్ తరచూ విధులకు గైర్హాజరవుతున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. వీటిపై సదరు అధికారి గతంలో పలుమార్లు తనిఖీలు చేశారు. వార్డెన్ అందుబాటులో లేని విషయాన్ని గమనించారు. ఈ ఉదంతాలపై జిల్లా అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయకపోయినా మౌఖికంగా తెలియజేశారు. ఈ ఘటనలో తమకు రిపోర్టు ఇవ్వటంలో అలక్ష్యం నెలకొందన్న కారణంగా సహాయ బీసీ వెల్ఫేర్ అధికారిని బాధ్యుడిని చేస్తూ వార్డెన్‌తో పాటు సస్పెన్షన్ విధించారు. ఇదే అధికారి గుణదల విషయంలో అధికారికంగా ఫిర్యాదు చేస్తే మాత్రం పట్టించుకోలేదు.

చాలా హాస్టళ్లలో ఇదే పరిస్థితి

జిల్లావ్యాప్తంగా పలు హాస్టళ్లలో చూపిస్తున్న విద్యార్థుల సంఖ్య కంటే వాస్తవ సంఖ్య చాలా తక్కువగా ఉంటోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వాటిపై ఫిర్యాదులు వస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవట్లేదు. జిల్లా ఉన్నతాధికారులుగా పనిచేసిన వారికి పైస్థాయి, కిందిస్థాయిలో సత్సంబంధాలు ఉండట్లేదు. జిల్లా అధికారులుగా ఎవరు రావాలో కూడా ఓ సహాయ బీసీ వెల్ఫేర్ అధికారి నిర్ణయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. విజయవాడ రావాలని ఎప్పటినుంచో ప్రయత్నాలు చేస్తున్న ఆ అధికారి తిప్పిన చక్రం ఫలితంగానే విజయవాడ సహాయ బీసీ వెల్ఫేర్ అధికారిపై చర్యలు తీసుకున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110,119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 485

యోగా పోటీలకు ఎస్ఆర్ఆర్ వ్యాయామ అధ్యాపకుడి ఎంపిక

గుణదల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ యోగా పోటీల్లో పాల్గొనేందుకు తమ కళాశాల నుంచి వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ డి.యుగంధర్ ఎంపిక కావడం కళాశాల ఖ్యాతిని దేశానికి చాటిచెప్పే అవకాశం వచ్చినట్లుగా భావిస్తున్నట్లు ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ నెల 5 నుంచి 8 వరకు పంజాబ్, ఛండీగడ్‌లో జాతీయ యోగా పోటీలు జరగనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ డి.యుగంధర్ ఎంపికవడం గర్వించదగిన విషయం అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కళాశాల సిబ్బంది శనివారం అభినందనలు తెలియజేశారు.

సకాలంలో పింఛన్ల పంపిణీ

ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట నారాయణ

కార్పొరేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లు పంపిణీ చేస్తామని నగరపాలక సంస్థ యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి. వెంకట నారాయణ తెలిపారు. శనివారం నగరంలో పలు ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీని ప్రాజెక్ట్ ఆఫీసర్ పర్యవేక్షించారు. రామలింగేశ్వరనగర్‌లో పలువురు లబ్ధిదారులకు స్వయంగా ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 64 డివిజన్లలో పింఛన్‌ల పంపిణీ జరుగుతుందని, సాయంత్రం 5 గంటలకు 93 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు



రాణిగారితోటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట నారాయణ

తెలిపారు. సర్కిల్-1 పరిధిలో 20,392 మందికి గాను 18,776 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. సర్కిల్-2లో 25,676 మందికి గాను 24,093 మందికి, సర్కిల్-3 పరిధిలో 20,437 మందికి గాను 18,820మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

మిగిలిన పింఛన్లు త్వరితగతిన పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సచివాలయ సెక్రటరీలు, యూసీడీ, సోషల్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



స్టెల్లా కళాశాలలో పరీక్ష కేంద్రానికి తల్లితో వస్తున్న విద్యార్థిని, హాల్‌టికెట్ చెక్ చేస్తున్న ఉద్యోగి, తన నంబరు చేసుకుంటున్న విద్యార్థిని



మాట్లాడుతున్న డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, వేదికపై డాక్టర్ బి.జోజి రెడ్డి , ఫాదర్ బాలస్వామి, మిమిక్రీ స్టార్ సిల్వెస్టర్, పాటలు పాడుతున్న విద్యార్థినులు

మానసిక ఉల్లాసానికి సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రముఖ వైద్యనిపుణుడు ఇండ్ల రామసుబ్బారెడ్డి

భారతీనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ప్రముఖ వైద్యనిపుణులు ఇండ్ల రామసుబ్బారెడ్డి అన్నారు. ఆంధ్రా లయోల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల వార్షిక సాంస్కృతిక ఉత్సవం, వెంతురా 2కె25 కార్యక్రమం ఫాదర్ దేవయ్య ఆడిటోరియంలో శనివారం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇండ్లాస్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. విజయసారథి, మిమిక్రీ స్టార్ సిల్వెస్టర్ పాల్గొన్నారు. డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థిదశలోనే విద్యతో పాటు అన్ని రంగాలను తెలుసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరు తమలోని ప్రతిభను కనబరచాలని అన్నారు. డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజి రెడ్డి మాట్లాడుతూ వెంతురా కేవలం ఒక సాంస్కృతిక ఉత్సవం కాదని అన్నారు. ఇది స్వీయ ఆవిష్కరణ ప్రయాణం అన్నారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి, సాంస్కృతిక సమన్వయకర్తలు అర్చన, నిహారిక, విభాగాధిపతులు, 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

6న పలు అంశాల్లో మహిళలకు పోటీలు

గవర్నర్‌పేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే వివిధ పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎంబీవీకె మేనేజింగ్ కమిటీ సభ్యురాలు కె. స్వరూపరాణి మాట్లాడుతూ ఎంబీవీకె, ఫోరం ఫర్ ఆర్టిస్టులు, పేఫ్, తరుణీతరంగాలు, బారత మహిళా మండలి, స్పృహాస్త్రి, జన శిక్షణా సంస్థాన్‌లు కలిసి ఈ ఏడాది లింగ సమానత్వం, వనరుల పెంపు, అన్ని రంగాల్లో మహిళలు సమభాగస్వామ్యం కోసం కృషి సాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 6న మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యుదయ పాటల పోటీలు, సమానత్వం-సాధికారిత అంశంపై కవితల పోటీలు, చిత్రకళా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిత్రకళా పోటీలు మూడు కేటగిరిల్లో ఉంటాయని, లింగ సమానత్వంపై మహిళలు, కృత్రిమ మేథస్సు లాభనష్టాలపై కాలేజీ విద్యార్థులు, శ్రామిక మహిళల పనులు-పని గంటలు సమస్యలపై శ్రామిక మహిళలు పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పోటీలు ఈనెల 6న మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమౌతాయని, చిత్రకళ పోటీల్లో పాల్గొనేవారు చిత్రాన్ని ఇంటివద్దనే గీసి తీసుకురావాలని కోరారు.



పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ

పోటీల్లో 18 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులు ఎవరైనా పాల్గొనవచ్చని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 4లోగా వాట్సాప్ నెంబర్లకు తమ పేర్లు పంపి నమోదు చేసుకోవాలని కోరారు. 88882 44344, 92916 03475, 96421 74745 నెంబర్లకు వాట్సాప్ పంపాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పి. విజయ, ఏ. గిరిధర్, ఏ. పూర్ణిమ, ఉషారాజ, కె. గీత, నందిని పాల్గొన్నారు.

జనశిక్షణా సంస్థాన్‌లో ఉపాధి శిక్షణా కార్యక్రమాలు

మొగల్రాజపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి నిమిత్తం జనశిక్షణా సంస్థాన్ మార్చిలో సంస్థ ఛైర్‌పర్సన్ డాక్టర్ నాగళ్ల విద్యాఖన్నా ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, కటింగ్, టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, మెషిన్ ఎంబ్రాయిడరీ, మిర్రర్ వర్క్స్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ రిఫ్రిజరేషన్ వర్క్స్, స్క్రీన్ ప్రింటింగ్, జామ్ జ్యూస్‌లు తయారీ, బాతిక్ ప్రింటింగ్, హోమ్ క్రాఫ్ట్స్ తయారీలలో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి కల వారు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో కాని, 0866-2470420లో కాని సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

గణితశాస్త్ర పరిశోధనలపై మక్కువ పెంచుకోండి

యువతకు భౌతికశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సుధాకర్ సూచన



గుణదల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): యువత భవిష్యత్తులో రాణించాలంటే గణితశాస్త్ర పరిశోధనలపై మక్కువ పెంచుకోవాలని భౌతికశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి.కె.సుధాకర్ తెలిపారు. ఆంధ్రా లయోల కళాశాలలో గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన సుధాకర్ భవిష్యత్తు ఆకాంక్షలను ఎలా నెరవేర్చుకోవాలన్నది వివరించారు. గణిత శాస్త్ర విభాగాధిపతి కె.అనురాధ కన్వీనర్‌గా వ్యవహరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కె.ఎం.ప్రభుదాస్, గణితశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ వేణుగోపాలరావు, పి.చెంచుబాబు, డాక్టర్ బి.తబిత, పి.హెఫ్సిబ్యూలా, డాక్టర్ కె.ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గద్దె రామ్మోహన్ సేవా కార్యక్రమాలే స్ఫూర్తి : క్రాంతికుమార్

పటమట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవ, తోటివారికి సహాయం చేసే గుణాన్ని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను చూసి తామంతా నేర్చుకున్నామని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ తెలిపారు. రామలింగేశ్వర్ నగర్‌కు చెందిన నడికట్ల కృష్ణమోహన్‌కు ఆటో కొనుగోలు నిమిత్తం డౌన్ పేమెంట్ రూ.35 వేలను క్రాంతికుమార్ ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో యనమర్తి శ్రీనివాస్, మెడబలిమి భార్గవ్, మోరంపూడి ధీరజ్, పి.వరుణశ్రీసాయి, తుమ్మల వెంకట్, నితిన్, చిన్న పాల్గొన్నారు.



కృష్ణమోహన్ దంపతులకు ఆర్థిక సాయం చేస్తున్న గద్దె క్రాంతి కుమార్

మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించాలి

పటమట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఈరోజుల్లో మత్తు పదార్థాల వినియోగం చిన్న వయస్సు నుంచి పెరిగిపోతుందని, సామాజిక బాధ్యతతో మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించాలని నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో.ఆర్డినేటర్ ఎస్.జాకబ్‌రాజు పిలుపునిచ్చారు. పటమటలంక లంబాడీ ఏరియాలో శనివారం డీ అడిక్షన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సీహెచ్ శ్యామలత, ఎస్.కెనజ్మా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత పోటీ పరీక్షలపై దృష్టి పెట్టాలి

ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి

గుణదల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): యువత పోటీపరీక్షలపై దృష్టి పెట్టి సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పేరెంట్ టీచర్ మీటింగ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఎకనామిక్స్ విభాగం కల్పించే మౌలిక వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నల్ క్వాలిటీ ఎసెస్మెంట్ కన్వీనర్ డాక్టర్ జె.నాగేశ్వరరావు, అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ కె.చంద్రశేఖర్, దిల్షాద్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం



ఆటోనగర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గత నెల 25న పటమట హైస్కూల్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనం ఢీకొట్టి వృద్ధుడు మృతి చెందాడు. మృతుడు వివరాలు తెలియరాలేదని ఎస్.ఐ కృష్ణవర్మ తెలిపారు. మృతుడు వయసు 55 నుంచి 60 ఏళ్లు ఉం టుందని, గోధుమ రంగు చొక్కా, వక్కపొడి రంగు లుంగీ ధరించాడని తెలిపారు. వివరాలు తెలిస్తే పటమట పోలీస్ స్టేషన్లో 9347152223, 7981881018 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మాతృభాష అభివృద్ధికి నిధుల కేటాయింపు సంతోషకరం

● గోళ్ల నారాయణరావు

విజయవాడ కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాష అభివృద్ధి కోసం రూ.10కోట్లు ఈ బడ్జెట్‌లో కేటాయించడం సంతోషకరమని జీఆర్కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అదే రూ.100కోట్లు కేటాయిస్తే సంబరం కలిగేదని పేర్కొన్నారు. ఆ మేరకు నిధులను కేటాయించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రాచీన హోదా పొందిన తెలుగు భాష లక్ష్యాలను వేగంగా అందుకోగలిగే కార్యాచరణ రూపొందించాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ గ్రంథాలయాలను అసంఖ్యాకంగా ఏర్పాటు చేసి, పుస్తకాల కొనుగోళ్లకు అధికంగా నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బీసీలకు అత్యధిక నిధుల కేటాయింపు హర్షణీయం

బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు పీవీఎల్ఎన్ రాజు

గాంధీనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల వర్గాల ప్రజల వివిధ సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయించడం హర్షణీయమని బీసీ ఐక్యవేదిక నగర అధ్యక్షుడు పీవీఎల్ఎన్ రాజు తెలిపారు. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గాంధీనగర్‌లోని శనివారం మీడియాతో మాట్లాడారు. ఇంకా కొన్ని వెనుకబడిన తరగతుల కులాలకు కార్పొరేషన్‌లను, ఛైర్మన్లను, కమిటీలను త్వరలో ప్రకటించాలని కోరారు. రాష్ట్ర జనాభాలో 50 శాతం పైగా ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన నామినేటెడ్ పోస్టులు కేటాయించాలన్నారు.

కానూరు కష్టాలకు చెక్!

- మెయిన్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం
- ఏలూరు రోడ్డు నుంచి పీవీఆర్ ఐకాన్ వరకు 2 వరసలుగా విస్తరణ
- రూ. 3.54 కోట్ల వ్యయంతో పనులు చేపట్టిన సీఆర్‌డీఏ
- సెంట్రల్ డివైడర్‌తో కూడిన రెండు వరసల రోడ్డుగా అభివృద్ధి

ఆంధ్రజ్యోతి, విజయవాడ: శక్తి కల్యాణమండపం రోడ్డు (కానూరు మెయిన్ రోడ్డు) విస్తరణ పనులను సీఆర్‌డీఏ అధికారులు చేపట్టారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సింగిల్ లేన్‌గా ఉన్న రోడ్డును డబుల్ లేన్‌గా విస్తరిస్తున్నారు. శక్తి కల్యాణమండపం నుంచి పీవీఆర్ ఐకాన్ అపార్ట్‌మెంట్స్ వరకు రూ. 3.54 కోట్ల వ్యయంతో రోడ్డును విస్తరిస్తున్నారు. రెండో లేన్ కోసం ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. విజయవాడ - ఏలూరు రోడ్డు ప్రారంభంలో రెండో లేన్ పనులు చేసే దగ్గర కల్వర్టు నిర్మాణం కూడా పూర్తి చేశారు. వెట్‌మిక్స్, హాట్‌మిక్స్ పనులు చేపడుతున్నారు. త్వరలో సెంట్రల్ డివైడర్ పనులు చేపట్టనున్నారు. 16వ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16)కు అనుసంధానంగా శ్రీ శక్తి కళ్యాణమండపం నుంచి కానూరు మెయిన్ రోడ్డు ముందుకు సాగుతూ కామయ్యతోపు వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 65)ని తాకుతుంది. విజయవాడలో అంతర్గత ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కానూరు మెయిన్ రోడ్డు దోహదపడుతుంది. ఎనికేపాడు - తాడిగడప కానూరు 100 అడుగుల రోడ్డుకు దిగువున కానూరు మెయిన్ రోడ్డు ఉంటుంది. ఈ రోడ్డు విస్తరణ ద్వారా ఎనికేపాడు, ప్రసాదంపాడు ప్రాంతాల ప్రజలకు, తాడిగడప, కానూరు, అశోకనగర్, ఆటోనగర్ ప్రాంతాలకు విజయవాడను నేరుగా టచ్ చేయకుండానే బయట నుంచి బయటకు రాకపోకలు సాగించవచ్చు. ఒకరకంగా ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-65ను అనుసంధానిస్తుంది కాబట్టి తేలికపాటి వాహనాలకు చక్కటి ప్రత్యామ్నాయంగా ఉంటుంది.

కొయ్యూరులో రేషన్ బియ్యం పట్టివేత

- 15.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

హనుమాన్‌జంక్షన్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు గ్రామంలో పరదాలు కప్పి అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యాన్ని శనివారం అధికారులు ఆకస్మికంగా దాడి చేసి పట్టుకున్నారు. గన్నవరం, పీడీఎస్ డీటీ ప్రధాన్ తెలిపిన వివరాల ప్రకారం వచ్చిన సమాచారంతో గ్రామంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించగా 32 బ్యాగుల్లో నిల్వ ఉంచిన సుమారు 15.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సేకరించిన రేషన్ బియ్యాన్ని కొయ్యూరు వద్ద నిలువ ఉంచి చేపల మేతకు వినియోగించే పిల్లెట్లు, ఇతర ఆహార పదార్థాల తయారీకి వినియోగించుకునేందుకు తరలిస్తున్నట్టు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మల్లవల్లి రాంబాబు అనే వ్యక్తి తెలిపినట్లు వివరించారు. తండ్రీ కొడుకులైన మల్లవల్లి రాంబాబు, శ్యామ్ కలిసి ఈ వ్యాపారం చేస్తున్నట్లు తెలిసిందన్నారు. బియ్యాన్ని స్థానికంగా ఉన్న ఒక రైస్ మిల్లులో ఉంచి, రాంబాబును అదుపులోకి తీసుకుని 6ఏ, 7సీ కేసులు నమోదు చేసినట్టు ప్రధాన్ తెలిపారు.

గంజాయి బ్యాచ్ వీరంగం

గంజాయి సేవించాలంటూ బలవంతం.. వినలేదని దాడి

పెనమలూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు మైనర్లతో గంజాయి తాగించడానికి బలవంతం చేసి, అడ్డుకున్నందుకు వారి బంధువులపై దాడిచేసి చేతులు విరిచిన గంజాయి బ్యాచ్ బీభత్సంపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కానూరు సనత్‌నగర్ మదీనా మసీద్‌కు సమీపంలో నివాసముండే షేక్ అబ్దుల్‌కు అబ్దుల్ హకీం, అబ్దుల్ రహీం అనే ఇద్దరు కుమారులు. గతేడాది వీరిపై రిజ్వాన్, నయీం, కరీం, బుడా అనే మైనర్ బాలురు గొడవ పడడంతో అబ్దుల్ వారిని హెచ్చరించి వదిలేశాడు. ఫిబ్రవరి 25న తన కుమారులు హకీం, రహీం దగ్గర్లోని మసీదుకు వెళ్లి వస్తుండగా దారిలో నయీం, నజీర్, కరీం, సమీర్, బుడా అడ్డగించి తమ కుమారులతో బలవంతంగా గంజాయి తాగించేందుకు యత్నం చేశారు. గంజాయి తాగకుంటే నరికేస్తామని బెదిరించి దాడి చేసి కొట్టారు. ఈ విషయం తెలుసుకొన్న అబ్దుల్ తన బావమరుదులైన సలీం, ఖలీల్‌ను తీసుకొని మదీనా మసీదు వద్దకు వెళ్లి ఆపే ప్రయత్నం చేయగా మత్తులో ఉన్న ఆ అయిదుగురు కర్రలు, రాడ్లతో దాడి చేసి కారం చల్లేందుకు ప్రయత్నించారు. ఈ దాడిలో అబ్దుల్ కుడి చేయి విరగ్గా అతడి బావమరుదులకు శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. అబ్దుల్ తోడల్లుడి ప్రైవేట్ భాగాలపై తీవ్రంగా దాడి చేసి కొట్టారు. తాము చెప్పినట్టు వినకపోతే చంపేస్తామని బెదిరించారు. దీంతో భయకింపితుడైన అబ్దుల్ తన బంధువులు, కుమారులతో కలిసి పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా వ్యాపారితో జీఎస్టీవో అసభ్య ప్రవర్తన

- కమిషనర్‌కు మహిళ ఫిర్యాదు

విజయవాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖలో ఒకటో డివిజన్ పరిధిలోని గొల్లపూడి సర్కిల్‌లో పనిచేస్తున్న జీఎస్టీవో ఒకరు మహిళా వ్యాపారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై బాధితురాలు వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. విజయవాడ నున్న ప్రాంతానికి చెందిన ఓ మహిళ వ్యాపారం మొదలుపెట్టింది. జీఎస్టీ రిజిస్ట్రేషన్ కోసం గొల్లపూడి సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంది. ఇక్కడ నలుగురు జీఎస్టీవోలుంటారు. మహిళ దరఖాస్తును పరిశీలించిన జీఎస్టీవో తిరస్కరించారు. రెండోసారి దరఖాస్తు చేసుకోగా ఇదే పరిస్థితి. ఏమిటని ప్రశ్నించగా రూ.10 వేలు జీఎస్టీవో డిమాండ్ చేశారు. ఆ మొత్తాన్ని ఇవ్వడానికి సిద్ధమైంది. డీలర్ల రిజిస్ట్రేషన్ల కోసం క్షేత్రస్థాయికి వెళ్లిన జీఎస్టీవో ఆ మహిళను కారులో ఎక్కించుకుని డబ్బులు తీసుకునే క్రమంలో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై ఆమె కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. ఆయన విచారణకు ఆదేశించినట్టు సమాచారం. పార్క్ సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్‌ను విచారణాధికారిగా నియమించినట్టు తెలిసింది. వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘానికి నేతగా వ్యవహరిస్తున్న ఒక వ్యక్తి తనను ఇరికించాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి తోటి ఉద్యోగుల వద్ద వాపోయినట్టు తెలిసింది.

అమ్మో దోమ

(5వ పేజీ తరువాయి)

నగరపాలక సంస్థ ఏటా రూ.లక్షల్లో ఖర్చు చేస్తోంది. అయినప్పటికీ సీజన్‌లోనే కాకుండా అన్ని సమయాల్లో దోమల బెడద తప్పట్లేదు. 2018-19లో దోమల నివారణకు రూ.95 లక్షలు, 2019-20లో రూ.కోటి, 2020-21లో రూ.87 లక్షలు, 2021-22లో రూ.85 లక్షలు, 2022-23 సుమారు రూ.80 లక్షలు, 2023-24 సుమారు రూ.90 లక్షలు, 2024-25 సుమారు రూ.80 లక్షలు దోమల నివారణకు కేటాయించారు. నిధులైతే ఖర్చు అవుతున్నాయి కానీ, ఫలితాలు అంతగా కనిపించట్లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

మురుగు పారుదల లేకే..

కొండ ప్రాంతాలతో పాటు మురుగునీరు పారుదల సక్రమంగా లేని పలు ప్రాంతాల్లోని ప్రజలు దోమలతో ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. అజిత్ సింగ్‌నగర్, భవానీపురం, ఊర్మిళానగర్, కేఎల్ రావు నగర్, కొత్తపేట కొండ ప్రాంతం, గొల్లపాలెంగట్టు, ప్రైజర్‌పేట, పాతరాజరాజేశ్వరిపేట, వాంబేకాలనీ, కృష్ణలంక, రాణిగారితోట, కండ్రిక ప్రాంతాలతో పాటు సర్కిల్-3లో పరిస్థితి ఘోరంగా ఉంది.

ప్రబలుతున్న విషజర్వాలు

దోమల విజృంభనతో నగరవాసులు జ్వరాల బారిన పడుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు మాత్రం డెంగీ, మలేరియా వంటి కేసులు వస్తే మినహా నివారణ చర్యలు అంతగా పట్టించుకోవట్లేదు. ఇటీవల కాలంలో పొగ వినహా యాంటీ లార్వా ఆపరేషన్ పనులు ఎక్కడా కనిపించట్లేదు. ముందస్తు చర్యలే లేవు. మలేరియా విభాగంలో అధికారులు, సిబ్బంది తూతూమంత్రం విధులు నిర్వహిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

దోమల నివారణకు ప్రతి వారం డ్రైడే పాటిస్తున్నాం. ఇటీవల మలేరియా, డెంగీ కేసులు తగ్గాయి. కేసులున్న ప్రాంతాల్లో సుమారు 50, 60 ఇళ్ల వరకు దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నాం.

- సూర్యకుమార్, ఇన్‌చార్జి బయాలజిస్ట్

నగరంలో బర్మా కాలనీ



పొరుగు దేశం బర్మా (ప్రస్తుతం మయన్మార్) పేరుతో నగరంలో ఓ కాలనీ ఉందన్న విషయం చాలామందికి తెలియదు. అసలు బర్మా పేరుతో కాలనీ ఏంటబ్బా అనే అనుమానం అక్కర్లేదు. నిజంగానే బర్మా పేరుతో నగరంలో ఓ కాలనీ ఉంది. 40 ఏళ్లుగా ప్రజలిక్కడ నివాసం ఉంటున్నారు. వారి ఆధార్, రేషన్ కార్డులు, పాస్‌పోర్ట్ సహా ప్రతి ఐడీలోను బర్మా పేరు నమోదై ఉంటుంది. మన దేశం నుంచి వ్యాపారులుగా వెళ్లి శరణార్థులుగా తిరిగొచ్చిన కాలనీవాసుల కథలో అనేక మలుపులున్నాయి. నగరంలోని పాయకాపురంలో ఉన్న బర్మా కాలనీ కథా కమామీషు ఏవిటో తెలుసుకుందాం.

- ఆంధ్రజ్యోతి, పాయకాపురం



- నేటికీ అదే పేరుతో కొనసాగింపు
- వ్యాపారులుగా వెళ్లి.. శరణార్థులుగా తిరిగొచ్చి..
- అప్పట్లో రంగూన్‌లో వ్యాపారాలన్నీ మన వాళ్లవే..!
- అక్కడి సైనికపాలనతో కట్టుబట్టలతో స్వదేశాలకు
- 40 ఏళ్లగా పాయకాపురంలో స్థిర నివాసాలు



బ్రిటీషు వారి పాలనలో భారత దేశం దక్షిణాది రాష్ట్రాలు బర్మాతో బలమైన వాణిజ్య సంబంధాలు కలిగి ఉండేది. దీంతో అనేక కుటుంబాలు వివిధ వ్యాపారాల నిమిత్తం బర్మాకు వలస వెళ్లాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రం నుంచి కూడా వందలాది కుటుంబాలు బర్మాకు వలసవెళ్లి అప్పటి బర్మా రాజధాని రంగూన్‌లో స్థిరపడ్డారు. అక్కడ మనవాళ్ల సంఖ్యాబలం వ్యాపారంలో మెళకువలతో రాణించడమే కాకుండా ఆధిపత్యం ప్రదర్శించే స్థాయికి వెళ్లిపోయారు. దాదాపుగా రంగూన్‌లో వ్యాపారాలన్నీ మనవాళ్ల చేతుల్లోనే ఉండేవి.

మలుపుతిప్పిన సైనికపాలన

మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్టు సాగిపోతున్న మనవాళ్ల జీవితాలు అనుకోకుండా మలుపుతిరిగింది. 1962లో బర్మాలో సైనిక పాలన రావడంతో ఒక్కరాత్రిలోనే భారతీయుల జీవితాలు తల్లకిందులైపోయాయి. అప్పటి వరకు వారు సంపాదించుకున్న ఆస్తులు, వ్యాపారాలు అప్పటి ప్రభుత్వం లాగేసుకుంది. ఆంక్షలు పెరిగిపోయాయి. ప్రైవేటు వ్యాపారాలన్నీ జాతీయం చేశారు. లైసెన్సులు ఇచ్చేవారు కాదు. పైగా వెంటనే తమ తమ స్వదేశాలకు వెళ్లిపోవాల్సిందిగా హుకుం జారీ చేశారు. కేవలం తమ స్వదేశానికి వెళ్లేందుకు అవసరమైన కొంత నగదు మాత్రమే తిరిగిచ్చారు. ఇన్ని కఠిన ఆంక్షల నడుమ కొన్ని వేల కుటుంబాలు స్వదేశానికి తిరిగి వచ్చేందుకు సిద్ధమయ్యారు. దీంతో అప్పటి ప్రభుత్వం రవాణా ఏర్పాట్లు చేయడంతో అప్పటి వరకు తాము సంపాదించుకున్న ఆస్తులు, సంపద, వ్యాపారాలు అన్నీ కట్టుబట్టలతో కొందరు రైళ్లు, మరికొందరు ఓడల్లో, మరి కొందరు కాలిబాటన స్వదేశానికి తిరిగి వచ్చేశారు. మార్గమధ్యంలో ఎంతోమంది ప్రాణాలు వదిలిన వారు ఉన్నట్టు కాలనీ వాసులు అప్పటి రోజులను గుర్తు చేసుకుంటూ చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకుంటూ చెబుతున్నారు.

స్వదేశంలో కాలనీల నిర్మాణం

అప్పట్లో మనదేశానికి ప్రధానమంత్రిగా ఉన్న లాల్‌బహదూర్ శాస్త్రి స్వదేశానికి తిరిగి వచ్చిన భారతీయులు ఏ రాష్ట్రాల నుంచి వలస వెళ్లారో గుర్తించి ఆయా రాష్ట్రాల్లో కాలనీలను నిర్మాణం చేసి వసతి కల్పించారు. ఈ క్రమంలో దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోను బర్మా కాలనీల నిర్మాణాలు జరిగాయి. అందులో భాగంగా నగరంలోని పాయకాపురం ప్రాంతంలో 131 ఇళ్లతో బర్మా కాలనీ ఏర్పాటైంది. 60 ఏళ్ల క్రితం నగరానికి వలస వచ్చిన వీరికి 1964 ఆగస్టు 14న బర్మాకాలనీలో ఇళ్లు కేటాయించింది. అప్పటి నుంచి కాలనీ పేరు బర్మా కాలనీగానే స్థిరపడిపోయింది.

పంచాయతీలో నిధుల దుర్వినియోగం

కూచిపూడి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాజ గ్రామ పంచాయతీలో రూ.10,77,132 నిధులు దుర్వినియోగానికి పాల్పడిన జూనియర్ అసిస్టెంట్ సిద్దెల సురేంద్రబాబుపై క్రిమినల్ చర్యలు చేపట్టాలంటూ మొవ్వ మండల పరిషత్ పంచాయతీల విస్తరణాధికారి (ఈవోపీఆర్‌డీ) ఎం.ఎస్.కె.పరమాత్మ కూచిపూడి ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యానికి ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీలో వసూలు చేసిన ఇంటి పన్నులు, నీటితీరువా, ఇతర పన్నులకు సంబంధించిన నిధులను గ్రామ పంచాయతీకి జమ చేయకుండా గతేడాది సొంత అవసరాలకు వాడుకున్నాడని పేర్కొన్నారు. అప్పట్లోనే పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి ఏడీవీఎల్ ప్రసాద్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఉన్నతాధికారుల విచారణలో నిధులు దుర్వినియోగమైనట్టు తెలియడంతో గతేడాది జూలై 1న అతడిని సస్పెండ్ చేశారన్నారు. స్టాంపులు, పత్రాల ఫోర్జరీనే కాక నిధులు దుర్వినియోగంపై జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల ప్రకారం సురేంద్ర బాబుపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాజ గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్టు అప్పట్లోనే తాను లోకాయుక్తకు ఫిర్యాదు చేశానని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్ తెలిపారు. విచారణ చేపట్టిన రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ నిధులు దుర్వినియోగమైనట్టు లోకాయుక్తకు నివేదిక ఇచ్చారన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌పై పోలీసులకు ఈవోపీఆర్‌డీ ఫిర్యాదు



కాజ గ్రామ పంచాయతీ కార్యాలయం

ఫిర్యాదు అందింది: ఎస్‌ఐ

దీనిపై కూచిపూడి ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యాన్ని వివరణ కోరగా ఈవోపీఆర్‌డీ పరమాత్మ ఫిర్యాదు వాస్తవమేనని ధ్రువీకరించారు. కొన్ని డాక్యుమెంట్లు సమర్పించాడని, మరికొన్ని అందాల్సి ఉందని, ఒకటి, రెండు రోజుల్లో కేసు నమోదు చేస్తామని తెలిపారు. సకాలంలో స్పందించి ఉంటే ఇలాంటి సంఘటనలు జరిగి ఉండేవి కాదని కాజ గ్రామస్థులు పేర్కొంటున్నారు.

ఇన్‌విక్టా నగర విద్యార్థికి రూ.2.40 కోట్ల ఉపకార వేతనం

మొగల్రాజపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తమ వద్ద చదివిన తమ విద్యార్థికి నాలుగేళ్ల కంప్యూటర్ సైన్సు కోర్సులో రూ.2.40 కోట్ల ఉపకార వేతనం లభించిందని ఇన్విక్ట మేనేజింగ్ డైరెక్టర్ జొన్నలగడ్డ వివేకానంద మూర్తి తెలిపారు. గాయత్రీనగర్‌లోని కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థి మిరియాల ఆదిత్య అమెరికాలో టాప్ 10 వర్సిటీల్లో ఒకటైన మిల్వాకీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ప్రవేశంతోపాటు ఉపకార వేతనం సాధించాడన్నారు. రెండేళ్లు కష్టపడి శాట్ అండ్ ఐఈఎల్‌టీఎస్ ప్రవేశపరీక్షలో భాగంగా ఇంటర్ ఫస్టియర్‌లో 98శాతం మార్కులు సాధించి ప్రతిభ చూపి తెలుగు రాష్ట్రాల్లో ఈ ఘనత సాధించిన మొదటి విద్యార్థిగా నిలిచాడన్నారు. ఆదిత్య తో పాటు మరో 15 మంది విద్యార్థులకు కూడా రూ. కోటికి పైగా ఉపకార వేతనం లభించిందన్నారు. ఆదిత్య మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఇన్విక్టా వివేకానంద మూర్తి శిక్షణ ఎంతగానో తోడ్పడ్డాయన్నారు. ప్రస్తుతం ఆదిత్య చదువుతున్న శారద జూనియర్ కళాశాల డైరెక్టర్ శారదాదేవి అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఇన్విక్టా డైరెక్టర్లు కెఎస్ కృష్ణమోహన్, సౌమ్యదీప్ చక్రవర్తి తదితరులు ఆదిత్యను శాలువాతో సత్కరించారు.



మాట్లాడుతున్న విద్యార్థి ఆదిత్య



వంశీ రామరాజుకు స్వర్ణ కంకణాన్ని ప్రదానం చేస్తున్న మండలి బుద్ధప్రసాద్, వేణుగోపాల్ ప్రభాకర్ తదితరులు

వంశీ ఆర్ట్ థియేటర్స్ అధినేత

వంశీ రామరాజుకు స్వర్ణకంకణ ప్రదానం

విజయవాడ కల్చరల్ మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక, సినీ రంగాలకు వంశీ అందించిన సేవలు విశేషమైనవని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శారద కళా సమితి, స్వరలయ, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగరంలోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం వంశీ ఆర్ట్ థియేటర్స్ అధినేత వంశీ రామరాజుకు స్వర్ణకంకణం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ వంశీ 54ఏళ్లుగా తన జీవితాన్ని కళాసేవకే కాక సామాజిక స్పృహతో ఎన్నో కార్యక్రమాలను చేపట్టి, జాతీయంగానే కాక అంతర్జాతీయంగానూ మన తెలుగు సంస్కృతి బావుటాను ఎగరేశారన్నారు. భారత రాష్ట్రపతి నుంచి శిరోమణి అవార్డు సహా జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారన్నారు. అనంతరం సాంస్కృతిక సేవా సేనాధిపతి బిరుదు ప్రదానం చేసి స్వర్ణకంకణం తొడిగారు. విశ్రాంత న్యాయమూర్తి టి.వేణుగోపాలరావు, సంస్థ నిర్వాహకులు స్వరలయ సంస్థకు చెందిన ఎస్‌ఆర్ ప్రభాకర్, మోహన్ రామప్రసాద్, ఎస్వీ రామూర్తి పాల్గొన్నారు. ముందుగా గాయనీ, గాయకులు టి.బాలకామేశ్వరరావు, వైఎస్ రామకృష్ణ, పి శాంతిశ్రీ, ఇందు నయన మధురగానం చేసి శ్రోతలను అలరించారు. స్వరసౌరభం శీర్షికతో వాళ్లు సాగించిన సంగీత విభావరి ముగ్ధుల్ని చేసింది.

ఎన్టీఆర్ జిల్లాలో 92.48 శాతం పెన్షన్ల పంపిణీ

- 2,11,918 మందికి పెన్షన్ల పంపిణీ
- రూ. 90.39 కోట్లు పంపిణీ
- జీ కొండూరు మండలంలో అత్యధికంగా 94.21% పంపిణీ

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలో పెన్షన్ల పంపిణీ శనివారం 92.48 శాతం మేర పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 2,29,155 మంది పెన్షన్‌దారులుండగా శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు డీఆర్‌డీఏ నేతృత్వంలో 2,11,918 మందికి పెన్షన్లను పంపిణీ చేశారు. మొత్తం రూ.98.09 కోట్ల మేర పంపిణీ చేయాల్సి ఉండగా రూ. 90.39 కోట్ల మేర పెన్షన్ల పంపిణీ జరిగింది. జిల్లాలోని జీ కొండూరు మండలంలో 8510 పెన్షన్లకు గాను 8107 మందికి (94.21%), మైలవరం మండలంలో 9526 పెన్షన్లకు గాను 8970 మందికి (94.16), తిరువూరు అర్బన్‌లో 3345 పెన్షన్లకు గాను 3149 మందికి (94.14%), ఇబ్రహీంపట్నం మండలంలో 4751 మంది పెన్షనర్లకు 4472 మందికి (94.13%), విజయవాడ అర్బన్‌లో 66,505 మందికి గాను 62,519 మందికి (94.01%), జగ్గయ్యపేట అర్బన్‌లో 4825 మందికి 4536 మందికి (94.01%), విస్సన్నపేటలో 8109 మందికి గాను 7617 మంది(93.93%), కొండపల్లి అర్బన్‌లో 5228 మందికి గాను 4887 మందికి (93.48%), నందిగామ అర్బన్‌లో 4205 మందికి గాను 3930 మంది (93.46%), విజయవాడ రూరల్‌లో 17,223 మందికి గాను 15,996 మందికి (92.88%), ఏ కొండూరు మండలంలో 7316 మందికి 6752 మందికి (92.29%), గంపలగూడెం మండలంలో 11,321 మందికి 10,446 మంది (92.27%), కంచికచర్ల మండలంలో 10,139 మందికి, 9341 మందికి (92.13%), తిరువూరులో 6728 మందికి 6190 మందికి (92%), వత్సవాయిలో 9511 మందికి 8651 మందికి (90.96%), రెడ్డిగూడెంలో 7104 మందికి 6446 (90.74%), నందిగామలో 7845 మందికి 7098 (90.48%), జగ్గయ్యపేటలో 10,150 మందికి 9,158 మంది (90.23%), వీరులపాడులో 8639 మందికి 7783(90.99%), పెనుగంచిప్రోలులో 8376 మందికి 7401 మంది (88.36%), చందర్లపాడు మండలంలో 9799 మందికి 8559మంది (87.35%) చొప్పున పంపిణీ చేశారు.



పింఛన్‌దారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

క్షేత్రస్థాయిలో కలెక్టర్ లక్ష్మీశ తనిఖీలు

మొగల్రాజపురం/మధురానగర్: రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఎన్టీయార్ భరోసా పించన్ల పంపిణీ సజావుగా జరిగిందని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు. నగర పరిధిలోని మధురానగర్, మధ్యకట్ట ప్రాంతంలో పర్యటించి పంపిణీని ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా జరుగుతున్న పింఛన్ల పంపిణీని పరిశీలించారు. కొంతమంది పింఛన్‌దారులతో మాట్లాడారు. ఉదయం 7 గంటలకు పంపిణీ ప్రారంభమైందన్నారు. 2లక్షల 29 వేల 913 పించన్లకు రూ.98. 20 కోట్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తున్నారన్నారు. మొదటి రోజే మొత్తం పంపిణీ చేస్తారని, ఎక్కడన్నా వివిధ కారణాలతో అందుబాటులో లేకపోతే వారికి కూడా 3వ తేదీలోగా అందచేస్తామన్నారు. లబ్ధిదారుల ఇంటి నుంచి 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో పంపిణీ చేయాల్సి వస్తే కారణాన్ని ఎన్టీఆర్ భరోసా యాప్‌లో నమోదు చేస్తున్నట్టు చెప్పారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ప్రతి అంశాన్ని అధ్యయనం చేయాలి

- న్యాయ విద్యార్థులతో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి దుర్గాప్రసాద్



ప్రసంగిస్తున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి దుర్గాప్రసాద్

విజయవాడ లీగల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): న్యాయ విద్యార్థులు ప్రతి అంశాన్ని అధ్యయనం చేయాలని, సామాజిక ఇంజినీర్లుగా వారు తమ కర్తవ్యాన్ని విలువలతో నిర్వహించాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి యు.దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఐలూ (ఆలిండియా లాయర్స్ యూనియన్) రాష్ట్ర కార్యదర్శి నల్లూరి మాధవరావు అధ్యక్షతన జరిగిన ఐలూ న్యాయ విద్యార్థుల రాష్ట్ర సదస్సులో దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు నూతనంగా వచ్చిన చట్టాలను అధ్యయనం చేసి సమాజానికి తామెలా ఉపయోగపడాలో ఆలోచించాలన్నారు. ఐలూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ న్యాయవాదులు సంపాదన కన్నా సామాజిక బాధ్యతకే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విట్ వర్సిటీ లా స్కూల్ డీన్, డాక్టర్ చక్కా బెనర్జీ, సిద్ధార్థ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి దివాకర బాబు, గుంటూరు జేసీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.సుధాకర్ బాబు, కేఎల్‌యూ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఐ.పవన్‌కుమార్, జనవిజ్ఞాన వేదిక నేతలు డాక్టర్ తుమ్మల శ్రీకుమార్, హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్, తెలంగాణ రాష్ట్ర ఐలూ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి సత్యనారాయణ, కె.పార్థసారథి, ఐలూ జిల్లా కార్యదర్శి సంపర శ్రీ నివాసరావు, ఐలూ రాష్ట్ర నేత ఆలూరి సుధాకరరావు, ఐలూ రాష్ట్ర పూర్వ కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు, ఐలూ నగర అధ్యక్ష, కార్యదర్శులు సీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, వి.రాజారత్నం, బెజవాడ బార్ జాయింట్ కార్యదర్శి కలతోటి క్రాంతికుమార్, ఐలూ రాష్ట్ర నేతలు సప్పా రమేష్, ఆవుల వెంకట్రావు, కోట బాబు, పచ్చ కిరణ్, గొడవర్తి కిరణ్, జాషువా పాల్గొన్నారు. సదస్సులో 500 మంది న్యాయ విద్యార్థులు హాజరయ్యారు. షేక్ అహ్మద్ కన్వీనర్‌గా మరో 45మంది న్యాయ విద్యార్థులు సభ్యులుగా నూతన న్యాయ విద్యార్థుల కన్వీనింగ్ కమిటీని ఎన్నుకొన్నారు.



దుర్గగుడి బస్‌రూట్ల వివరాలతో బోర్డుల ఏర్పాటు

ఇంద్రకీలాద్రి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో దుర్గమ దర్శనానికి వచ్చే భక్తులకు దేవస్థానం ఈవో, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు దేవస్థానం బస్‌లో కొండపైకి వెళ్లేందుకు బస్ రూట్లు వివరాల బోర్డులను ఏర్పాటు చేశారు. విజయవాడ రైల్వేస్టేషన్, పండిట్ నెహ్రూ బస్టేషన్, దుర్గాఘాట్, కొండపైన తదితర ప్రాంతాల్లో ఈ బోర్డులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

పిల్లల స్క్రీన్ టైమ్ తగ్గించండి

పిల్లలు ఎక్కువసేపు టీవీ, ఫోన్ స్క్రీన్‌లను చూడడం ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల కంటి చూపు, మానసిక స్థితికి సంబంధించి పలు సమస్యలు ఎదురవుతాయని సూచిస్తున్నారు. పిల్లల స్క్రీన్ టైమ్ తగ్గించడానికి తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవి...

- తల్లిదండ్రులను అనుసరించడం పిల్లల సహజ గుణం. పిల్లలు టీవీ లేదా ఫోన్ చూడకుండా ఉండాలంటే ముందుగా తల్లిదండ్రులు ఆ పని చేయాలి. పిల్లలు ఇంట్లో ఉన్న సమయంలో టీవీ పెట్టకూడదు. ఫోన్ రింగ్‌టోన్‌ని కూడా బాగా తగ్గించి ఉంచుకోవాలి. అవసరమైతేనే ఫోన్‌లో మాట్లాడాలి.
- పిల్లల స్క్రీన్ టైమ్‌ని నియంత్రించడంలో తల్లిదండ్రులు కఠినంగానే వ్యవహరించాలి. ప్రతిరోజూ కొంత సమయాన్ని కేటాయించి అప్పుడు మాత్రమే టీవీని చూడనివ్వాలి. అలాగే ఫోన్‌లో గేమ్స్ ఆడుకోనివ్వాలి. మిగిలిన సమయంలో వాటి జోలికి పోకూడదనే నిబంధన విధించాలి. దీనివల్ల పిల్లల్లో సమయపాలన అలవడుతుంది. తల్లిదండ్రులు చెప్పినట్లు వినాలనే భావన మొదలవుతుంది.
- పిల్లలకు ఆరుబయట ఆటలాడడం అలవాటు చేస్తే వాళ్లు దాన్నే ఇష్టపడతారు. చుట్టుపక్కల ఉండే పిల్లలతో కలిసి ఆడుకోవడాన్ని తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. కుటుంబ సభ్యులంతా కలిసి చెస్, క్యారమ్స్ షటిల్ కాక్, రింగ్ త్రో, దాగుడుమూతలు, మ్యూజికల్ ఛైర్స్ లాంటి ఆటలు ఆడుతూ ఉంటే పిల్లలకు ఆటవిడుపుగా ఉంటుంది.



- టీవీ లేదా ఫోన్ నుంచి పిల్లల దృష్టి మరల్చడానికి వారిని చిన్నచిన్న పనుల్లో భాగస్వాములను చేయడం మంచిది. ఇంటి పనులు, తోట పని చెప్పి చేయించాలి. కొంచెం పెద్ద పిల్లలు అయితే బజారు నుంచి కూరలు, పళ్లు తేవడం లాంటివి చెప్పవచ్చు.
- తల్లిదండ్రులు ఎవరి పనుల్లో వారు పూర్తిగా మునిగిపోతే పిల్లలు టీవీకి అలవాటు పడే ప్రమాదం ఏర్పడుతుంది. కాబట్టి సాధ్యమైనంత ఎక్కువ సమయాన్ని పిల్లలతో గడపాలి. వారానికి ఒకసారి పిల్లలతో పార్క్‌కు వెళ్లడం, రాత్రిపూట కలిసి భోజనం చేయడం, పడుకునేముందు కొద్దిసేపు పిల్లలతో మాట్లాడడం, వారాంతాల్లో కుటుంబ సభ్యులంతా కలిసి ఏదైనా ట్రిప్‌కు వెళ్లడం లాంటివి పిల్లల వికాసానికి తోడ్పడతాయి. ఈ క్రమంలో పిల్లలు ఫోన్ గురించి మర్చిపోయే అవకాశం ఉంటుంది.






ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
విడాముయర్చి	తమిళ చిత్రం (తెలుగులో)	మార్చి 03
విత్ లవ్ మేఘన్	లైఫ్ స్టైల్ సిరీస్	మార్చి 04
నదానియాన్	హిందీ చిత్రం	మార్చి 07
అమెజాన్ ప్రైమ్		
దుపహియా	హిందీ చిత్రం	మార్చి 07
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
డేర్ డెవిల్	వెబ్‌సిరీస్	మార్చి 04
సోని లివ్		
రేఖాచిత్రమ్	మలయాళ చిత్రం (తెలుగులో)	మార్చి 07
ది వేకింగ్ ఆఫ్ ఏ నేషన్	హిందీ సిరీస్	మార్చి 07

'ది వేకింగ్ ఆఫ్ ఏ నేషన్'



1919లో జరిగిన జలియన్‌వాలా బాగ్ మారణకాండ అనంతర పరిణామాల ఆధారంగా తెరకెక్కిన హిందీ సిరీస్ 'ది వేకింగ్ ఆఫ్ ఏ నేషన్'. చారిత్రక కథాంశంతో తెరకెక్కుతోన్న ఈ సిరీస్‌కు రామ్ మధ్వానీ దర్శకత్వం వహిస్తున్నారు. తారుక్ రైనా, నికితా దత్తా ప్రధాన పాత్రలు పోషించారు. జలియన్‌వాలా బాగ్ హత్యాకాండలో బ్రిటీష్ సైన్యం పాత్రను నిరూపించేందుకు దేశభక్తులైన ఇద్దరు న్యాయవాదులు కోర్టులో చేసిన ప్రయత్నాల ఆధారంగా ఈ సిరీస్ రూపుదిద్దుకుంది.



తారలు... ప్రకటనలతో చిక్కులు

మన దేశంలో సినీ నటీ నటులకు ఉన్న క్రేజ్ మరెవ్వరికీ ఉండదు. అందుకే వారి ద్వారా వినియోగదారులను ఆకర్షించటానికి అనేక కంపెనీలు పోటీ పడుతూ ఉంటాయి. సబ్బుల దగ్గర నుంచి రియల్ ఎస్టేట్ దాకా క్రిప్టో కరెన్సీ దగ్గర నుంచి ఆన్‌లైన్ గేమింగ్ దాకా అనేక కంపెనీల ప్రకటనలలో మనకు సినీ నటీ నటులు కనిపిస్తూ ఉంటారు. ఈ మధ్య కాలంలో ఆన్‌లైన్ ప్రకటనలు బాగా విస్తరించిన తర్వాత గేమింగ్ యాప్‌లకు.. క్రిప్టో కరెన్సీ స్కీమ్‌ల ప్రకటనలలో కూడా హీరో హీరోయిన్లు కనిపించటం మొదలుపెట్టారు. ఎప్పుడైనా ఈ స్కీమ్‌లు స్కామ్‌లుగా మారితే వారు ఇబ్బందుల్లో పడుతున్నారు.

తాజాగా తమిళనాడు, పుదుచ్చేరిలలో బయట పడిన క్రిప్టో కరెన్సీ స్కామ్‌లో హీరోయిన్లు కాజల్, తమన్నాలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ నోటీసులు ఇవ్వటంతో ఈ అంశంపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది.

కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి భారీగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. రేడియోలు, టీవీలు, ఆన్‌లైన్‌లో రకరకాల ప్రకటనలు ప్రసారం చేస్తూ వినియోగదారులను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తుంటాయి. స్టార్ హీరోలు, హీరోయిన్లు, పేరున్న క్యారెక్టర్ ఆర్టిస్టులు, క్రీడాకరులు, ఇతర సెలబ్రిటీలతో వాణిజ్య ప్రకటనలు రూపొందించి ప్రచారం చేస్తుంటాయి. వీటి ద్వారా వచ్చే ఆదాయం కూడా ఎక్కువే! ఉదాహరణకు తెలుగులో టాప్ హీరోలకు ఒక ప్రకటనలో నటిస్తే- రెండు నుంచి మూడు కోట్ల రూపాయల ఆదాయం లభిస్తుంది. ఏడాది మొత్తం ఆ కంపెనీ వీరి ఫోటోలను, వీడియోలను తమ ప్రకటనలలో వాడుకుంటుంది. దీని వల్ల కంపెనీకి పట్ల వినియోగదారులు ఆకర్షితులవుతారు. అదే సమయంలో హీరో, హీరోయిన్లు టెలివిజన్‌లోను, ఆన్‌లైన్‌లోను ప్రేక్షకులకు కనిపిస్తూ ఉంటారు. దీని వల్ల వారి సినిమాలు విడుదల కావటానికి సమయం పట్టినా ప్రేక్షకులు వారిని మర్చిపోరు. అయితే ఎలాంటి ప్రకటనలలో నటీ నటులు నటించాలి? వారికి సామాజిక బాధ్యత ఉండదా? సమాజానికి కీడు చేసే ప్రకటనలలో ఎందుకు నటించాలి? అనే ప్రశ్నలు ఈ మధ్యకాలంలో ఎక్కువగా ఉత్పన్నమవుతున్నాయి. తాజాగా కోటా (రాజస్థాన్) జిల్లా వినియోగదారుల కోర్టు బాలీవుడ్ నటులు షారుఖ్ ఖాన్, అజయ్ దేవ్‌గన్, టైగర్ ష్రాఫ్‌లు 'విమల్' పాన్ మసాల' ప్రకటనలలో నటించినందుకు వారికి సమన్లు జారీ చేసింది.

అభిమానులను దృష్టిలో...

మన దేశంలో హీరో, హీరోయిన్లను కోట్ల మంది ఆరాధిస్తూ ఉంటారు. వారిని అభిమానిస్తూ ఉంటారు. నిరంతరం వారిని ఫాలో అవుతూ ఉంటారు. వారు చెప్పిన ప్రతి మాట నిజమని నమ్ముతూ ఉంటారు. అందువల్ల హీరోహీరోయిన్లు తాము చేసే ప్రతి పనిని అభిమానులు గమనిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. వారి అభిమతానికి.. వారికి హాని చేసే కార్యకలాపాలలో పాల్గొకూడదని నిర్ణయించుకోవాలి. అప్పుడే వారికి ఉన్న విశ్వసనీయత పెరుగుతుంది.

చిక్కులు తప్పవు...

మన దేశంలో మద్యం, సిగరెట్టు ప్రకటనలపై నిషేధం ఉంది. కానీ రియల్ ఎస్టేట్, బెట్టింగ్ యాప్‌లు, క్రిప్టో కరెన్సీ ప్రకటనలపై నిషేధం లేదు. ఇంటర్నెట్ ప్రతి ఇంటికి వ్యాపించిన తర్వాత.. ప్రతి వ్యక్తి చేతిలో స్మార్ట్ ఫోన్ సామాన్యమయిపోయిన తర్వాత ఈ తరహా ప్రకటనలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. స్మార్ట్‌ఫోన్లలో వీటిని చూసే వారి సంఖ్య పెరిగింది. దీనితో ఈ కంపెనీలు సెలబ్రిటీలకు ఎక్కువ సొమ్ము చెల్లించి ప్రకటనలలో నటించమని కోరుతున్నారు. కొందరు నటీనటులు తెలిసో.. తెలియకో.. ఈ ప్రకటనల వలలో చిక్కుకుంటున్నారు.

గత ఏడాది దేశాన్ని కుదిపేసిన మహదేవ్ బెట్టింగ్ యాప్‌లో అనేక మంది సెలబ్రిటీలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ప్రశ్నించింది. రణబీర్‌కపూర్, శ్రద్ధకపూర్, తమన్నా మొదలైన వారు కూడా ఈ సెలబ్రిటీలలో ఉన్నారు. అయితే ఈ విషయంలో చట్టాలు కూడా సమగ్రంగా లేవు. "ఒక ఉత్పత్తికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఒక హీరో ఉన్నాడనుకుందాం. ఆ ఉత్పత్తి వల్ల వినియోగదారులకు ఏదైనా నష్టం జరిగితే చట్టపరంగా ఆ హీరోకి ఎటువంటి సంబధం ఉండదు. ఈ విషయం అన్ని అగ్రిమెంట్‌లలో స్పష్టంగా పేర్కొంటారు. కానీ కంపెనీ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరిపినప్పుడు.. హీరోకి ఇచ్చిన సొమ్ము ఎక్కడి నుంచి వచ్చిందనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అప్పుడు ఈడీ అధికారులు ఆయనను ప్రశ్నిస్తారు. ఇక ఒక ప్రకటనలో నటించాలా వద్దా అనే అంశం ఆ హీరోకి ఉన్న నైతికతపై ఆధారపడి ఉంటుంది" అంటారు ఈ తరహా వ్యవహారాలను చూసే న్యాయవాది కావ్య. ఈ మధ్య కాలంలో కుర్ర హీరోలు తమ ఇమేజ్‌ను దెబ్బతీసే ఈ తరహా చర్యలకు పాల్పడటం లేదు. "ఎందుకంటే- ఒక ప్రకటన వచ్చిన వెంటనే లక్షల మందికి చేరిపోతుంది. వెంటనే ఇంటర్నెట్‌లో దానిపై చర్చ మొదలవుతుంది. ఎవరైనా నైతికంగా తప్పు పనిచేస్తే ఈ మధ్యకాలంలో నెటిజెన్స్ ఊరుకోవటం లేదు. వీరి ఒత్తిడి విపరీతంగా ఉంటోంది. దీనితో ఎక్కువ మంది ఒకటికి రెండు సార్లు జాగ్రత్తగా చూసుకొని కాని ప్రకటనలలో నటించటం లేదు" అంటారు ఒక ప్రొడక్షన్ హౌస్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న సంతోష్. బాలీవుడ్ హీరోలు అనిల్ కపూర్, కార్తీక్ ఆర్యన్, జాన్ అబ్రహం.. శాండిల్‌వుడ్‌కు చెందిన యష్.. టాలీవుడ్‌లో అల్లు అర్జున్ వంటి వారు... పొగాకు ఉత్పత్తుల ప్రకటనలలో నటించబోమని ఖరాఖండిగా చెప్పేశారు.

సాధారణంగా సినిమాలకు కొన్ని కమర్షియల్ ఫార్ములాలు ఉంటాయి. దర్శకులందరూ ఈ ఫార్ములాలనే నమ్ముకొని సినిమాలు తీస్తూ ఉంటారు. ఈ ఫార్ములాలకు భిన్నంగా... ఎవరూ ఊహించని రీతిలో సినిమాలు తీసిన దర్శకులు అతి కొద్దిమంది మాత్రమే ఉంటారు. అలాంటి వారిలో హాలీవుడ్ దర్శకుడు హిచ్‌కాక్ ఒకరు. సస్పెన్స్ సినిమాలకు ఆద్యుడుగా భావించే హిచ్‌కాక్‌ను ఇప్పటికీ ఎంతోమంది దర్శకులు అనుకరిస్తూ ఉంటారు. సైకో... రెయిర్ విండో... ఇలా మొత్తం 53 సినిమాలు తీసిన హిచ్‌కాక్ 125 జయంతి సందర్భంగా తెలుగులో పులగం చిన్నారాయణ, రవి పాడి రాసిన 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' అనే పుస్తకం విడుదలయింది. 45 మంది దర్శకులు, ఏడుగురు రచయితలు, పదిమంది జర్నలిస్టులు హిచ్‌కాక్ గురించి రాసిన వ్యాసాల సమాహారమిది. దీనిలోని ఆసక్తికరమైన ఒక భాగం 'నవ్య' పాఠకుల కోసం.

మార్మికతే హిచ్‌కాక్ శైలి



హిచ్‌కాక్‌ని అందరూ పొగుడుతారు కానీ... ఆయన సినిమాల్లో మహిళలను చూపించే తీరు, చిత్రీకరణలపై చాలా విమర్శలు ఉన్నాయి. దీన్ని సరిగ్గా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. కథ చెప్పే తీరులో ప్రతి దర్శకుడికి లేదా దర్శకురాలికి ఒక బాణీ ఉంటుంది. పాత్రలు, వాళ్ల భావాలు, అంతర్మథనం మీద కొంత మంది దృష్టి పెడితే... మరికొందరు శిల్పం మీద పెడతారు. ఏం చెప్పాలి అనేది ఒక ముఖ్య విషయం అయితే... అదే విషయాన్ని ఎలా చెప్పాలి అనే దగ్గర కచ్చితమైన శిల్పం లేకపోతే వ్యవహారం నడవదు. ఆత్మకీ, ఆకారానికీ ఉన్న సంబంధం లాంటిదన్న మాట! సినిమా కళలో శిల్పం గురించి మాట్లాడాలంటే చాలా ఉంది. ఇక్కడ హిచ్‌కాక్ వరకే పరిమితమవుతూ... శిల్పాన్ని ఉపయోగిస్తూ ఆయన స్త్రీ పాత్రల చిత్రీకరణలో, కొన్ని ఆలోచనల పరిధుల్లో, మూస భావజాలంలో ఎలా సినిమా కథలు అల్లారో... దానివల్ల కథా వస్తువులో స్త్రీ పాత్రలు ఎంత పరిమితంగా ఉంటాయో అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం! ఇందులో భాగంగా సినిమా క్రాఫ్ట్, మనో విశ్లేషణ, హిచ్‌కాక్ శైలి-ఆలోచనా పటిమ-సృజనాత్మకతతో పాటు స్త్రీపాత్రలు-వాటి ఉద్రేక ఉద్విగ్న క్షణాలను కథాపరంగా ఎలా అర్థం చేసుకోవాలో విశదీకరించే ప్రయత్నం చేస్తాను. ఇందుకోసం రెబెక్కా, బర్డ్స్, వర్టిగో చిత్రాల విశ్లేషణ పనికివస్తుంది.

మనోవిశ్లేషణ... సినిమాలు

పురుషులకు స్త్రీలంటే కొన్ని విషయాల్లో ఎంత మోజు ఉంటుందో వాళ్లంటే అంతే అసహ్యం, ద్వేషం, కోపం ఉంటాయనేది శాస్త్రీయంగా, చారిత్రకంగా నిరూపితమైంది. ఇలాంటి స్త్రీ ద్వేషాన్ని, ఏహ్యాభావాన్ని 'మిసోజిని'గా పేర్కొంటారు. ఇది గిరి గీసినట్టుగా ఒకే విధంగా ఒకే రూపంలో ప్రకటితం కాదు. పురుషులకు... వాళ్లు అలా ఉంటారనేది తెలిసినా తెలియకపోయినా దాన్నుంచి తప్పించుకోలేరన్నది వాస్తవం. మిసోజినికి మూల కారణం... అధికారం చెలాయించే హక్కు, మంచి-చెడు నిర్ణయించే విషయంలో తేడా వస్తే పురుషులకు వచ్చే అక్కసు, ద్వేషం, చెప్పలేని అసహనంలోంచి పుట్టుకొచ్చే ఒక జబ్బు.



ఇది స్త్రీలలో ఉండదా? అంటే తప్పకుండా ఉండవచ్చు. కానీ ఈ అసహనం అనేది వ్యవస్థాగత రూపంలో ఆడవాళ్ల ప్రవర్తనని, వ్యక్తిత్వాన్ని నియంత్రించే విధంగా ఉంటాయి. స్త్రీలు కూడా ఇందులో తమకు తామే పార్టిసిపేట్ చేసేలా సంస్కృతి, సంప్రదాయాలు దోహదం చేస్తాయి. పురుషులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దీనికి ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. దానికి చాలా కారణాలు ఉన్నాయి. వీటిలో ముఖ్యమైంది మాత్రం స్త్రీ లైంగికత్వం. స్త్రీ అంటే ఆమె ఒళ్లు, పెళ్లి, కడుపు... వీటిని నియంత్రించే అనేక సాధనాలు సమాజంలో కుటుంబ వ్యవస్థ, నీతి నియమాల రూపంలో ఉన్నాయి. స్త్రీలు పద్ధతిగా ఉండకపోతే సమాజం నాశనం అయిపోవచ్చు అనే ప్రాతిపదిక నుంచి భయం, స్త్రీ ద్వేషం, ఎగతాళి, అసహనం కనిపిస్తూ ఉంటాయి. ఈ భావాలను పురుషులే ఎప్పుడూ ప్రదర్శిస్తారని కాదు ఇక్కడి ఉద్దేశం! సమాజంలో అనేక ఆలోచనలు, వ్యవహారాలు, ఉద్దేశాల వెనక ఈ లెక్కలు ఉన్నాయని చెప్పడమే. శక్తియుక్తుల గురించి నిత్యజీవితంలో వేసే అంచనాలు... స్త్రీలను ఉత్తేజపరిచేవి తక్కువగా, కించపరిచేవి ఎక్కువగా ఉంటాయి. వాళ్ల పోరాటాలు, వాదనలు ఒక్కోసారి వాళ్లను న్యూరాటిక్ మనుషుల్లా, వెర్రివాళ్లలా, మూర్ఖుల్లా, తెలివిలేని వాళ్లలా చూపుతాయి.

హిచ్‌కాక్ కథల్లో ఇలాంటి విషయాలు ఉంటాయి. లేత చిగురుటాకులా వణికిపోయే కొత్త పెళ్లికూతురు, భర్త అనునయ వాక్యాల కోసం ఎదురు చూడడం, దాని బదులు ఎదురు విమర్శలు ఎదుర్కోవడం... మనకి రెబెక్కా సినిమాలో కనిపిస్తుంది. భర్తకు చెందిన ఎస్టేట్ అంతటినీ చూసుకునే మిస్సెస్ డాన్వర్స్, మొదటి భార్య రెబెక్కాకు దగ్గర వ్యక్తి. చనిపోయిన రెబెక్కా గురించి పదేపదే గుర్తుచేసి పిచ్చెక్కించే స్థాయికి తీసుకువెళుతుంది. మిస్సెస్ డాన్వర్స్ ఎంతో తెలివిగా ఈ కొత్త పెళ్లికూతురు ఆత్మహత్యకు ప్రయత్నించేదాకా ప్రేరేపిస్తుంది. అదృష్టంకొద్దీ అది త్రుటిలో తప్పిపోతుంది. భర్త ఒప్పుకోలుగా తనే రెబెక్కా చావుకి కారణమని చెప్పడం, అది పూర్తిగా నిజం కాదని హిచ్‌కాక్ మనకి తెలియజేయడం, భార్య భర్తలు తగలబడుతున్న ఎస్టేట్‌లో మిసెస్ డాన్వర్స్ కూడా తగలబడుతూ చూస్తుండడంతో తిరిగి కలవడం... కథ సుఖాంతం అవుతుంది.

ఇందులో ఈ పెళ్లికూతురు స్వతంత్రంగా ఉండాలనుకునే ఏ ప్రయత్నమూ ఫలించదు. ఆమె ఎలా ఉండాలో, ఆమెలోని అమాయకత్వం, మంచితనం ఎంతవరకూ ఉండాలో అతను నియంత్రిస్తూ ఉంటాడు. అతని ప్రేమ పొందడం ఆమెకి అవసరం. ఆమెని పొందడం అతనిక్కూడా అవసరం. అయితే ఇద్దరి హేతువులు భిన్నమైనవి. హిచ్‌కాక్ భావజాలంలో స్త్రీలు అందంగా కనిపించేందుకు భీతావహులు అవుతూ వెర్రి ధైర్యం ప్రదర్శిస్తారు. ఎదురు దెబ్బలు తింటారు. రక్షింపబడతారు... కథ ముగుస్తుంది. రెబెక్కా కథ ఒక విధమైన గాతిక్ రొమాన్స్‌కి నిదర్శనం.

సినిమాని కళ అని ఎందుకు అనాలి?

సినిమా బహుధా విచిత్రమైన కళ. భలే తమాషాగా చూపిస్తుంది ప్రపంచాన్ని. కనిపించని విషయాల్ని తేల్చి చెపుతూ కంటికి గారడీ చేస్తుంది. మనసుకి మంచి పని పెడుతుంది. ఇదంతా ఎలా సాధ్యం?

ప్రతి ఫిల్మ్ ఫ్రేమ్ ఒక చిన్న ప్రపంచం. దీన్ని నింపడంలో డైరెక్టర్... ఇతర టెక్నీషియన్ల సహాయంతో అనేక పద్ధతులు అవలంబిస్తారు. ఒక ఫ్రేమ్‌లో అన్నీ అరేంజ్ చేయడమంటే... ఏ వస్తువు కనిపించాలి, ఎవరు ప్రధానంగా కనపడాలి, ఎవరిమీద ఎక్కువ వెలుగు పడాలి అనేవాటిని ముఖ్యంగా చూసుకోవాలి. ప్రతి షాట్ రెండోదానితో ముడిపడి ఉంటుంది. కాబట్టి దేనికి దాన్ని విడిగా ఆలోచిస్తే సరిపోదు. విడివిడిగా షాట్ తీసే క్రమంలో ప్రతి అంశాన్ని ఒడుపుగా నిక్షిప్తం చేయాలి. అందుకే ఇక్కడ కొలాబరేషన్ అనే మాటను ముఖ్యంగా వాడాలి. ఎందుకంటే దర్శకుడు/దర్శకురాలు ఒక్కరే ఏమీ చేయలేరు. కానీ తన ఆలోచనకి రూపం ఇచ్చే క్రమంలో స్పష్టంగా పాయింట్ ఆఫ్ వ్యూ గురించి ఇమేజ్ గురించి ఆలోచించుకుని దాన్ని టెక్నీషియన్ల సహాయంతో తెరకెక్కించే ప్రయత్నం చేయాలి. ఇక్కడ పాయింట్ ఆఫ్ వ్యూ అనేది చాలా ముఖ్యం. ఎవరి దృక్కోణంలో కథ ముందుకు నడవాలి అనే నిర్ణయం దర్శకుడిది. ఇక్కడ హిచ్‌కాక్ తలపండినవాడు

దృక్కోణం మార్మికతతోనే చిత్రకథ రక్తికట్టిస్తుంది. దీనికి లైటింగ్ రక్తికట్టిస్తుంది. ఏది కనిపించేలా లైట్ చేశాము అనే కాదు, ఏది కనిపించకుండా లైట్ చేశాము అనే దానిలో ఉంటుంది కళ. అలాగే క్లోజప్ కూడా సహకరిస్తుంది. ఫ్రేమ్‌లో ఎడమ వైపు భాగం చాలా ముఖ్యం. దాని యాంగిల్ ద్వారా... ఒక నీడ, ఒక వెలుగు రేఖ, ఒక బ్రైట్ లైట్ లాంటి వాటి సహాయంతో ప్రేక్షకులకి ఎటు చూడాలో, ఏమి అనుమానించాలో సిగ్నల్ ఇవ్వవచ్చు. ఇవికాక, కలర్ ఫిల్టర్స్ స్పెషల్ ఎఫెక్ట్స్ మొదలైనవాటి ఆధారంగా కథాంశాలను థ్రిల్లింగ్‌గా విశదీకరించవచ్చు. ముఖ్యంగా భయం, భీతి, ప్రమాదం లాంటి వాటిని.

• ఇంద్రగంటి కిరణ్మయి

ఇలా చేస్తే నల్లని వలయాలు మాయం

అలసట, ఒత్తిడి, నిద్రలేమి లాంటి కారణాలవల్ల కళ్ల కింద నల్లని వలయాలు ఏర్పడుతూ ఉంటాయి. మంచి పోషకాహారం తీసుకోవడంతోపాటు కొన్ని చిట్కాలు పాటించి వీటిని పోగొట్టుకోవచ్చు.

- ఒక ఐస్ ముక్కను తీసుకుని పలుచని రుమాలులో చుట్టి దాంతో కళ్లకింద మెల్లగా రుద్దాలి. ప్రతిరోజూ రాత్రి పడుకునేముందు ఇలా చేస్తూ ఉంటే కళ్ల అలసట తగ్గి క్రమంగా నల్లని వలయాలు మాయమవుతాయి.
- కీరా దోసకాయ లేదా బంగాళదుంపను చక్రాల్లా కోసి వాటిని కళ్ల మీద పెట్టుకుని అర గంట విశ్రాంతి తీసుకోవాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే కళ్ల కింద రక్త ప్రసరణ మెరుగుపడి నలుపుదనం తగ్గుతుంది.
- ఎర్రని టమాటాను శుభ్రంగా కడిగి మధ్యకు కోసి గట్టిగా పిండితే రసం వస్తుంది. ఇందులో దూదిని ముంచి దాంతో కళ్ల చుట్టూ సున్నితంగా అద్దాలి. పది నిమిషాల తరవాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. టమాటాను చక్రాలుగా తరిగి వాటిని కళ్లమీద పెట్టుకున్నా మంచి ఫలితం కనిపిస్తుంది.



- ఒక గిన్నెలో ఒక చెంచా బాదం నూనె, ఒక చెంచా ఇ విటమిన్ నూనె వేసి బాగా కలపాలి. రాత్రి పడుకునేముందు ఈ మిశ్రమంతో కళ్ల చుట్టూ మర్దన చేయాలి. ఉదయాన్నే గోరు వెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే వారం రోజుల్లో మంచి ఫలితం కనిపిస్తుంది.
- వాడేసిన టీ బ్యాగ్‌లను ఫ్రిజ్‌లో పెట్టాలి. ఇవి చల్లగా అయ్యాక వాటిని కళ్ల మీద పెట్టుకుని పది నిమిషాలు ఉంచుకోవాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే కళ్ల కింద నలుపు తగ్గిపోతుంది.
- రెండు చెంచాల కొబ్బరి నూనెలో ఒక చెంచా కలబంద గుజ్జు కలిపి ఈ మిశ్రమాన్ని కళ్ల చుట్టూ పరచాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. మూడు రోజులపాటు ఇలా చేస్తే కళ్ల కింద నల్లని వలయాలు తగ్గిపోతాయి.

ఔషధాల నిధి... జామ



రోజుకి ఒక జామ కాయ తింటే అనారోగ్యం దరిచేరదని నిపుణులు చెబుతున్నారు. అందరికీ అందుబాటులో ఉండే జామకాయలు తినడంవల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

- జామకాయలో పీచు పదార్థం అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియ సజావుగా జరిగేందుకు తోడ్పడుతుంది. మలబద్ధకం రాకుండా చేస్తుంది.
- మధుమేహం ఉన్నవారు... రోజుకి ఒక జామ కాయ తింటే రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది.
- జామకాయలో బీ6, నియాసిన్ విటమిన్లు ఉంటాయి. ఇవి మెదడుకి రక్తప్రసరణను పెంచుతాయి. ప్రతిరోజూ జామకాయలు తినడం వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది.
- తరచూ జామకాయలు తినడం వల్ల శరీరానికి కావాల్సిన యాంటీ ఆక్సిడెంట్లు లభిస్తాయి. దీంతో శరీరంలో వాతం, వాపులు, కీళ్ల నొప్పులు తగ్గుతాయి. జామలోని ఎ విటమిన్... కంటి చూపుని మెరుగుపరుస్తుంది.
- అల్పాహారంలో జామకాయను చేర్చుకుంటే గుండె జబ్బులు రావు. దీనిలోని పొటాషియం రక్తపోటుని అదుపులో ఉంచుతుంది. చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది.
- జామకాయను తరచూ తింటూ ఉంటే చర్మం తేమతో నిండి ఆరోగ్యంగా కనిపిస్తుంది. దీనిలోని సి విటమిన్ చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో ముఖం మీద మొటిమలు, గుల్లలు, ముడతలు రాకుండా ఉంటాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- సాయంత్రం వేళ జామకాయ ముక్కలు తింటే అలసట తీరుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. జామలోని మెగ్నీషియం ప్రభావవంతంగా పనిచేసి రాత్రిపూట నిద్ర బాగా పట్టేలా చేస్తుంది. మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది.



జీఎస్‌టీ వసూళ్లు రూ.1.84 లక్షల కోట్లు

- ఫిబ్రవరిలో 9 శాతం వృద్ధి నమోదు
- ఏపీ ఆదాయం రూ.3,817 కోట్లు
- తెలంగాణలో రూ.5,280 కోట్లు

న్యూఢిల్లీ: ఈ ఏడాది ఫిబ్రవరిలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు రూ.1.84 లక్షల కోట్లకు పెరిగాయి. గత ఏడాది ఇదే నెలకు నమోదైన రూ.1.68 లక్షల కోట్ల వసూళ్లతో పోలిస్తే 9.1 శాతం అధికం. గత నెలలో రూ.20,889 కోట్ల పన్ను రిఫండ్స్ జారీ చేయడం జరిగింది. దాంతో నికర జీఎస్‌టీ ఆదాయం రూ.1.63 లక్షల కోట్లుగా నమోదైంది. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, గత నెలలో ఆంధ్రప్రదేశ్ జీఎస్‌టీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 4 శాతం వృద్ధి చెంది రూ.3,817 కోట్లకు చేరగా.. తెలంగాణలో ఒక శాతం వృద్ధితో రూ.5,280 కోట్లుగా నమోదైంది. కేంద్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. గత నెలలో సెంట్రల్ జీఎస్‌టీ రూ.35,204 కోట్లు, స్టేట్ జీఎస్‌టీ రూ.43,704 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.90,870 కోట్లుగా నమోదైంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

2వ తేదీ			
హైదరాబాద్	445	విజయవాడ	485
వరంగల్	447	గోదావరి	480
చిత్తూరు	493	విశాఖపట్నం	482
		డజను గుడ్లు రూ. 66	

'సిప్' కొనసాగించాలా.. వద్దా?



స్టాక్ మార్కెట్ ప్రస్తుతం 'బేర్' పట్టులో ఉంది. దాదాపు ఈ ఏడాది ప్రారంభం నుంచే నష్టాల్లో కొనసాగుతూ వస్తోంది. ఈ డౌన్‌ట్రెండ్ ఇంకా ఎంత కాలమో ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు. ఫిబ్రవరి నెలలో సెన్సెక్స్ 5.5 శాతానికి పైగా నష్టపోయింది. బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా రూ.40 లక్షల కోట్లకు పైగా ఆవిరైపోయింది. స్మాల్ అండ్ మిడ్ క్యాప్ కంపెనీల షేర్లలో ఈ పతనం మరింత ఎక్కువగా ఉంది. మరి ఇలాంటప్పుడు స్మాల్ అండ్ మిడ్ క్యాప్ విభాగంలో మదుపు చేసే మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) నిర్వహించే క్రమానుగత పెట్టుబడి పథకాల్లో (సిప్) కొనసాగాలా? వద్దా? అనే ప్రశ్న మదుపరుల్లో తలెత్తుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మదుపరులు అనుసరించాల్సిన వ్యూహం ఏమిటో ఓసారి పరిశీలిద్దాం.

పెట్టుబడులు ఆపొద్దు

ప్రస్తుత మార్కెట్ పతనాన్ని చూసి సిప్ ఆపటం ఏ మాత్రం మంచిది కాదు. నెలనెలా అందే సిప్ మొత్తాలను ఫండ్ మేనేజర్లు ఎప్పటికప్పుడు తమదైన పెట్టుబడి వ్యూహంతో మంచి కంపెనీల షేర్లలో మదుపు చేస్తుంటారు. మార్కెట్ ఆటుపోట్లకు లోనైంత మాత్రాన ఈ ఫండ్స్ దీర్ఘకాలిక రాబడులు దెబ్బతింటాయని భావించలేం. కాకపోతే ఇది ఒక కుదుపు మాత్రమే. దీర్ఘకాలిక పొదుపు, సంపద సృష్టికి స్మాల్ అండ్ మిడ్ క్యాప్ కంపెనీల షేర్లలో మదుపు చేసే ఎంఎఫ్‌ల 'సిప్' చక్కటి పెట్టుబడి సాధనమనే విషయం మర్చిపోవద్దు. కాకపోతే ఫండ్ పనితీరుతో పాటు ఫండ్ మేనేజర్ ట్రాక్ రికార్డునీ ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి.

దీర్ఘకాలిక పెట్టుబడి

లార్జ్ క్యాప్ షేర్లతో పోలిస్తే చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్లలో రాబడులు ఎక్కువ. కాకపోతే ఇందుకు ఓర్పు కూడా అవసరం. మిడ్ అండ్ స్మాల్ క్యాప్ ఫండ్స్‌కూ ఇది వర్తిస్తుంది. కనీసం పదేళ్లపాటైనా ఈ ఫండ్స్‌లో 'సిప్' పెట్టుబడులు కొనసాగిస్తే, పెద్దగా నష్ట భయం లేకుండా బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే ఎక్కువ రాబడులు పొందవచ్చు.

లిక్విడిటీ

ఏ పెట్టుబడి అయినా అవసరమైనప్పుడు వెంటనే అమ్ముకుని నగదు చేసుకునే సౌలభ్యం ఉండాలి. స్మాల్ అండ్ మిడ్ క్యాప్ కంపెనీల షేర్లలో మదుపు చేసే ఈక్విటీ పథకాలకూ ఇది వర్తిస్తుంది. సాధారణంగా ఫండ్ మేనేజర్లు తమ మొత్తం పెట్టుబడుల్లో కనీసం 15 నుంచి 20 శాతం నిధులను నగదు రూపంలో ఉంచుకుంటారు. ఎప్పుడు ఏ రిడెంప్షన్ ఒత్తిడి వచ్చినా తట్టుకునేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయి. మార్కెట్ దిద్దుబాటులో ఉన్నప్పుడు ఇది మరింత అవసరం.

ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని మదుపరులు ప్రస్తుతం మార్కెట్ పతనంలోనూ చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్లలో మదుపు చేసే ఈక్విటీ పథకాల్లో సిప్ పెట్టుబడులు కొనసాగించడమే మంచిది.

గృహ రుణాల వడ్డీ రేట్లు తగ్గాయ్..

రుణగ్రహీతల ముందున్న ఆప్షన్స్ ఏమిటంటే..



గత నెల 7న జరిగిన ద్రవ్య పరపతి విధాన సమీక్షలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక రెపో వడ్డీ రేటు తగ్గించింది. అప్పటి వరకు 6.5 శాతంగా ఉన్న ఈ వడ్డీ రేటును 6.25 శాతానికి కుదించారు. దీంతో అనేక బ్యాంకులు తమ రెపో ఆధారిత గృహ రుణాల వడ్డీ రేట్లనూ పావు శాతం వరకు కుదించాయి. ఈ తగ్గింపుతో చాలా మంది రుణ గ్రహీతలు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు. అయితే చాలా మంది ప్రస్తుతం ఒక సందిగ్ధంలో ఉన్నారు. తగ్గిన వడ్డీ రేట్లకు అనుగుణంగా ఈఎంఐల మొత్తం తగ్గించుకోవాలా? లేక అదే ఈఎంఐలు చెల్లిస్తే రుణ చెల్లింపు కాలపరిమితి తగ్గించుకోవాలా? అనే సందేహంలో ఉన్నారు. పెద్దగా ఆర్థిక ఇబ్బందులు లేని గృహ రుణ గ్రహీతలు అదే ఈఎంఐలతో రుణ చెల్లింపు గడువు తగ్గించుకోవడమే మంచిదని నిపుణుల సూచన. గత నెల 26వ తేదీ నాటికి వివిధ బ్యాంకులు రూ.75 లక్షలకు మించిన రెపో ఆధారిత గృహ రుణాలపై వసూలు చేస్తున్న వడ్డీ రేట్లు ఇలా ఉన్నాయి. ఆ వివరాలు మీ కోసం..

ప్రభుత్వ రంగ బ్యాంకులు	వడ్డీ రేటు (%)
ఎస్‌బీఐ	8.25-9.40
బీఓబీ	8.40-10.65
యూబీఐ	8.10-10.65
పీఎన్‌బీ	8.15-9.90
బ్యాంక్ ఆఫ్ ఇండియా	8.30-10.85
కెనరా బ్యాంక్	8.15-10.90
యూకో బ్యాంక్	8.30 నుంచి
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	8.10-10.90
పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్	8.35-9.85
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	8.15-10.75
ఇండియన్ బ్యాంక్	8.15-9.55
ప్రైవేట్ బ్యాంకులు	
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	8.7 నుంచి
ఐసీఐసీఐ బ్యాంక్	8.75 నుంచి
యాక్సిస్ బ్యాంక్	8.75-9.65
కోటక్ మహీంద్రా బ్యాంక్	8.75 నుంచి
హెచ్ఎస్‌బీసీ బ్యాంక్	8.5 నుంచి
సౌత్ ఇండియన్ బ్యాంక్	8.5 నుంచి
కరూర్ వైశ్యా బ్యాంక్	8.79-9.44
ఫెడరల్ బ్యాంక్	8.55 నుంచి
ధనలక్ష్మి బ్యాంక్	8.75 నుంచి
టీఎంబీ	8.60-9.95
బంధన్ బ్యాంక్	9.16-13.33
ఆర్‌బీఎల్ బ్యాంక్	9 నుంచి
సీఎస్‌బీ బ్యాంక్	10.24-12.09
సిటీ యూనియన్ బ్యాంక్	10.15-14.05

వాయిదాల పద్ధతిలో వస్తువులు కొనుగోలు చేస్తుంటే?


ఇదీ GST
రాంబాబు గొండాల

ఇటీవలి కాలంలో రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్, ఏసీ వంటి గృహోపకరణాలతో పాటు కారు, మోటార్ సైకిల్ వంటి వాహనాల కొనుగోళ్లు ఎక్కువయ్యాయి. ఒకప్పుడు లగ్జరీగా భావించే అనేక వస్తువులు నేడు నిత్యావసరాలుగా మారాయి. మారుతున్న కాలంతో పాటు ప్రజల జీవనశైలి, అభిరుచులు కూడా మారాయి. కొనుగోలు శక్తి పెరిగింది. అన్నిటికి మించి ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే సులభ వాయిదా పద్ధతులు ఇప్పుడు వ్యాపారస్తులతో పాటు ప్రైవేట్ ఉద్యోగులకు అందుబాటులోకి వచ్చాయి.

మరోవైపు రోజురోజుకు టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోంది. దీంతో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ వంటి వాటిని రెండు మూడేళ్లలోనే మార్చివేసి సాంకేతికతకు అనుగుణంగా ఉన్న కొత్త వాటిని కొనేందుకు యువత ఆసక్తి చూపుతోంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఎలక్ట్రానిక్ షోరూమ్స్, షాపింగ్ మాల్స్ సులభ వాయిదా పద్ధతిలో ఆయా వస్తువులను అందించటానికి ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నాయి. కొన్ని దుకాణాలు తామే స్వయంగా ఫైనాన్స్ సదుపాయాలు అందిస్తుండగా మరికొన్ని దుకాణాలు బయటి సంస్థల నుంచి ఫైనాన్స్ అందించే ఏర్పాట్లు చేస్తున్నాయి. కొనుగోలుదారుడు కొన్న వస్తువును బట్టి, అతని ఆదాయాన్ని బట్టి ఆయా వస్తువులు రుణం ద్వారా తీసుకునే అవకాశాలు కల్పిస్తున్నాయి. అలాగే నెలవారీ వాయిదా (ఈఎంఐ) ఎంత చెల్లించాలి అనేది నిర్ణయిస్తారు. ప్రతి నెల గడువు లోపు ఆయా వాయిదాలను చెల్లించాల్సి ఉంటుంది. ఏదైనా కారణంతో చెల్లింపుల్లో జాప్యం జరిగితే పెనాల్టీ కింద కొంత మొత్తం వసూలు చేయటం జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో అదనపు వడ్డీ కూడా చెల్లించాల్సి ఉంటుంది. మరి ఇలాంటి సందర్భాల్లో అదనంగా వసూలు చేసే మొత్తం మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందా? దీనికి సంబంధించిన విధివిధానాలు కింద ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.

సృజన్ అనే ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.. ఐఫోన్ మొబైల్‌ను రూ.లక్ష వెచ్చించి ఒక ఎలక్ట్రానిక్ షోరూమ్‌లో కొనుగోలు చేశాడనుకుందాం. దీని కోసం అతడు ఈఎంఐ సదుపాయాన్ని వాడుకున్నాడు. దీని ప్రకారం ప్రతి నెల 5వ తేదీ నెలవారీ వాయిదా చెల్లించాలి. ఈ విధంగా నెలకు రూ.9,000 చొప్పున 12 నెలలు అంటే ఏడాది పాటు చెల్లించాలి. అంటే రూ.లక్షకు గాను రూ.1,08,000 చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ నిర్ణీత గడువు లోపులో నెలవారీ వాయిదా కట్టలేకపోతే పెనాల్టీ కింద నెలకు రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ఇలా పెనాల్టీ కింద వసూలు చేసిన మొత్తంపైన జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందా అని.

పెనాల్టీ కింద వసూలు చేసిన మొత్తం పైన జీఎస్‌టీ వర్తిస్తుందా లేదా అనేది రుణ సదుపాయం ఎవరు కల్పించారనే విషయంపై ఆధారపడి ఉంటుంది. అంటే దుకాణాదారుడే ఆయా వస్తువులను కొనుగోలు చేయటానికి స్వయంగా రుణం ఇచ్చి నెలనెలా తనే వాయిదాలను స్వీకరిస్తుంటే.. అలాంటి సందర్భాల్లో వసూలు చేసే పెనాల్టీ లేదా అదనపు వడ్డీల మీద కచ్చితంగా జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. అలాకాకుండా పైన చెప్పిన విధంగా మాల్స్ లేదా పెద్ద షోరూమ్‌ల యజమానులు తమ కొనుగోలుదారులకు రుణ సదుపాయం కల్పించటానికి బయటి ఫైనాన్స్ సంస్థలతో ఒప్పందం కలిగి ఉంటాయి. దీని ప్రకారం కొనుగోలుదారుడికి ఆయా ఫైనాన్స్ సంస్థలు వస్తువులను కొనటానికి ఫైనాన్స్ చేస్తుంటాయి.

ఉదాహరణకు పైన చెప్పినట్టు కాకుండా సృజన్ బయటి సంస్థ నుంచి రూ.లక్ష రుణం తీసుకున్నాడనుకుందాం. మిగతా నియమ నిబంధనలు మాత్రం అదే విధంగా ఉన్నాయి. అంటే ప్రతి నెలా చెల్లించాల్సిన మొత్తం రూ.9,000. కాలవ్యవధి 12 నెలలు. ఇక్కడ కూడా ఆలస్యం జరిగినప్పుడు రూ.500 ఆ సంస్థకు చెల్లించాలి. ఇలాంటి సందర్భాల్లో జాప్యానికి చెల్లించే పెనాల్టీ మొత్తం మీద జీఎస్‌టీ వర్తించదు. అంటే అమ్మకం జరిగినప్పుడు అమ్మకందారుడు.. కొనుగోలుదారుడి నుంచి వసూలు చేసే మొత్తంలో అసలుతో పాటుగా ఏదేనీ వడ్డీ, అపరాధ రుసుము, జరిమానా ఉంటే ఆ మొత్తం మీద కూడా జీఎస్‌టీ వర్తిస్తుంది.

అలాకాకుండా అమ్మకం లేకుండా కేవలం రుణం అంటే ఫైనాన్స్ ఇచ్చే సందర్భాల్లో వసూలు చేసే జరిమానాలకు ఎలాంటి జీఎస్‌టీ వర్తించదు. ఈ తేడాను సదరు కొనుగోలుదారులు, ఫైనాన్స్ అందించే వ్యక్తులు లేదా సంస్థలు గ్రహించాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	96
వరంగల్	95	గుంటూరు	96
కరీంనగర్	95	ఒంగోలు	96
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	87
కర్నూలు	95	నెల్లూరు	92
విశాఖపట్నం	95	అనంతపురం	92
గోదావరి	96		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,620 ▼	79,400 ▼	1,05,000 ▼
విజయవాడ	87,400 ▼	82,500 ▼	96,500 ▼
విశాఖపట్నం	84,430 ▼	77,390 ▼	94,230 ▼
రాజమండ్రి	86,560 ▼	79,350 ▼	96,500 ▼
ప్రొద్దుటూరు	87,400 ▼	80,930 ▼	96,500 ▼
ముంబై	85,056 ▼	77,911 ▼	93,480 ▼

స్పోర్ట్స్

జట్లన్నీ దుబాయ్‌లోనే..

ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా ప్రయాణ కష్టాలు

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో భారత్ మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో జరుగుతుండడం ఇతరజట్లకు సమస్యగా మారింది. అసలు ఆడతామో లేదో తెలియని మ్యాచ్‌కోసం ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు దుబాయ్ వెళ్లాల్సివస్తోంది. సెమీస్‌కు చేరిన జట్ల విషయంలో స్పష్టత వచ్చినా.. ఎవరితో ఎవరు? అనేది ఇంకా తేలాల్సి ఉంది. మార్చి 4న టీమిండియాతో జరిగే సెమీస్‌లో తలపడే జట్టుకు తగిన ప్రాక్టీస్ లభించేందుకు ముందుగానే మిగతా జట్లను కూడా రప్పిస్తున్నట్టు ఐసీసీ అధికారి తెలిపాడు. ఇప్పటికే ఆసీస్ జట్టు ఇక్కడికి చేరుకుంది. ఇక దక్షిణాఫ్రికా లాహోర్ నుంచి ఆదివారం రానుంది. ఆదివారం భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఆఖరి గ్రూప్ మ్యాచ్ జరగనుంది. ఈ ఫలితంతో భారత్ సెమీస్ ప్రత్యర్థి ఎవరో తేలుతుంది. భారత్ గెలిస్తే గ్రూప్ 'ఎ' టాపర్ అవుతుంది కాబట్టి గ్రూప్ 'బి'లో రెండో స్థానంలో ఉన్న ఆసీస్ జట్టు దుబాయ్‌లో ఉంటుంది. ఒకవేళ ఓడితే గ్రూప్ 'బి'లో టాప్‌గా నిలిచిన దక్షిణాఫ్రికాతో రోహిత్ సేన ఇక్కడ ఆడుతుంది. కివీస్‌తో రెండో సెమీస్‌ను లాహోర్‌లో ఆడే జట్టేదో ఆదివారం తేలనుంది. ఒకవేళ భారత్ ఫైనల్‌కు వస్తే మరో సెమీస్ విజేత దుబాయ్‌కి పాకిస్థాన్ నుంచి రావాల్సి ఉంటుంది.



చాంపియన్స్ ట్రోఫీ

టాపర్ ఎవరో?

భారత్ x న్యూజిలాండ్ పోరు నేడు
మ్యాచ్ మ.2.30 నుంచి

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో సెమీఫైనల్ స్థానాలు ఖరారుచేసుకున్న భారత్, న్యూజిలాండ్ జట్లు ఆదివారం తలపడనున్నాయి. ఇరుజట్లూ తిరుగులేని ఫామ్‌లో ఉండడంతో మ్యాచ్ రంజుగా సాగడం ఖాయం. ఇక ఈ మ్యాచ్ విజేత గ్రూప్ టాపర్‌గా నిలుస్తుంది. నాకౌట్‌కు ముందు జరుగుతున్న ఈ పోరు ద్వారా స్పిన్నర్లపై తమ ఆటతీరును మరింత మెరుగుపరుచుకోవాలని భారత బ్యాటర్లు భావిస్తున్నారు. అలాగే రిజర్వ్ ఆటగాళ్లకు ఈ మ్యాచ్‌లో అవకాశం కల్పించాలని జట్టు యాజమాన్యం యోచిస్తోంది. టీమిండియా బ్యాటర్లు స్పిన్నర్లను అంత సమర్థంగా ఎదుర్కోలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో కివీస్ స్టార్ స్పిన్నర్లు శాంట్నర్, బ్రేస్‌వెల్, ఫిలిప్స్‌లను ఎలా ఆడతారన్నది ఆసక్తికరం. కీపర్ పంత్.. నెట్స్‌లో శనివారం తీవ్రంగా శ్రమించడం చూస్తే అతడు తుదిజట్టులో ఉంటాడని భావిస్తున్నారు. అలాగే సుందర్ కూడా ఆడే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్, జడేజా ప్రత్యర్థులకు సింహస్వప్నంగా నిలుస్తున్నారు. భారీ స్కోర్లతో ఊపుమీదున్న కేన్ విలియమ్సన్, యంగ్, లేథమ్, కాన్వే, రచిన్ మన స్పిన్నర్లను ఎలా ఎదుర్కొంటారో చూడాలి.

షమికి విశ్రాంతి ?

ఈ మ్యాచ్‌కు పేసర్ షమికి విశ్రాంతి ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాకిస్థాన్‌తో పోరులో షమి కండర నొప్పితో ఇబ్బందిపడ్డాడు. పైగా..న్యూజిలాండ్ జట్టులో ఐదుగురు ఎడమచేతి వాటం బ్యాటర్లున్నారు. దాంతో ఎడమ చేతి పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌కు చోటు కల్పించాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది.


కివీస్ కెప్టెన్ శాంట్నర్

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లీ, శ్రేయాస్, పంత్ (కీపర్), హార్దిక్, జడేజా, సుందర్, హర్షిత్, కుల్దీప్/వరుణ్, షమి/అర్ష్‌దీప్

న్యూజిలాండ్: శాంట్నర్ (కెప్టెన్), కాన్వే, రచిన్, విలియమ్సన్, మిచెల్, లేథమ్ (కీపర్), ఫిలిప్స్, బ్రేస్‌వెల్, కైల్ జేమిసన్, మ్యాట్ హెన్రీ, ఓ రౌర్క్.

పిచ్/వాతావరణం

దుబాయ్ పిచ్‌లన్నీ స్పిన్నర్లకు అనుకూలిస్తున్నాయి. మంచు ప్రభావం లేకపోవడంతో..భారత్‌తో మ్యాచ్‌లో పాకిస్థాన్, బంగ్లాదేశ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాయి. ఆదివారం 24 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు అవుతుందని అంచనా.

సఫారీలు నాకౌట్‌కు

గ్రూప్-బి టాపర్‌గా ముందంజ
ఇంగ్లండ్‌పై ఘనవిజయం


క్లాసెన్ (64)
డుస్సెన్ (72 నాటౌట్)

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీలో సెమీస్‌కు చేరిన నాలుగో జట్టుగా దక్షిణాఫ్రికా నిలిచింది. వాన్‌డర్ డుస్సెన్ (72 నాటౌట్), క్లాసెన్ (64) హాఫ్ సెంచరీలు చేయడంతో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే ఐదు పాయింట్లతో గ్రూప్ 'బి' టాపర్‌గా సెమీస్‌లో ప్రవేశించింది. ఈ జట్టు సెమీస్ ప్రత్యర్థి భారత్-న్యూజిలాండ్ మ్యాచ్ తేల్చనుంది. వాస్తవానికి ఈ మ్యాచ్‌లో బవుమా సేన ఓడినా ఇబ్బంది లేకపోయేది. ముందుగా ఇంగ్లండ్‌ను 200లోపు కట్టడి చేయడంతోనే సఫారీల నాకౌట్ ఫలితం తేలిపోయింది. అటు అఫ్ఘాన్ కూడా అధికారికంగా నిష్క్రమించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ పేలవ ఆటతీరుతో 38.2 ఓవర్లలో 179 పరుగులకే కుప్పకూలింది. రూట్ (37), ఆర్చర్ (25), డకెట్ (24) మాత్రమే ఆకట్టుకున్నారు. రూట్-బ్రూక్ (19) జోడీ మూడో వికెట్‌కు 62 పరుగులు జత చేసింది. మిడిలార్డర్‌లో బట్లర్ (21), చివర్లో ఆర్చర్ సహకారం అందించడంతో స్కోరు 150 దాటగలిగింది. పేసర్లు ముల్డర్, జాన్సెన్‌లకు మూడేసి.. కేశవ్‌కు రెండు వికెట్లు దక్కాయి.

అవలీలగా..: స్వల్ప ఛేదన కోసం బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 29.1 ఓవర్లలో 3 వికెట్లకు 181 పరుగులు చేసి నెగ్గింది. ఓపెనర్లు స్టబ్స్ (0), రికెల్టన్ (27) 47 పరుగులకే అవుటైనా.. ఆ తర్వాత డుస్సెన్-క్లాసెన్ జోడీ చుక్కలు చూపించింది. విజయానికి ఆరు పరుగుల దూరంలో క్లాసెన్ అవుట్ కాగా.. మిల్లర్ (7 నాటౌట్) సిక్సర్‌తో మరో 125 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లండ్: 38.2 ఓవర్లలో 179 ఆలౌట్ (రూట్ 37, ఆర్చర్ 25; ముల్డర్ 3/25, జాన్సెన్ 3/39, కేశవ్ 2/35).

దక్షిణాఫ్రికా: 29.1 ఓవర్లలో 181/3 (వాన్‌డర్ డుస్సెన్ 72 నాటౌట్, క్లాసెన్ 64, రికెల్టన్ 27; ఆర్చర్ 2/55).

ఢిల్లీ జోరు.. ప్లేఆఫ్స్‌లో చోటు

బెంగళూరు చిత్తు


జొనాసెన్ (61 నాటౌట్)
షఫాలీ (80 నాటౌట్)

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జోరు ప్రదర్శిస్తూ వరుసగా రెండో విజయం అందుకుంది. గత మ్యాచ్‌లో పటిష్ఠ ముంబై ఇండియన్స్‌ను 9 వికెట్లతో చిత్తు చేసిన ఢిల్లీ.. శనివారం అంతే తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై ఘన విజయం సాధించింది. 7 మ్యాచ్‌ల్లో 5 విజయాలు అందుకున్న ఢిల్లీ.. 10 పాయింట్లతో అగ్రస్థానాన్ని పటిష్ఠం చేసుకోవడంతోపాటు ప్లేఆఫ్స్‌కు చేరింది. లీగ్‌లో క్యాపిటల్స్ మరో మ్యాచ్ మాత్రమే ఆడాల్సి ఉంది. కాగా, మ్యాచ్‌లో తొలుత బెంగళూరు 20 ఓవర్లలో 147/5 స్కోరు చేసింది. ఎలిస్ పెర్రీ (60 నాటౌట్) అర్ధ సెంచరీ చేసింది. ఛేదనలో ఢిల్లీ 15.3 ఓవర్లలో 151/1 స్కోరు చేసి నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' షఫాలీ (80 నాటౌట్), జొనాసెన్ (61 నాటౌట్) అజేయంగా నిలిచి జట్టును గెలిపించారు. బెంగళూరుకిది వరుసగా నాలుగో ఓటమి. లీగ్‌కు ఆదివారం విరామం.

సంక్షిప్తస్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 147/5 (ఎలిస్ పెర్రీ 60 నాటౌట్, రాఘవీ బిస్త్ 33, డానీ వ్యాట్ 21, శిఖా పాండే 2/24, శ్రీచరణీ 2/28)

ఢిల్లీ: 15.3 ఓవర్లలో 151/1 (షఫాలీ నాటౌట్ 80, జెస్ జొనాసెన్ నాటౌట్ 61, రేణుకా సింగ్ 1/28).

గుకేష్ @ 3

కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్ కైవసం

అర్జున్‌కు 5, హంపికి 6, ప్రజ్ఞానందకు 8

న్యూఢిల్లీ: ప్రపంచ చాంపియన్ గుకేష్ అంతర్జాతీయ చెస్ ర్యాంకింగ్స్‌లో ముందంజ వేశాడు. శనివారం ప్రకటించిన ఫిడే క్లాసికల్ చెస్ రేటింగ్స్ ఓపెన్ విభాగంలో 18 ఏళ్ల గుకేష్ ప్రపంచ మూడో ర్యాంక్‌లో నిలిచాడు. 2787 రేటింగ్ పాయింట్లతో టాప్ 3లో నిలిచిన గుకేష్ తొలిసారిగా కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్‌ను అందుకున్నాడు. కార్ల్‌సన్ (2833) టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకోగా, నకముర (2802) రెండో స్థానంలో ఉన్నాడు. సుదీర్ఘకాలంగా భారత్ తరఫున అత్యుత్తమ ర్యాంక్‌లో కొనసాగిన అర్జున్ (2777) ఐదో ర్యాంక్‌కు పడిపోయాడు. ప్రజ్ఞానంద (2758) 8వ ర్యాంక్‌కు ఎగబాకి, తొలిసారి టాప్-10లో నిలిచాడు. మహిళల్లో హంపి (2528) 6వ ర్యాంకులో ఉండగా.. వైశాలి (2484), హారిక (2483) వరుసగా 14వ, 16వ స్థానాల్లో కొనసాగుతున్నారు.

పదకొండోసారి ప్రపంచ రికార్డు



ఫ్రాన్స్: స్వీడన్‌కు చెందిన పోల్‌వాల్ట్ స్టార్ అర్మాండ్ డుప్లాంటిస్ వరల్డ్ అథ్లెటిక్స్ ఇండోర్ టూర్ మీటింగ్ పోల్ వాల్ట్‌లో మరో సెంటీమీటర్ ప్రదర్శనను మెరుగుపరచుకొని ఈసారి 6.27 మీటర్లను నమోదు చేశాడు. ఈ క్రమంలో అతను ఏకంగా 11వ సారి ప్రపంచ రికార్డును కొల్లగొట్టి చరిత్రకెక్కాడు.

టైటిల్ దిశగా విదర్భ

కరుణ్ శతకం
కేరళతో రంజీ ఫైనల్


కరుణ్ నాయర్ (132 నాటౌట్)

నాగ్‌పూర్: విదర్భ జట్టు రంజీట్రోఫీని అందుకొనేందుకు అడుగు దూరంలో నిలిచింది. కరుణ్ నాయర్ (132 నాటౌట్) అజేయ శతకంతో కదం తొక్కడంతో కేరళతో ఫైనల్లో పట్టు బిగించింది. 37 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం అందుకున్న విదర్భ.. శనివారం, నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ ఆరంభించి ఆట ఆఖరికి 249/4 స్కోరు చేసింది. దాంతో మొత్తంగా 286 పరుగుల ఆధిక్యాన్ని విదర్భ దక్కించుకుంది. కరుణ్‌కిది ఈ ఏడాది రంజీల్లో నాలుగో శతకం కావడం విశేషం. ఇక సీజన్‌లో ఓవరాల్‌గా అతడికిది తొమ్మిదో సెంచరీ. విజయ్ హజారే ట్రోఫీలో నాయర్ ఐదు శతకాలు కొట్టాడు. కాగా.. మ్యాచ్‌కు ఆదివారం చివరి రోజు.

సంక్షిప్తస్కోర్లు: విదర్భ మొదటిఇన్నింగ్స్: 379, రెండో ఇన్నింగ్స్: 249/4; కేరళ తొలి ఇన్నింగ్స్: 342.

గంట వర్షానికే అస్తవ్యస్తం!

పీసీబీ తీరుపై విమర్శలు


లాహోర్: 29 ఏళ్ల తర్వాత ఓ ఐసీసీ టోర్నీకి ఆతిథ్యమిస్తున్న పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ).. చాంపియన్స్ ట్రోఫీని నిర్వహిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. టోర్నీలో భాగంగా వరుసగా మూడు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. వరుణుడు తెరిపినిచ్చినా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఆట వీలుపడడం లేదు. రావల్పిండి, లాహోర్, కరాచీ స్టేడియాలను కోట్ల ఖర్చుతో మరమ్మతులు చేయించారు. అయినా కొద్ది వర్షానికే అవుట్‌ఫీల్డ్ మొత్తం నీటితో నిండడం, మైదానాన్ని కప్పి ఉంచేందుకు కవర్లు కూడా లేకపోవడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. శుక్రవారం ఆస్ట్రేలియా- అఫ్ఘానిస్థాన్ మ్యాచ్‌లో గంట పాటే వర్షం కురిసినా స్టేడియాన్ని సిద్ధం చేయలేకపోయారు. డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించడం పీసీబీ మర్చిపోయినట్టుందని నెటిజన్లు విమర్శిస్తున్నారు. నీటిని తోడేందుకు కొందరు సిబ్బంది వంటగదుల్లో వాడే మాపింగ్ కర్రలను ఉపయోగించడం, స్పాంజిలను నీళ్లలో ముంచి తీయడంలాంటి దృశ్యాలు కనిపించాయి.

టిక్కెట్ల సొమ్ము వాపస్: రావల్పిండిలో గత నెల 25, 27న జరిగిన క్రికెట్ మ్యాచ్‌లు వర్షంతో టాస్ పడకుండానే రద్దయ్యాయి. దీంతో ఆ మ్యాచ్‌లను తిలకించేందుకు తరలివచ్చిన ప్రేక్షకులకు పూర్తి టిక్కెట్ సొమ్మును వెనక్కి ఇవ్వనున్నట్టు పీసీబీ ప్రకటించింది.

బీసీసీఐ సంయుక్త కార్యదర్శిగా రోహన్ దేశాయ్

ముంబై: గోవా క్రికెట్ సంఘం కార్యదర్శి రోహన్ దేశాయ్ బీసీసీఐ కొత్త సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. శనివారం ఇక్కడ జరిగిన బోర్డు ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎం)లో రోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.










ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
విజయవాడ ● ఆదివారం 2 మార్చి 2025




హిమాలయాల్లో అన్వేషణ

నందమూరి బాలకృష్ణ హీరోగా దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'అఖండ' చిత్రానికి ఇది కొనసాగింపు. ఎమ్.తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం 'అఖండ 2' చిత్రం షూటింగ్ శరవేగంగా సాగుతోంది. హిమాలయాల్లోని అద్భుతమైన ప్రదేశాల్లో కొన్ని ఎక్స్‌ట్రార్డినరీ సన్నివేశాలను చిత్రీకరించడానికి దర్శకుడు సిద్ధమవుతున్నారు. దీనికోసం హిమాలయాల్లో లొకేషన్ల అన్వేషణలో ఉన్నారు బోయపాటి. అక్కడ తెరకెక్కించబోయే సన్నివేశాలు ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణగా ఉంటాయని యూనిట్ తెలిపింది. సంయుక్త కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఆది పినిశెట్టి ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. ఎస్.థమన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సి.రామ్‌ప్రసాద్, సంతోష్ డి.

ఆసక్తిగా ఎదురుచూస్తున్నా

- ఎస్.ఎస్.రాజమౌళి



సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణి ఈ నెల 22న హైదరాబాద్ హైటెక్స్‌లో 'నా టూర్ ఎమ్.ఎమ్.కే' అనే సంగీత ప్రదర్శనను నిర్వహించనున్న సంగతి విదితమే. ఈ సంగీతం ప్రదర్శన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఎక్స్ వేదికగా విడుదల చేసిన ఓ వీడియోలో తెలిపారు. "అన్నయ్య కీరవాణి నిర్వహించనున్న సంగీత ప్రదర్శన కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఈ కచేరిలో చాలా మంది గాయకులు అన్నయ్య సంగీతం అందించిన సినిమాల్లోని పాటలతో అలరించనున్నారు. ఇందులో నా సినిమాల్లోని సూపర్ హిట్ పాటలు కూడా ఉన్నాయి. నా కోరిక ఏంటంటే అన్నయ్య కీరవాణి సినిమాల్లోని ఓఎస్టీలను కూడా ప్రదర్శించాలని. అలాగే ఆయన లైవ్‌లో పాడాలని డిమాండ్ చేస్తున్నా" అని పేర్కొన్నారు.



'కన్నా.. నీ ప్రేమ సంద్రమే'

కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా విశ్వకరుణ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దిల్‌రూబా'. రుక్సర్ థిల్లాన్ కథానాయిక. రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారెగమ నిర్మిస్తున్నారు. ఈ నెల 14న హోలీ సందర్భంగా సినిమాను విడుదల చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు రెస్పాన్స్ వచ్చింది. తాజాగా, ఈ చిత్రం నుంచి మూడో పాటను విడుదల చేశారు మేకర్స్. 'కన్నా.. నీ ప్రేమ సంద్రమే. నేను నీ తీరమే. కన్నా.. నువ్వు నా ప్రాణమే, నేను నీ దేహమే' అంటూ సాగే ఈ గీతాన్ని భాస్కరభట్ల రవికుమార్, విశ్వకరుణ్ రచించారు.

ఉత్కంఠభరితంగా..



కుంచాకో బోబన్ నటించిన మలయాళ చిత్రం 'ఆఫీసర్ ఆన్ డ్యూటీ'. ఇటీవలె విడుదలై బాక్సాఫీసు వద్ద విజయవంతమైంది. ప్రియమణి కథానాయికగా నటించగా, జగదీశ్, విశాక్ నాయర్ కీలక పాత్రలు పోషించారు. జీతు అష్రఫ్ దర్శకత్వం వహించారు. ఉత్కంఠభరితంగా సాగే ఈ చిత్రం తెలుగులో ఈ నెల 7న విడుదల కానుంది. ఈ4 ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హక్కులను సొంతం చేసుకోగా, మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేస్తున్నారు.

రెడ్ డ్రాగన్ అజిత్



ఇటీవలె విడుదలైన 'పట్టుదల' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు తమిళ నటుడు అజిత్‌కుమార్. ఆయన కథానాయకుడిగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. త్రిష కథానాయిక. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో రెడ్ డ్రాగన్‌గా శక్తిమంతమైన పాత్రలో ఆయన కనిపించనున్నారు. 'నువ్వు ఎంతమంచివాడివైనా.. ఈ ప్రపంచం నిన్ను చెడుగా మార్చేస్తుంది' అని అజిత్ చెప్పిన డైలాగ్.. పోరాట ఘట్టాలు, విజువల్స్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఏప్రిల్ 10న సినిమా విడుదల కానుంది.

సవాల్ చేయకు చంపేస్తా



ఆనంది, వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'శివంగి'. దేవరాజ్ భరణి ధరన్ దర్శకత్వంలో నరేశ్‌బాబు పి. నిర్మించారు. ఈ నెల 7న విడుదలవుతోంది. శనివారం చిత్రబృందం 'శివంగి' ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ ఆద్యంతం థ్రిల్లింగ్‌గా సాగింది. 'సత్యభామరా... సవాల్ చేయకు చంపేస్తా' అంటూ ఆనంది చెప్పిన డైలాగ్ ఆమె పాత్ర ఎంత శక్తిమంతంగా ఉండబోతోందో తెలిపింది. వరలక్ష్మి శరత్‌కుమార్ పోలీస్ పాత్రలో ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఏహెచ్ కాషిఫ్, ఎబినేజర్ పాల్.

పోక్సో చట్టం నేపథ్యంలో



హీరో నాని సమర్పణలో రామ్ జగదీశ్ దర్శకత్వం వహించిన చిత్రం 'కోర్ట్ - స్టేట్ వర్సెస్ ఏ నోబడీ'. ప్రశాంతి త్రిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాత. ఈ నెల 14న ఈ చిత్రం విడుదలవుతోంది. శనివారం చిత్రబృందం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. పోక్సో చట్టం నేపథ్యంలో కోర్ట్ రూమ్ డ్రామాగా తెరకెక్కుతున్న చిత్రమిది. ప్రియదర్శి, శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్షవర్ధన్ ప్రధాన తారాగణం. సంగీతం: విజయ్ బుల్గానిన్, సినిమాటోగ్రఫీ: దినేశ్ పురుషోత్తమన్.





14వ సారి తండ్రయిన మస్క్!

» న్యూరాలింక్ ఎగ్జిక్యూటివ్ శివోన్ జిలిస్ ద్వారా మగబిడ్డ

న్యూఢిల్లీ, మార్చి 1: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ 14వ సారి తండ్రి అయ్యారు. ఆయనకే చెందిన ప్రతిష్ఠాత్మక సంస్థ న్యూరా లింక్ ఎగ్జిక్యూటివ్ శివోన్ జిలిస్ ద్వారా నాలుగో బిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని ఆమె 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. "దీనిపై ఎలాన్‌తో చర్చించాను... మా మూడో బిడ్డ అర్కాడియా పుట్టిన రోజు సందర్భంగా... నాలుగో బిడ్డ సెల్డాన్ లైకుర్గస్ గురించి కూడా వెల్లడించడం మంచిదని ఇద్దరం భావించాం..." అని ఆమె పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు మస్క్ హార్ట్ ఎమోజీని పెట్టారు. కాగా జిలిస్, మస్క్‌లకు తొలుత 2021లో కవల పిల్లలు స్ట్రైడర్, ఎజూర్ జన్మించారు. మరోవైపు ఆయనకు ఇప్పటికే గాయని గ్రిమ్స్ ద్వారా ముగ్గురు పిల్లలు, మాజీ భార్య, రచయిత జస్టిన్ విల్సన్ ద్వారా ఆరుగురు పిల్లలు ఉన్నారు. విల్సన్‌కు పుట్టిన పిల్లల్లో ఒకరు బాల్యంలోనే మృతి చెందారు. ప్రస్తుతం మస్క్ శివోన్ జిలిస్‌తో సహజీవనం చేస్తున్నారు. కాగా కన్జర్వేటివ్ ఇన్‌ఫ్లుయెన్సర్ ఆష్లే సెయింట్ క్లెయిర్ తాను మస్క్ ద్వారా ఓ బిడ్డను కన్నానని కొద్ది వారాల క్రితం పేర్కొనడం గమనార్హం. దీనిపై మస్క్ స్పందించలేదు.

అరకు కాఫీ అదుర్స్

(మొదటి పేజీ తరువాయి)

'సర్టిఫైడ్ ఆర్గానిక్ కాఫీ' పేరుతో మార్కెట్‌లో అమ్మేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనికోసం టాటా కంపెనీతో జీసీసీ ఒప్పందం చేసుకుంది. తద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లో అడుగు పెట్టడానికి సన్నాహాలు చేస్తోంది. నిజానికి, అరకు కాఫీ ప్రాధాన్యాన్ని సీఎం చంద్రబాబు ఎప్పుడో గుర్తించారు. హుద్‌హుద్ తుఫాన్‌కు ధ్వంసమయిన కాఫీ తోటలను పునరుద్ధరించడానికి అప్పట్లో రూ.540 కోట్లు మంజూరుచేశారు. విశాఖలో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో ప్రత్యేకంగా అరకు కాఫీ పేరుతో స్టాల్ ఏర్పాటుచేయించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి దేశీ మధురిమ రుచిని చూపించారు. అమరావతి సచివాలయంలో అరకు కాఫీ స్టాల్ పెట్టించారు. ఎలాంటి రసాయన ఎరువులు ఉపయోగించవద్దని సూచిస్తూ 2,600 గిరిజన కుటుంబాలకు శిక్షణ ఇప్పించారు. వారికి అవసరమైన ఆర్థిక సాయం, పంట కొనుగోలు, మార్కెటింగ్ వంటి బాధ్యతలను జీసీసీ తీసుకుంది. పూర్తిగా సేంద్రియ పంట అయినప్పటికీ 'అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ(అపెడా)' ధ్రువీకరిస్తే తప్ప ఆర్గానిక్ సర్టిఫికేషన్ రాదు. రైతులు కాఫీ పండించే విధానాన్ని అన్ని దశల్లో మూడేళ్ల వరుసగా పరిశీలించి సంతృప్తి చెందితే తప్ప 'అపెడా' సర్టిఫికెట్ ఇవ్వదు. దీనికి జీసీసీ అధికారులు నిత్యం రైతులను ప్రోత్సహిస్తూ కాఫీని సాగు చేయించారు. దీని కోసం మరో రూ.70 లక్షలు వెచ్చించారు. ఎట్టకేలకు 'అపెడా' అరకు కాఫీకి గత నెల 'ఆర్గానిక్ సర్టిఫికెట్' ఇచ్చింది. ఒక్క కాఫీకే కాకుండా అందులో అంతర పంటగా వేసిన మిరియాలకు కూడా ఆర్గానిక్ సర్టిఫికేషన్ వచ్చింది. దాంతో ఒక్కసారిగా అంతర్జాతీయ మార్కెట్ ద్వారాలు తెరుచుకున్నాయి. జర్మనీ సహా పలు యూరప్ దేశాల నుంచి అరకు ఆర్గానిక్ సర్టిఫైడ్ కాఫీ కావాలనే డిమాండ్ మొదలైంది. ఈ ఉత్సాహంతో మిరియాలను కూడా 'ఆర్గానిక్ పెప్పర్' పేరుతో విక్రయించాలని జీసీసీ యత్నిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే మరికొన్ని మండలాల్లో కాఫీ సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు రూ.2.2 కోట్లు మంజూరు చేసింది.

పసుపునకూ సర్టిఫికేషన్ సాధిస్తాం

"ఏజెన్సీలోని అన్ని మండలాల్లోను రైతులు కాఫీని పండిస్తున్నారు. సేంద్రియ విధానంలో పండించిన కాఫీ 200 టన్నుల వరకు ఉంటుంది. పదేళ్ల క్రితం అరబికా పార్చ్‌మెంట్ కాఫీకి కిలోకు రూ.90 మాత్రమే దళారులు ఇచ్చేవారు. జీసీసీ కాఫీని సేకరించడం ప్రారంభించిన తరువాత కిలోకు రూ.450 ఇస్తోంది. విశాఖ ఏజెన్సీ, శ్రీకాకుళం జిల్లా సీతంపేటలోను పసుపు పండుతోంది. దీనికి కూడా ఆర్గానిక్ సర్టిఫికేషన్ తెస్తాం"

- కల్పనాకుమారి, వైస్ చైర్మన్, ఎండీ, జీసీసీ

కడప కొండల్లో ఆదిమానవుని ఆనవాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

కొండల్లో వేల సంవత్సరాల నాటి ఎన్నో చారిత్రక వింతలు, విశేషాలు బయటపడుతున్నాయి. పురావస్తు శాఖ పరిశోధనల్లో నిష్ణాతులైన మునిరత్నం రెడ్డి, యేసుబాబు ఆధ్వర్యంలో గురువారం నుంచి లంమల అడవుల్లో ఓ బృందం పర్యటిస్తోంది. దీనిలో యేసుబాబు బృందం ఆదిమానవుడు ఇక్కడ జీవించినట్లు పలు ఆధారాలను సేకరించింది. మల్లుగాని బండ (గవి) వద్ద రాతియుగం నాటి ఆదిమానవుడు గీసిన జంతువులు, మనుషులను పోలిన కొన్ని రేఖా చిత్రాలను గుర్తించారు. బండిగాని సెల వద్ద ఉన్న ఒక గుహలో ఆదిమానవుని ఆవాసాలు, రేఖాచిత్రాలు ఉన్నాయి. తెలుపు రంగుతో గీసిన రేఖా చిత్రాల్లో అడవి జంతువులు, ఆహార వ్యవహారాలకు సంబంధించినవి ఉన్నాయి. ఎరుపు రంగుతో వేసిన బొమ్మల్లో గుర్రం, రాజు, సైన్యం, ఖడ్గం వంటి ఆయుధాలు, ఆవులు, ఆవులను కోసే వాళ్లు ఇలాంటి నాగరిక జీవన ప్రమాణ అంశాలు ఉన్నాయి. ఇక్కడ శివలింగం, తప్పెట్లు, డోలుతో ఊరేగింపుగా వెళుతున్నట్లు, కొరడా పట్టుకుని పోతురాజులాగా ఉన్న రేఖాచిత్రాలను గమనిస్తే.. ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక కోణంలో పరిశోధనకు అవకాశాలు కనిపిస్తాయి. కాగా, పురావస్తు శాఖ అధికారి యేసుబాబు తమ మూడవ రోజు పర్యటన వివరాలను ఆంధ్రజ్యోతికి వివరించారు. 'మూడు రాతి స్థావరాల్లో ఒకదానిలో రేఖాచిత్రాలు ఉన్నాయి. ఆ చిత్రాలలో ముఖ్యంగా మనుషుల, జంతువుల రేఖాచిత్రాలున్నాయి. సహజసిద్ధంగా ఏర్పడిన రాతి గుహలలో ఆదిమ మానవులు సంచార జీవులుగా నివసించే వాళ్లు. ఇక్కడ నీటి వసతి ఉండడంతో.. జంతువులను వేటాడి జీవించే వాళ్లు. వేటాడిన జంతువులను కాల్చుకుని తిన్నారు అనడానికి ఇక్కడ ఆదిమానవుని కాలం నాటి బొగ్గులు దొరికాయి' అని వివరించారు.

శాటిలైట్ 'టోల్' అమలు వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 1: హైవేలపై శాటిలైట్ ఆధారిత టోల్ వసూలు వ్యవస్థను అమలు చేయాలన్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసింది. మరింత కచ్చితమైన వ్యవస్థ కోసం సొంత నావిగేషన్ ఉపగ్రహాలు మరిన్ని అందుబాటులోకి వచ్చే వరకు ఆగాలని నిర్ణయించినట్టు అధికారులు వెల్లడించారు. జీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా భారత్ సొంతంగా ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (ఐఆర్ఎన్ఎస్ఎస్)ను రూపొందించింది. ఇస్రో ఈ టెక్నాలజీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసిన తర్వాత శాటిలైట్ టోల్ వ్యవస్థను అమలు చేయనున్నట్టు కేంద్ర రవాణా శాఖకు చెందిన ఓ అధికారి వెల్లడించారు. మొదట దేశ రాజధాని ప్రాంతం ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తారు. ఆ తర్వాత దేశమంతా అమలు చేయనున్నారు.

పీఎన్‌బీలో 350 స్పెషలిస్టు ఆఫీసర్ ఉద్యోగాలు

న్యూఢిల్లీ, మార్చి 1: స్పెషలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీ కోసం పంజాబ్ నేషనల్ బ్యాంక్ దరఖాస్తులు కోరుతోంది. మార్చి 24 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మొత్తం 350 ఖాళీలు ఉన్నాయి. ఇందులో క్రెడిట్ ఆఫీసర్ 250, ఇండస్ట్రీ ఆఫీసర్ 75, మేనేజర్ 5, సీనియర్ మేనేజర్ 5, మేనేజర్ డేటా సైంటిస్ట్ 3, సీనియర్ మేనేజర్ డేటా సైంటిస్ట్ 2, మేనేజర్ సైబర్ సెక్యూరిటీ 5, సీనియర్ మేనేజర్ సైబర్ సెక్యూరిటీ 5 పోస్టులు ఉన్నాయి. మార్చి 3వ తేదీ నుంచి దరఖాస్తులు చేసుకోవచ్చు. మరోవైపు, దేశవ్యాప్తంగా ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ శాఖల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన అభ్యర్థులు మార్చి 9వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మొత్తం 750 ఖాళీలు. ఇందులో తెలంగాణలో 31, ఆంధ్రప్రదేశ్‌లో 25 ఉన్నాయి.

మాకేంటి?.. అహ! మాకేంటి?



(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటి వరకూ మానవతా సాయం చేసిన అమెరికా ఇప్పుడు ఆ భావనకు పూర్తిగా నీళ్లు వదిలేస్తోంది. ట్రంప్ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. వివిధ దేశాలకు ఆర్థిక సాయం ఆపేస్తున్నారు! దేశంలో ఖర్చులు తగ్గించుకునేందుకు ఉద్యోగులపై వేటు వేస్తున్నారు. ఖర్చులు తగ్గించుకోవడానికే ప్రత్యేకంగా ఓ విభాగాన్నీ ఏర్పాటు చేశారు. వీసాలను అమ్ముకోవడానికీ సిద్ధపడుతున్నారు. చివరికి, అమెరికా రక్షణ బడ్జెట్‌ను సగానికి సగం తగ్గించడానికి కూడా సిద్ధమయ్యారు. అమెరికా అప్పుల సంక్షోభంలో కూరుకుపోయి.. ఆర్థిక అత్యవసర స్థితి దిశగా పయనిస్తుందన్న ఆందోళనలే వీటన్నింటికీ కారణం. 2025 జనవరి నాటికి అమెరికా అప్పు 36 లక్షల కోట్ల డాలర్లు. అంటే.. దాదాపుగా రూ.31.47 కోట్ల కోట్లు (భారతదేశం అప్పు దాదాపుగా రూ.2 కోట్ల కోట్లు. అంటే అమెరికా అప్పు మనకన్నా ఎంత ఎక్కువో అర్థం చేసుకోవచ్చు). ఈ అప్పు ఇలా పెరిగిపోతే అమెరికా ఆర్థిక అత్యవసర స్థితిలోకి వెళ్లిపోవడం ఖాయమని మస్క్ చాలా రోజులుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే, వివిధ దేశాల్లోని సహజ వనరులను చెరబట్టి ఆదాయం పెంచుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. ఇప్పుడు పరస్పర పన్నుల వాదన కూడా ఇందులో భాగమే. అమెరికా తీవ్ర ద్రవ్య లోటుతో ఇబ్బంది పడుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్య లోటు కాస్తా 1.9 ట్రిలియన్ డాలర్ల (దాదాపు రూ.160 లక్షల కోట్లు)కు చేరింది. దాని నుంచి బయటపడేందుకు పరస్పర పన్నుల విధానాన్ని తెరపైకి తెచ్చి బలవంతంగానైనా అమలుకు సిద్ధమవుతున్నారు.

ఉక్రెయిన్ యుద్ధంతో వ్యాపారం

ప్రపంచంలో ప్రతి విషయంలో వేలుపెట్టి పెద్దన్న పాత్ర పోషిస్తూనే, తన ఆయుధ లాబీలకు, స్వలాభానికి ఉపయోగపడే పలు నిర్ణయాలను లోపాయకారీగా తీసుకోవడం అమెరికాకు అలవాటైన విద్య. కానీ, ట్రంప్ వచ్చాక ఆ లోగుట్లు, లోపాయకారీ వ్యవహారాలూ ఏమీ లేవు. ప్రతి అడుగు.. ప్రతి నిర్ణయం వ్యాపారమే. ఇందులో భాగమే.. "నేను నీకు ఇన్నాళ్లు సహాయపడ్డాను, డబ్బులిచ్చాను కాబట్టి.. నీ భూభాగంలో ఉండే అత్యంత అరుదైన ఖనిజ నిక్షేపాల్లో సగం నాకు రాసిచ్చెయ్".. అని ఉక్రెయిన్‌ను నిస్సిగ్గుగా అడగడం. రష్యాతో యుద్ధానికి 500 బిలియన్ డాలర్ల సాయం చేసినందుకు బదులుగా 500 బిలియన్ డాలర్ల సహజ వనరులు ఇచ్చేయాలంటూ ట్రంప్ బేరం పెట్టారు. ఇందుకు ఒప్పందం చేసుకోవాలంటూ డిమాండూ చేశారు. శుక్రవారం ఓవల్ ఆఫీసులో వాగ్వాదమూ ఇందులో భాగమే. అంతేనా.. ఉక్రెయిన్‌పై రష్యా తన దండయాత్రకు ముగింపు పలికి, తన సేనలను ఆక్రమిత ఉక్రెయిన్ నుంచి ఉపసంహరించాలంటూ ఐక్యరాజ్య సమితిలో తీర్మానం చేస్తే.. నాటో కూటమిలో భాగస్వాములైన యూరప్ దేశాలు సహా 93 దేశాలు అనుకూలంగా ఓటేశాయి. అదే నాటో కూటమిలో భాగమై, నిన్నమొన్నటి దాకా ఉక్రెయిన్‌కు ఆర్థిక, ఆయుధ సాయం చేసిన అమెరికా.. ఆ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేసింది. తన ఆగర్భ శత్రువుగా భావించే రష్యాతో చేతులు కలిపి ఉక్రెయిన్ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోంది అమెరికా!

అఫ్ఘానిస్థాన్ నుంచీ..

అమెరికా కారణంగా సర్వ నాశనం అయిపోయిన అఫ్ఘానిస్థాన్ కూడా ట్రంప్ వదలడం లేదు. మొదటి సారి అధ్యక్ష పగ్గాలు చేపట్టినప్పుడు అప్పటికే చాలాకాలంగా అఫ్ఘానిస్థాన్‌లో ఉన్న అమెరికన్ సేనలను వెనక్కి రప్పించి ఆ దేశాన్ని తాలిబాన్ల చేతుల్లో పెట్టేయడానికి రంగం సిద్ధం చేసి, అక్కడ అమెరికన్ సైనికుల సంఖ్యను 13,500 నుంచి 2,500కు తగ్గించిన విషయం తెలిసిందే. అఫ్ఘానిస్థాన్ కొండలు గుట్టల్లో వేలాదిమంది అమెరికన్ సేనలను మోహరించి సాధించేదేమిటి? ఖర్చు తప్ప.. అన్నది ట్రంప్ వాదన. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చిన ట్రంప్.. 'అప్పట్లో మా వాళ్లు వందల కోట్ల డాలర్ల విలువైన పరికరాలు, ఆయుధాలు, యుద్ధ వాహనాలను అక్కడ వదిలేసి వచ్చారు. వాటన్నింటినీ ఇప్పుడు మాకిచ్చేయండి' అని డిమాండ్ చేస్తున్నారు.

తైవాన్ ఏమైతే నాకేంటి!?

ఇప్పటి వరకూ తైవాన్‌కు అమెరికా పరోక్షంగా మద్దతు ఇస్తే.. ఇప్పుడు ట్రంప్ ఆ బాధ్యత నుంచి వైదొలగుతున్నారు. నిజానికి.. తైవాన్‌పై అమెరికా 1979 నుంచీ 'వ్యూహాత్మక అస్పష్టత' విధానాన్ని అవలంబిస్తోంది! అంటే.. తైవాన్‌తో ఎలాంటి సంబంధాలూ లేనట్టు పైకి నటిస్తూనే, తెర వెనుక ఆ దేశానికి అన్ని విధాలా అండగా నిలబడడం. ఇప్పుడు ట్రంప్... తనకు అలాంటి శషభిషలేవీ లేవని, అలాంటి డొంక తిరుగుడు విధానం తనది కాదని.. కుండబద్దలుగొట్టి చెప్పేశారు. తైవాన్ ఏమైతే నాకేంటి అన్నట్టు ఆయన వ్యాఖ్యలు ఉంటున్నాయి. పైపెచ్చు తనకు చైనాతో సత్సంబంధాలు ముఖ్యమని ట్రంప్ తేల్చి చెప్పారు.

పెద్దన్న కాదు.. అందర్లో ఒకడే!

అగ్రరాజ్యం పేరిట అమెరికా ఇప్పటి వరకూ పెద్దన్న పాత్ర పోషించింది. ప్రజాస్వామ్య వికాసం, ఆరోగ్య సంక్షేమం తదితరాల పేరిట నిధులు ఇచ్చేది. చిన్న దేశాలను ఆర్థికంగా ఆదుకునేది. అలాంటి దేశానికి అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన ట్రంప్ వ్యవహారశైలి ఇప్పుడు అందుకు పూర్తి భిన్నంగా మారింది. ఎలాగంటే.. బాగా డబ్బున్న ఒక వ్యక్తి.. ఆపదలో/అవసరంలో ఉన్నవారికి ఎంతో కొంత సాయంచేస్తూ.. 'నేను నీకు ఇది ఇస్తున్నా. మరి నువ్వు నాకు ఏమిస్తావు?' అని అడిగితే ఎలా ఉంటుంది' ఇప్పుడు అమెరికా వైఖరీ అచ్చు ఇలాగే ఉంది!!

వీసాల అమ్మకంతో ఆదాయం

ఆదాయాన్ని పెద్దఎత్తున పెంచుకోవడం, తద్వారా, ద్రవ్య లోటును తగ్గించుకోవడమే ధ్యేయంగా అమెరికా వీసాల అమ్మకానికీ సిద్ధపడింది. 50 లక్షల డాలర్ల (రూ.43.5 కోట్లు)కు గోల్డెన్ వీసా ఇస్తామని ప్రకటించింది. ఈ క్రమంలోనే.. ఒక్కొక్కరికీ రూ.43.5 కోట్ల చొప్పున.. కోటి మందికి గోల్డెన్ వీసాలు అమ్మి అమెరికా అప్పు మొత్తం తీర్చేసే ప్లాన్ ట్రంప్ వేశారనే జోకులు వైరల్ అవుతున్నాయి.


గ్రీన్‌ల్యాండ్‌లో నిక్షేపాల కోసం..

గ్రీన్‌లాండ్ ద్వీపం భౌగోళికంగా ఉత్తర అమెరికా ఖండంలోనిదే అయినా, తొలి నుంచీ అది డెన్మార్క్ అధీనంలోనే ఉంది! ఇప్పుడు ట్రంప్ గ్రీన్‌లాండ్‌లోని ఖనిజవనరుల కోసం డెన్మార్క్‌ను బెదిరిస్తున్నారు. 'బలవంతుడిదే రాజ్యం' తరహాలో.. డెన్మార్క్‌కు ఇష్టం లేకపోయినా స్వాధీనం చేసుకుంటామంటున్నారు.

ఒప్పందాల నుంచీ బయటకు..

అది ఎంత పెద్ద అంతర్జాతీయ ఒప్పందమైనా సరే.. దాన్ని గౌరవించడం ట్రంప్‌కు తెలియదు. అమెరికా ప్రయోజనాల పేరుతో తన బుద్ధికి తోచింది చేయడమే ఆయనకు తెలిసిన విద్య. ఉదాహరణకు.. పారిశ్రామిక యుగానికి ముందుతో పోలిస్తే భూతాపం 1.5 డిగ్రీలకు మించి పెరగకూడదంటూ ప్రపంచదేశాలన్నీ కలిసి 2015లో కుదుర్చుకున్న ఒప్పందం నుంచి ట్రంప్ అర సెకనుపాటైనా ఆలోచించకుండా అర్ధంతరంగా వైదొలగారు! కొవిడ్ మహమ్మారి సమయంలో సరిగ్గా పని చేయలేదంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి కూడా అమెరికా వైదొలగుతున్నట్టు ట్రంప్ ప్రకటించారు. ఎయిడ్స్ వంటి మహమ్మారుల నిర్మూలనకు అమెరికా ఇప్పటి వరకూ వివిధ దేశాలకు ఆర్థిక సాయం చేసేది. ఇప్పుడు ట్రంప్ వాటిని నిలిపివేశారు. ట్రంప్ మొదటిసారి పాలనతో పోలిస్తే.. రెండోసారి అధ్యక్ష పగ్గాలు చేపట్టాక ఆయన తీరు చాలా మారింది. గత నెలన్నరగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ఎక్కువగా డబ్బుతో ముడిపడినవే అయి ఉండడం ఇందుకు నిదర్శనం. అగ్నికి వాయువు తోడైనట్టు.. ట్రంప్‌కు ఈసారి.. 'పెట్టుబడిదారుడు' అనే పదానికి నిలువెత్తు ఉదాహరణగా పేరొందిన మస్క్ తోడవడంతో పరిస్థితి మరింత ఘోరంగా మారింది.

లోకం తీరు



ఉక్రెయిన్‌కు ఈయూ అండ

కీవ్, మార్చి 1: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఓవెల్ ఆఫీస్ జరిగిన చర్చలు విఫలమవ్వడంతో.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి తాము అండగా ఉంటామంటూ ఐరోపా దేశాలు ముక్తకంఠంతో ప్రకటించాయి. కెనడా కూడా ఉక్రెయిన్‌కు తమ మద్దతుంటుందని స్పష్టం చేసింది. "ఉక్రెయిన్‌పై రష్యాది దురాక్రమణ" అని వ్యాఖ్యానించింది. ఉక్రెయిన్‌కు నాటో అత్యుత్తమ భద్రత హామీలనిస్తుందని.. ట్రంప్ రష్యా మాటలకు లొంగిపోయారని ఈయూ విదేశీ వ్యవహారాల ఉన్నత ప్రతినిధి ఖాజా కల్లాస్ అన్నారు. ఈయూ అధ్యక్షుడు ఉర్సులా లెయాన్ కూడా "ప్రియమైన జెలెన్‌స్కీ.. మీకు అండగా మేమున్నాం. మీరు ధైర్యంగా ఉండండి. మీతో మేము కలిసి పనిచేస్తాం" అని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఏకంగా ఐరోపా దేశాలు అమెరికాకు సామంత పాత్రను వీడాలని పిలుపునిచ్చారు. ట్రంప్‌నకు సన్నిహితంగా ఉండే ఇటలీ ప్రధాని మెలోనీ కూడా ఎక్స్‌లో ఓ పోస్టు చేస్తూ.. ఉక్రెయిన్‌కు అండగా ఉంటామన్నారు. ఉక్రెయిన్ ఒంటరి కాదని పోలాండ్ మద్దతు పలికింది. కాగా.. అమెరికా మద్దతు తగ్గడంతో ఉక్రెయిన్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఆర్థికసాయాన్ని నిలిపివేసినట్లు ఐరాస తెలిపింది. మరోవైపు, ఆదివారం బ్రిటన్‌లో ఈయూ నేతల సదస్సు జరగనుండడంతో.. జెలెన్‌స్కీ అమెరికా నుంచి నేరుగా లండన్‌కు చేరుకున్నారు. నిజానికి బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అధ్యక్షతన జరిగే ఈ సదస్సు ఎజెండాల్లో ఉక్రెయిన్‌కు మద్దతిస్తూ.. యుద్ధాన్ని నిలిపివేసి, శాంతిని నెలకొల్పడం ఒకటిగా ఉంది. సదస్సులో జెలెన్‌స్కీ ప్రసంగిస్తారని అంతర్జాతీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జర్మనీ, డెన్మార్క్, నెదర్లాండ్స్, నార్వే, పోలాండ్ తదితర దేశాధినేతలతోనూ జెలెన్‌స్కీ వేర్వేరుగా భేటీకానున్నట్లు తెలుస్తోంది.

పన్నుల వాటా తగ్గితే కేంద్రంపై పోరాటమే!

కర్ణాటక సీఎం సిద్దరామయ్య



బెంగళూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాలకు కేంద్ర పన్నుల వాటా తగ్గిందని, ఈ అంశంలో కర్ణాటకకు అన్యాయం జరిగితే కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ఆ రాష్ట్ర సీఎం సిద్దరామయ్య స్పష్టం చేశారు. రాష్ట్రాలకు పన్నులవాటా 41శాతం నుంచి 40 శాతానికి తగ్గించేందుకు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. మోదీ ప్రధాని అయినప్పటి నుంచి రాష్ట్రాలకు ఉండే రాజ్యాంగబద్ధమైన అధికారాలను తగ్గిస్తున్నారని, బలహీనం చేస్తున్నారని తెలుస్తోందన్నారు. రాష్ట్రాలకు వాటా పంపిణీ న్యాయబద్ధంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్‌కు ఉందన్నారు. ఏటా కన్నడిగుల నుంచి రూ.4 లక్షల కోట్లు కేంద్రానికి పన్నుల రూపంలో వెళ్తోందని, రాష్ట్రానికి 15 పైసల వాటా మాత్రమే తిరిగి వస్తోందన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్ పన్నులు పంచే విషయంలో 4.713 శాతం నుంచి 3.64కు తగ్గించిందని వెల్లడించారు. తద్వారా కర్ణాటక గడిచిన ఐదేళ్లలో రూ.68,775 కోట్లు కోల్పోయిందని అన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్ వ్యవధి వచ్చే ఏడాది ముగుస్తుందని, ఇప్పటివరకు కమిషన్ సిఫారసు చేసిన స్పెషల్ గ్రాంటు రూ.5495 కోట్లు, రాష్ట్రానికి కేంద్రం వాటా రూ.6 వేల కోట్ల మొత్తం విడుదల కాలేదని తెలిపారు.

15 ఏళ్లు దాటిన వాహనాలకు ఇంధనం బంద్!

» ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం..

న్యూఢిల్లీ, మార్చి 1: దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్య నియంత్రణ కోసం కొత్తగా కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 15 సంవత్సరాలు దాటిన వాహనాలకు బంకుల్లో ఇంధనం పోయొద్దని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం మార్చి 31 తర్వాత అమలులోకి వస్తుందని రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా శనివారం అధికారులతో భేటీ అనంతరం తెలిపారు. "ఢిల్లీలో కాలుష్య కట్టడికి కంకణబద్ధులై ఉన్నాం. 15 సంవత్సరాలు పైబడిన వాహనాలను గుర్తించడానికి పెట్రోల్ బంకుల్లో గాడ్జెట్లు ఏర్పాటు చేస్తాం. గడువు దాటిన వాహనాలను అవి గుర్తిస్తాయి. వాటికి పెట్రోల్, డీజిల్ ఉండదు. ఈ అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర పెట్రోలియం శాఖకు పంపిస్తాం" అని మంత్రి పేర్కొన్నారు.

ఎవరెస్టు సందర్శనకు చైనా అనుమతి

బీజింగ్, మార్చి 1: ఎవరెస్టు పర్వత అందాల సందర్శనకు పర్యాటకులను చైనా శనివారం నుంచి తిరిగి అనుమతిస్తోంది. ఎవరెస్టు పర్వతం, టిబెట్ భూభాగంలో ఉన్న చోమోలాంగ్మ పర్వత ప్రాంతం వద్దకు సాధారణ పౌరులను అనుమతిస్తున్నామని ప్రకటించింది. ఎవరెస్టును టిబెట్ భాషలో చోమోలాంగ్మ అంటారు. అయితే, ఈ ఏడాది జనవరి 7న ఆ ప్రాంతంలో భూకంపం సంభవించి 126 మంది మరణించారు. దీంతో ఆ రోజు నుంచి ప్రజలను ఆ ప్రాంతంలోకి అనుమతించడం లేదు. భూకంప అనంతర పరిస్థితులపై 35 రోజుల పాటు అధ్యయనం చేసిన నిపుణులు హిమాలయాలకు ఎలాంటి ముప్పు వాటిల్లలేదని తేల్చారు.

100 జిల్లాల్లో పీఎం ధన ధాన్య కృషి

2025-26 బడ్జెట్ వెబినార్‌లో ప్రధాని వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాభివృద్ధికీ, రైతు సంక్షేమానికీ తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. దేశంలో వ్యవసాయ సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అందుకే, దేశంలోని తక్కువ పంట దిగుబడి, ఉత్పాదకత ఉండే వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం అందించేందుకు పీఎం ధన ధాన్య కృషి యోజన పథకానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. దేశవ్యాప్తంగా తొలుత ఎంపిక చేసిన 100 జిల్లాల్లో అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. 2025-26 బడ్జెట్‌కు సంబంధించి వ్యవసాయం-గ్రామీణాభివృద్ధిపై ఏర్పాటుచేసిన వెబినార్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ మాట్లాడారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన వ్యవసాయ సంబంధ కార్యక్రమాలను ముందుగా మొదలుపెట్టాలని అధికారులను కోరారు. ప్రస్తుతం దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తి పెరిగిందని, అయినప్పటికీ దేశీయ వినియోగంలో 20% ఇప్పటికీ దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోందని చెప్పారు. ప్రజల్లో పోషకాహారంపై అవగాహన పెరుగుతోందని, అందుకు అనుగుణంగా ఆహార ధాన్యాలు, పాడి పరిశ్రమ, మత్స్య ఉత్పత్తులు మరింత పెరగాల్సి అవసరం ఉందన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి యోజన ద్వారా రైతులకు దాదాపు రూ.3.75 లక్షల కోట్లు అందించామని గుర్తు చేశారు. గత పదేళ్ల క్రితం వ్యవసాయ ఉత్పత్తి దాదాపు 265 మిలియన్ టన్నులు ఉండేదని, అదిప్పుడు 330 మిలియన్ టన్నులకు పెరిగిందని తెలిపారు. ఉద్యానవన ఉత్పత్తి 350 మిలియన్ టన్నులను దాటిందని స్పష్టం చేశారు. గత పదేళ్లలో ఐసీఏఆర్ ఆధ్వర్యంలో 2,900కి పైగా కొత్త రకాల పంటలను అభివృద్ధి చేశామన్నారు. అయితే, కొత్త రకాలు రైతులకు అందుబాటులో ధరలో ఉంచేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రపంచ కార్ఖానాగా భారత్..

ప్రపంచ కార్ఖానాగా భారత్ అవతరిస్తోందని, ఉత్పాదక రంగ హబ్‌గాను మారుతోందని మోదీ ప్రకటించారు. ఇకనెంత మాత్రం భారత్ శ్రామికశక్తి కాదని..అది ప్రపంచ శక్తిగా మార్పు చెందుతోందని తెలిపారు. 'న్యూస్ ఎక్స్ వరల్డ్' చానల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఢిల్లీలో శనివారం ఏర్పాటుచేసిన సదస్సులో (ఎన్ఎక్స్‌టీ) మోదీ ప్రసంగించారు. 'వోకల్ ఫర్ లోకల్' అనే తన విధానం ఫలితాలను ఇస్తోందని, మన దేశ ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నాయన్నారు. "21వ శతాబ్ద భారత్‌ను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. మనదేశాన్ని సందర్శించాలని కోరుకుంటోంది" అని తెలిపారు. "ప్రపంచ ఆహార సరఫరాల గొలుసులో అత్యంత నమ్మకమైన, సౌకర్యవంతమైన భాగస్వామిగా భారత్ అవతరించింది" అని మోదీ అన్నారు.

జైశంకర్‌పై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం

న్యూఢిల్లీ, మార్చి 1: అమెరికా నుంచి భారతీయుల బహిష్కరణకు సంబంధించి సభను తప్పుదోవ పట్టించే విధంగా, అసంపూర్తి సమాచారాన్ని అందించారని ఆరోపిస్తూ విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌పై టీఎంసీ సభ్యురాలు సాగరికా ఘోష్ శుక్రవారం సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం (ప్రివిలేజ్ మోషన్)ను ప్రవేశపెట్టారు. "వలసదారులను నిర్బంధించడం, వారిపట్ల దురుసుగా ప్రవర్తించడం వంటి అంశాలను అమెరికా అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని విదేశాంగ మంత్రి ఫిబ్రవరి 6న సభలో స్పష్టంగా చెప్పారు. ఇలాంటివి మరోసారి జరగకుండా చూస్తామని తెలిపారు. ఆ తర్వాత తొమ్మిది రోజులకు బహిష్కరణకు గురైన మరో 116 మంది భారతీయులను సంకెళ్లతో బంధించిన విమానం ఫిబ్రవరి 15న భారత్‌కు వచ్చింది. అసలు భారత్ ఈ అంశాన్ని అమెరికా దృష్టికి తీసుకెళ్లిందా, లేదా అనేదానిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇది సభను తప్పుదోవ పట్టించడమే" అని ఘోష్ పేర్కొన్నారు.

సీయూఈటీ టెస్టు తేదీల ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి3: దేశవ్యాప్తంగా కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యాసంస్థల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఉమ్మడి విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్ష(సీయూఈటీ) మే 8 నుంచి జూన్ ఒకటి వరకు నిర్వహిస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) తెలిపింది. దరఖాస్తులు ఈ నెల 22 వరకు అందుబాటులో ఉంటాయి. తెలుగు, ఇంగ్లీష్, హిందీ సహా మొత్తం 13 భాషల్లో ఈ ఎంట్రన్స్ నిర్వహిస్తారు. పరీక్షల తేదీల పూర్తి వివరాలను తర్వాత ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

నిర్బంధ హిందీని అడ్డుకుంటా!

» జన్మదిన వేడుకల్లో స్టాలిన్ శపథం



చెన్నైలో విద్యార్థులతో స్టాలిన్

చెన్నై, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నిర్బంధ హిందీ అమలును వ్యతిరేకిస్తూ మాతృభాష తమిళాన్ని కాపాడుకునేందుకు పోరాడుతానని డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు సీఎం స్టాలిన్ తన జన్మదిన వేడుకల్లో శపథం చేశారు. 73వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా స్టాలిన్ పార్టీ కార్యాలయం అన్నా అరివాలయంలో శనివారం మధ్యాహ్నం మంత్రులు, పార్టీ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. "రాష్ట్ర హక్కుల కోసం పోరాడుదాం.. ఏ రూపంలో వచ్చినా నిర్బంధ హిందీని వ్యతిరేకిద్దాం, తమిళభాషను కాపాడుకుందాం" అంటూ తమిళంలో అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఇదిలా ఉండగా జన్మదినం సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన ఓ సుదీర్ఘ లేఖ రాశారు. ఆ లేఖలో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం జాతీయ విద్యా విధానం పేరుతో హిందీని నిర్బంధంగా అమలు చేయాలని కుట్ర పన్నుతోందని, నియోజకవర్గాల పునర్విభజన పేరుతో రాష్ట్రంలోని లోక్‌సభ స్థానాలను తగ్గించేందుకు ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రానికి ఎప్పుడో విడుదల చేయాల్సిన విద్యా సంబంధిత నిధులను కూడా నిలిపివేసిందని, ఇలా కేంద్రం రాష్ట్రాన్ని ముప్పుతిప్పలు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.

టాటూలతో హెచ్ఐవీ, క్యాన్సర్ ముప్పు!

» నియంత్రణకు కొత్త నిబంధనలు తేవాలి.. కేంద్రానికి కర్ణాటక మంత్రి లేఖ

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): టాటూలతో హెచ్ఐవీ, చర్మ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని కర్ణాటక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు అన్నారు. బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ టాటూల ద్వారా అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని, దీనిపై కొత్త నిబంధనలు తీసుకురావాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశామని తెలిపారు. టాటూకు ఉపయోగించే ఇంకు దుష్ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. టాటూ పార్లర్‌లను నియంత్రించే చట్టం రూపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇటీవల చర్మ క్యాన్సర్, హెచ్ఐవీ, చర్మ రోగాలు, హెపటైటిస్ వంటి ప్రాణాంతకమైన జబ్బులు పెరుగుతున్నాయని, ఇందుకు పచ్చబొట్టు (టాటూ) వేయించుకోవడం ఒక కారణమని ఆరోగ్య శాఖ జరిపిన పరీక్షల్లో తేలిందని పేర్కొన్నారు.

'రుణ గ్రహీత' 'వినియోగదారుడు' కాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 1: లాభార్జన లక్ష్యంతో బ్యాంకు నుంచి అప్పు తీసుకున్న రుణ గ్రహీతను 'వినియోగదారుడు'గా పరిగణించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రుణ గ్రహీతను కూడా వినియోగదారుడిగా పరిగణిస్తూ జాతీయ వినియోగదారుల ఫోరం ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నిర్ణయాన్ని వెలువరించింది. రజనీకాంత్ నటించిన 'కొచ్చిడియాన్' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల కోసం ఓ యాడ్ సంస్థ రుణం తీసుకొని, ఏకకాల పరిష్కారం కింద చెల్లించినప్పటికీ.. 'సిబిల్' స్కోరులో మాత్రం ఆ సంస్థను రుణ ఎగవేతదారుగానే చూపించారు. దీనిపై ఆ సంస్థ.. జాతీయ వినియోగదారుల ఫోరంను ఆశ్రయించింది. విచారణ జరిపిన ఫోరం.. రూ.75 లక్షలు పరిహారంగా చెల్లించాలని సెంట్రల్ బ్యాంకును ఆదేశించింది. దీన్ని సవాలు చేస్తూ సెంట్రల్ బ్యాంకు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఈ కేసులో రుణగ్రహీతను వినియోగదారుడిగా గుర్తించలేదని సుప్రీంకోర్టు తెలిపింది.

2029లోనూ మా సార్ సీఎం కావాలి!

» ఫైబర్ నెట్ మాజీ చైర్మన్ జీవీ రెడ్డి

అమరావతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పలు పరిణామాల నేపథ్యంలో రాజీనామా చేసిన ఫైబర్‌నెట్ మాజీ చైర్మన్ జీవీ రెడ్డి.. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై సోషల్ మీడియా వేదికగా స్పందించారు. రూ.33 వేల కోట్ల అతి తక్కువ రెవెన్యూ లోటుతో రూ.3.22 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రణాళికాబద్ధంగా రూపొందించడం శుభపరిణామమని అన్నారు. ఇదే సమయంలో సీఎం చంద్రబాబుపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ.. చంద్రబాబు నాయకత్వం పట్ల తనకు ఎప్పటికీ గౌరవం, అభిమానం ఉంటుందని పేర్కొన్నారు. తక్కువ కాలంలోనే టీడీపీలో, ప్రభుత్వంలో గౌరవ ప్రదమైన బాధ్యతలు అప్పగించడం జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. 'ఈ అవకాశం ఇచ్చినందుకు మా సార్ చంద్రబాబుకు రుణపడి ఉంటాను. ఏపీ అభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం 2029లోనూ మా సార్ ముఖ్యమంత్రి కావాలి' అని ఆకాంక్షించారు. రాష్ట్ర పురోగతి కోసం చంద్రబాబుకు మద్దతుగా నిలవడం అభివృద్ధి కోరుకునే ప్రతి తెలుగు వ్యక్తి బాధ్యత' అని జీవీ రెడ్డి పేర్కొన్నారు.



అనంతపురంలో శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్‌ఐల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న హోంమంత్రి అనిత

రెడ్‌బుక్ అమలు చేస్తే రోడ్డుపై తిరగలేరు

» హోంమంత్రి అనిత హెచ్చరికలు

అనంతపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెడ్‌బుక్ అమలుచేస్తే వైసీపీ నేతలెవ్వరూ రోడ్డుపై తిరగలేరని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. తప్పు చేస్తే ఎంతటివారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. అనంతపురం నగరంలోని పోలీసు శిక్షణ కళాశాలలో శనివారం నిర్వహించిన ఎస్‌ఐల పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఆమె పాల్గొన్నారు. పరేడ్ పూర్తయిన తరువాత మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించబోదని, అలాగని తప్పు చేసినవారిని ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. 'ఎవరి స్క్రిప్ట్ చదివినా... అనుభవించే రాజా అతనే కదా' అని పోసానిని ఉద్దేశించి హోంమంత్రి వ్యాఖ్యానించారు. పోసాని మాటలను చూసి అయ్యో పాపం అనేవారిని ఒక్కరినైనా తీసుకురావాలని సవాలు చేశారు. పోసానిపై రాష్ట్రవ్యాప్తంగా 17 కేసులు ఉన్నాయని, మాజీ ఎమ్మెల్యే వంశీపై ఎన్ని కేసులున్నాయో అందరికీ తెలుసన్నారు. నోటికొచ్చినట్లు బూతులు మాట్లాడతామంటే ఇది వైసీపీ ప్రభుత్వం కాదని, ఎన్డీయే ప్రభుత్వమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని అనిత సూచించారు. కొన్ని కేసుల్లో నిందితులు దొరికినా.. శిక్ష పడేందుకు చాలా రోజులు పడుతుందనే అపోహలో ఉన్నారని, ఆ ఆలోచనను పోగొట్టి, వారిలో భయం పుట్టేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆడపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేయాలని పోలీసులకు సూచించారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌ను వైసీపీ గోడలకు పరిమితం చేస్తే... తాము రూ.450 కోట్లతో పూర్వవైభవం తీసుకొస్తున్నామని చెప్పారు. అప్పా, గ్రేహౌండ్స్‌కు నిధులిచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. కాగా, శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లోకి చేరబోతున్న ఎస్‌ఐలు నిష్పక్షపాతంగా, నిజాయతీతో ప్రజలకు సేవలు అందించాలని హోంమంత్రి పిలుపునిచ్చారు. శిక్షణలో నేర్చుకున్నది విధినిర్వహణలో పాటించాలని సూచించారు. కాగా, రాగద్వేషాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందించాలని శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరబోతున్న ఎస్‌ఐలకు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా పిలుపునిచ్చారు. పాసింగ్ అవుట్ పరేడ్‌లో చేసిన ప్రమాణానికి అనుగుణంగానే ఉద్యోగ విరమణ పొందే వరకూ పనిచేయాలని సూచించారు.

వైసీపీతో వినాశనం

(మొదటి పేజీ తరువాయి)

గంగాధరనెల్లూరులో ఆయన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీసీ కాలనీలో గీత కార్మికుడు వాసు, దళితవాడలో వసంతమ్మ ఇళ్లకు వెళ్లి పెన్షన్లను అందించారు. దళితవాడలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక వద్ద స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం రామానాయుడుపల్లె వద్ద ఏర్పాటు చేసిన టీడీపీ కార్యకర్తల సమావేశంలోనూ ప్రసంగించారు. 'రాష్ట్రంలో 64 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నాం. పెన్షన్ల కోసం ఏటా రూ.33 వేల కోట్లను ఖర్చు చేస్తున్నాం. దేశంలో మరే రాష్ట్రంలో కూడా ఇంత పెద్దమొత్తంలో ఖర్చు చేయడం లేదు. అమరావతిలో ఉంటున్నా టెక్నాలజీ ద్వారా రాష్ట్రంలో ఎవరెక్కడ ఎలా పనిచేస్తున్నారో క్షణాల్లో తెలుసుకుంటున్నా. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇళ్ల వద్ద నుంచే ప్రజలు సేవల్ని పొందవచ్చు' అని అన్నారు.

9 నెలల్లో 12.9 శాతం వృద్ధిరేటు

'వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలు ఎన్నో బాధలు పడ్డారు. వారి ముఖాల్లో నవ్వు కనిపించలేదు. కూటమిని అధికారంలోకి తెచ్చారు. ఈ 9 నెలల్లో ప్రజలు సంతోషంగా ఉన్నారు. ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తున్నాం. 12.9 శాతం వృద్ధిరేటు సాధించాం. కేంద్రంతో కలిసి చేసే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. మ్యాచింగ్ గ్రాంట్‌ను ఇచ్చి పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తున్నాం. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యమిచ్చాం. రాష్ట్ర ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వ పాలన సాగుతోంది' అని అన్నారు.

> టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండాలి. నా చుట్టూ తిరిగితే పదవులు రావు. పదవులు మిమ్మల్ని వెతుక్కుంటూ రావాలంటే మీరు ప్రజలతో ఉండాలి.
> - చిత్తూరు జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబు

రాజముద్రతో పాసుపుస్తకాలు

'జూన్‌లోగా డీఎస్సీ భర్తీ ప్రక్రియ పూర్తిచేస్తాం. పాఠశాలలు మళ్లీ తెరిచేలోగా పోస్టింగ్‌లు కూడా ఇచ్చేస్తాం. గత ప్రభుత్వంలో జగన్ తన ఫొటోలతో పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. వాటిని రద్దుచేసి త్వరలో రైతులకు రాజముద్రతో పుస్తకాలను అందించనున్నాం. రాష్ట్రంలో 20వేల కిలోమీటర్ల గుంతల రహదారుల్ని బాగు చేశాం. వైసీపీ హయాంలో రోడ్లపై గుంతలతో ఇంటికి సురక్షితంగా చేరుతామనే నమ్మకం ఉండేది కాదు. ఇప్పుడు ప్రశాంతంగా ప్రయాణిస్తున్నారు. ఇద్దరికి మించి పిల్లల్ని కనండి. భవిష్యత్తులో పిల్లలే మనకు ఆస్తి. అందుకే నేను ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికివందనం కింద ఏడాదికి రూ.15 వేల చొప్పున అందిస్తానని చెప్పా. మే నెల నుంచి తల్లుల ఖాతాల్లో ఈ డబ్బులు జమవుతాయి' అని చంద్రబాబు పేర్కొన్నారు. రైతులకు సాగు ఖర్చు కోసం కేంద్రం ఇప్పటికే రూ.6 వేలను అందిస్తుండగా.. మేం రూ.14 వేలు జత చేసి మొత్తంగా రూ.20వేలు ఇస్తాం. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో అందిస్తాం. ఇప్పటికే అన్నదాత సుఖీభవ పథకానికి బడ్జెట్‌లో నిధుల్ని కేటాయించాం. చిత్తూరు-తచ్చూరు హైవే సమీపంలో పారిశ్రామిక వాడ కోసం 2వేల ఎకరాలను సేకరించాలని కలెక్టర్‌కు చెప్పాను. బయటి ప్రాంతాల నుంచి పెద్ద కంపెనీలను తీసుకొచ్చి ఇక్కడ నిరుద్యోగ సమస్య తీరుస్తాం' అని చంద్రబాబు అన్నారు.

త్యాగాలు చేసిన వారిని గుర్తుంచుకుంటాం

టీడీపీ కోసం త్యాగాలు చేసినవారిని ఎప్పుడూ గుర్తుంచుకుంటామని చంద్రబాబు అన్నారు. టీడీపీ శ్రేణులు ఇష్టానుసారంగా కాకుండా నాయకత్వం కింద పనిచేయాలని సూచించారు. గంగాధరనెల్లూరు పర్యటనలో భాగంగా రామానాయుడుపల్లె సమీపంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 'టీడీపీ కార్యకర్తలు మరో పార్టీలోకి వెళ్లరు, వెళ్లలేరు. మనది మొదటినుంచీ కేడర్ ఆధారిత పార్టీ. అందుకే క్లస్టర్, యూనిట్ బూత్ విధానం తీసుకొచ్చాం. ఆన్‌లైన్ సభ్యత్వానికి మంచి స్పందన వచ్చింది. 1.02కోట్ల మంది సభ్యత్వం తీసుకున్నారు' అని చెప్పారు. మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు, ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



టీడీపీ కార్యకర్త ఇచ్చిన టోపీ, కళ్లద్దాలతో సీఎం

రంజాన్ ప్రార్థనలు ఫలించాలి

» ముస్లింలకు చంద్రబాబు శుభాకాంక్షలు

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రంజాన్ నెల ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. 'నెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలతో మీరు చేసే ప్రార్థనలు ఫలించాలి. ఆ అల్లా దయతో అందరికీ మంచి జరగాలి' అని చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కూడా ముస్లిం సోదరులకు రంజాన్ మాస ప్రారంభం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

వలసలు లేని సీమను చూడాలన్నదే లక్ష్యం

అమ్మ ఆజ్ఞతో రాఘవేంద్రుడిని దర్శించుకున్నా

గురు వైభవోత్సవాల్లో మంత్రి లోకేశ్

కర్నూలు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): 'యువగళం పాదయాత్రలో కర్నూలు జిల్లాలో రైతులు, వ్యవసాయ కూలీలు... కరువు, వలసల వల్ల పడుతున్న ఇబ్బందులను కళ్లారా చూశాను. వలసలు లేని రాయలసీమ చూడాలన్నదే నా లక్ష్యం' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. శనివారం కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఆయన పర్యటించారు. మార్చి 1నుంచి ఆరు రోజులు రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాలు, 6న రాఘవేంద్రుడి జన్మదిన మహోత్సవం నిర్వహిస్తారు. తొలిరోజు ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ఆధ్వర్యంలో నిర్వహించిన 404వ పాదుకా పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొన్నారు. లోకేశ్ మాట్లాడారు. 'సీఎం చంద్రబాబు నాయకత్వంలో కొలువుదీరిన టీడీపీ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలి. ప్రజలు పేదరికాన్ని జయించి సుఖసంతోషాలతో ఉండాలి. సకాలంలో వర్షాలు కురవాలి' అని కోరుకున్నానని చెప్పారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనం కోసం వెళ్తానని ముందుగా తన తల్లి భువనేశ్వరిని అడిగానని, ఆమె ఆజ్ఞానుసారం స్వామి వారిని దర్శించుకున్నానని తెలిపారు. లోకేశ్‌కు వేద పండితులు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు, మంత్రి లోకేశ్‌ను శాలువా కప్పి... రాఘవేంద్ర స్వామి ప్రశస్తి అవార్డు, జ్ఞాపికను బహూకరించారు. ఆశీర్వచనాలు అందజేశారు. పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన స్వర్ణ రథోత్సవంలో పాల్గొన్న లోకేశ్.. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌నూ ప్రారంభించారు.

ఆశాలకు వరం

(మొదటి పేజీ తరువాయి)

రూ.1.50 లక్షలకు వరకూ లబ్ధి చేకూరుతుంది. అలాగే, ఆశా వర్కర్ల పదవీవిరమణ వయసును 62 ఏళ్లకు పెంచారు. ఈ వరుస నిర్ణయాలతో గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే 37,017 మందికి, పట్టణ ప్రాంతంలో పని చేసే 5735 మందికి లబ్ధి చేకూరనుంది. ఆరోగ్యశాఖపై శనివారం జరిగిన సమీక్షలో భాగంగా చంద్రబాబు ఈ ఆదేశాలు జారీచేశారు. దీంతో ఎన్నికల ముందు ఆశాలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చినట్టయింది. పైగా, దేశంలోనే మొట్టమొదటిసారిగా ఆశా కార్యకర్తలకు గ్రాట్యూటీ అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవనుంది. నిజానికి, గ్రాట్యూటీ అమలు చేయాలని ఆశాలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఆశా వర్కర్లకు గతంలో ప్రసూతి సెలవుల సమయంలో వేతన చెల్లింపు ఉండేది కాదు. ప్రసూతి సెలవులను పని దినాలుగా పరిగణనలోకి తీసుకుని వేతనం చెల్లించాలని అధికారులకు సమావేశంలో సీఎం ఆదేశాలు జారీచేశారు.

ఆశాలకు అండగా... ఆశాల పట్ల సీఎం చంద్రబాబు తొలినుంచీ సానుకూలంగానే స్పందిస్తున్నారు. ఆశాలు అందిస్తున్న సేవలను మెరుగుపరచడం కోసం 2018లో ఆయన హయాంలోనే స్మార్ట్ ఫోన్‌లను అందించారు. ఏఎన్‌ఎంల నియామకంలో అర్హతను బట్టి ఆశా వర్కర్లకు అప్పట్లో అవకాశం ఇచ్చారు. రేషన్ కార్డు అందించారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత వైద్యం పొందే అవకాశం కల్పించారు. ఉద్యోగ విరమణ వయస్సును అప్పట్లో 60 ఏళ్లకు పెంచిన ఆయన.. తిరిగి ఇప్పుడు దానిని 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం విశేషం. ఉద్యోగ విరమణ అనంతరం వృద్ధాప్య పెన్షన్ పొందేందుకు ఆశాలకు అర్హత కల్పించారు. నెలకు రూ.10 వేలు చొప్పున జీతం చెల్లిస్తున్నారు. వీరికి ఉత్తరప్రదేశ్‌లో రూ.750, హిమాచల్ ప్రదేశ్‌లో రూ.2 వేలు, రాజస్థాన్‌లో రూ.2,700, పశ్చిమ బెంగాల్, ఢిల్లీలో రూ.మూడు వేలు, హరియాణా, కర్ణాటకలో రూ.4 వేలు, కేరళలో రూ.5 వేలు, తెలంగాణలో రూ.7,500 చొప్పున ఇస్తున్నారు. కాగా, ఆశా వర్కర్ల పదవీ విరమణ వయసును పెంచుతూ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాన్ని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ హర్షించారు. ఈ నిర్ణయం ఆరోగ్య రంగంపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఆశా వర్కర్లకు గ్రాట్యూటీని అందిస్తున్న తొలి రాష్ట్రంగా ఆంధ్రా నిలవనున్నదని తెలిపారు.

కరణం రాహుల్ హత్యకు సూత్రధారులు 'పెద్దిరెడ్డి'

» చేయించింది తలశిల రఘురామ్, వెలంపల్లి శ్రీనివాస్

» కోగంటి సత్యం, కోరాడ విజయకుమార్‌ల సంచలన ఆరోపణ



విజయవాడ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో సంచలనం సృష్టించిన, 2021లో జరిగిన పారిశ్రామిక వేత్త కరణం రాహుల్ హత్య కేసులో సూత్రధారులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి. హత్య చేయించింది తలశిల రఘురామ్, వెలంపల్లి శ్రీనివాస్. ఆ కేసులో మేం నిర్దోషులం. కావాలనే మమ్మల్ని ఇరికించారు' అని పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ కోరాడ విజయ్‌కుమార్ ఆరోపించారు. శనివారం విజయవాడ కృష్ణలంకలో వారు మీడియాతో మాట్లాడారు. 'పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో కలిసి ఫ్యాక్టరీ నిర్మాణానికి రాహుల్ రూ.40 కోట్లతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. దానిలో గొడవల కారణంగానే హత్య జరిగింది. ఈ సమాచారం సేకరించడానికి మాకు చాలా సమయం పట్టింది. ఈ హత్య చేసింది మేం కాదని ఆనాటి సీఎం జగన్‌కు, హోం మంత్రికీ వినతిపత్రాలు ఇచ్చాం. హత్యలో పాల్గొన్నవారిని మీడియా ముందు ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. వారి ప్రాణాలకు హాని తలపెడతారని భయంగా ఉంది. రాహుల్ తండ్రి సైతం కేసును సీబీఐకి ఇవ్వాలని హైకోర్టులో రిట్ వేశారు. కేసును సీఐడీకి గాని, సీబీఐకి గాని ఇచ్చి పునర్విచారణకు ఆదేశించాలి. వైసీపీ నేతలకు, ఆనాటి విజయవాడ సీపీ బత్తిన శ్రీనివాసులుకు మధ్య జరిగిన ఫోన్ సంభాషణలను బయటకు తీస్తే నిజానిజాలు నిగ్గు తేలతాయి. పోలీసులు మాపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. ఆ వీడియోను ఆనాటి మంత్రులకు పంపారు. ఈ కేసును పోలీసులతో పాటు ఈడీ, ఐటీ కూడా పరిశోధించాలి' అని కోగంటి, కోరాడ డిమాండ్ చేశారు.



సంతకం చేసే వరకు కొట్టారు!

అఫిడవిట్‌లో ఏం రాశారో నాకు తెలియదు

సత్యవర్ధన్ వాంగ్మూలంలో ప్రధానాంశాలు

విజయవాడ, మార్చి 1(ఆంధ్రజ్యోతి):'నేను హైదరాబాద్‌లో ఉంటున్నాను. గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసు నుంచి తప్పుకోవాలని వల్లభనేని వంశీ అనుచరులు పదేపదే ఫోన్లు చేసి బెదిరించారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చాను. ఫోన్ చేసి నన్ను ఆయుష్ ఆస్పత్రి వద్దకు పిలిపించారు. అక్కడి నుంచి భీమవరపు యెతేంద్ర రామకృష్ణ, ఎర్రంశెట్టి రామకృష్ణ మరికొంతమంది నన్ను బలవంతంగా కారులో ఎక్కించుకుని హనుమాన్ జంక్షన్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఒక గదిలో బంధించి తెల్లకాగితంపై సంతకం చేయాలని ఒత్తిడి చేశారు. నిరాకరించడంతో తీవ్రంగా కొట్టారు. నేను సంతకం చేసిన తర్వాత దానిపై వాళ్లే ఏదో రాసుకున్నారు' అని ముదునూరి సత్యవర్ధన్ న్యాయాధికారికి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నట్టు తెలిసింది. బెదిరించి, దాడి చేయడంతోనే గతనెల 10న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టులో గన్నవరం కేసుతో సంబంధం లేదని చెప్పానని అంగీకరించినట్టు సమాచారం. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని అరెస్టు చేసిన తర్వాతే సత్యవర్ధన్ న్యాయాధికారి ముందు సీఆర్పీసీ 164 ప్రకారం వాంగ్మూలం ఇచ్చిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన కాపీని న్యాయస్థానం నుంచి పోలీసులు తీసుకున్నారు. 'హనుమాన్‌జంక్షన్‌లో వేధింపులకు గురిచేయడంతో వారు చెప్పినట్టు చేశా. 10న ఎర్రంశెట్టి రామాంజనేయులు(తేల్దపోలు రాము) కారులో నన్ను విజయవాడలోని కోర్టుకు తీసుకొచ్చారు. ఆయుష్ ఆస్పత్రి నుంచి హనుమాన్ జంక్షన్‌కు యెతేంద్ర రామకృష్ణ, ఎర్రంశెట్టి రామకృష్ణ తీసుకెళ్లారు. అక్కడ కొమ్మా కోట్లు, ఘంటా వీర్రాజుతోపాటు మరికొంతమంది ఉన్నారు. కోర్టుకు వచ్చిన తర్వాత వారు ఇచ్చిన కాగితాన్ని న్యాయాధికారికి ఇవ్వమని ఆదేశించారు. కోర్టులో ఈ పని పూర్తవ్వగానే ఏ మార్గంలో కిందికి దిగాలో వాళ్లే సూచించారు. కిందికి దిగగానే రామాంజనేయులు కారులో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. కారును నేరుగా వంశీ నివాసం ఉంటున్న మైహోం భూజాకు తీసుకెళ్లారు. నేను పారిపోకుండా వంశీ అనుచరులంతా చుట్టుముట్టారు. లిఫ్ట్‌లో 11వ అంతస్తులో ఉన్న వంశీ ఫ్లాట్‌కు తీసుకెళ్లారు. 10న రాత్రంతా వంశీ ఫ్లాట్‌లోనే ఉంచారు. మర్నాడు కారులో ఖమ్మం మీదుగా వైజాగ్‌కు తీసుకెళ్లారు. అక్కడ వంశీకి స్నేహితుడైన చేబ్రోలు శ్రీను గెస్ట్‌హౌస్‌లో బంధించి ఉంచారు' అని వాంగ్మూలం ఇచ్చినట్టు తెలిసింది. కారులో హైదరాబాద్‌కు తీసుకెళ్లినప్పుడు వేలూరి వంశీబాబు ఉన్నాడని చెప్పినట్టు సమాచారం. ఆస్పత్రి తనను నుంచి కిడ్నాప్ చేయడంలో వంశీ ప్రధాన అనుచరులైన కొమ్మా కోట్లు, ఓలుపల్లి మోహనరంగారావు కీలకంగా పనిచేశారని న్యాయాధికారికి వాంగ్మూలం ఇచ్చినట్టు విశ్వసనీయంగా తెలిసింది.



పోసాని కృష్ణ మురళిని రాజంపేట సబ్‌జైలు నుంచి కడప రిమ్స్‌కు తరలిస్తున్న పోలీసులు

డాక్టర్.. గుండెనొప్పి అమ్మో.. కడుపునొప్పి

» సార్.. కేన్సర్ ఉందేమో.. కడప రిమ్స్‌లో పోసాని 'ఆపసోపాలు'

» ఏమీ లేదని తేల్చిన వైద్యులు.. తిరిగి రాజంపేట సబ్‌జైలుకు తరలింపు

రాజంపేట/కడప, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్‌లో నటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళీ నానా 'ఆపసోపాలు' పడ్డారు. గుండెలో నొప్పి అని ఒకసారి.. కడుపునొప్పి అంటూ ఇంకోసారి.. కేన్సర్ కావచ్చునని మరోసారి వైద్యులను టెన్షన్ పెట్టారు. చివరకు.. పోసానికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని వైద్యులు తేల్చేశారు. వైసీపీ హయాంలో చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌ను, వారి కుటుంబసభ్యులను తీవ్ర పదజాలాలతో దూషించిన కేసులో పోసానికి కోర్టు 14రోజుల రిమాండ్ విధించింది. తనకు గుండెలో నొప్పిగా ఉందని శనివారం మధ్యాహ్నం జైలు సూపరింటెండెంట్ మల్‌రెడ్డికి తెలియజేశారు. వెంటనే పోసానిని రాజంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఈసీజీ, రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసీజీలో స్వల్ప తేడా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ గుండెలో నొప్పిగా ఉన్నదంటే పరీక్షలు చేశారు. అంతా నార్మల్‌గా ఉందని తేలింది. స్కానింగ్‌లో కిడ్నీలో చిన్న సైజు రాయి ఉన్నట్టు గుర్తించారు. అది మాత్రలతో కరిగిపోతుందని వైద్యులు తెలిపారు. ఇటీవల కేన్సర్ ఉందనే అనుమానంతో టెస్ట్ చేయించుకున్నానని, మళ్లీ చెకప్ చేయాలనగా, వైద్యులు టెస్టులు చేసి ఎలాంటి ఆరోగ్య సమస్యలూ లేవని తేల్చారు. ఇలా మూడు గంటలకుపైగా పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రిలో ఉంచి వైద్యసేవలు అందించాల్సిన అవసరం లేదని వైద్యులు తేల్చడంతో.. తిరిగి రాజంపేట సబ్‌జైలుకు తరలించారు. కడుపునొప్పి, ఛాతీలో నొప్పిగా ఉందంటే కడప రిమ్స్‌కు తీసుకువెళ్లామని, అతనికి ఆరోగ్య సమస్యలేమీ లేవని వైద్యులు చెప్పారని రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కేవలం నాటకం ఆడారని విమర్శించారు. కాగా, శనివారం ఉదయం ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి సబ్‌జైలుకు వచ్చి పోసానిని ములాఖత్‌లో కలిశారు. రెండు ములాఖత్‌ల పరిమితి ముగియడంతో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులును అనుమతించలేదు. దీంతో ఆయన సబ్‌జైలు వద్ద హల్‌చల్ సృష్టించారు.

అరెస్ట్ చేస్తారని భయంగా ఉంది

» ముందస్తు బెయిల్ ఇవ్వండి.. హైకోర్టును ఆశ్రయించిన సజ్జల

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నటుడు పోసాని కృష్ణమురళి ఇచ్చిన వాంగ్మూలం నేపథ్యంలో పోలీసులు అరెస్టు చేస్తారనే భయంతో వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు భార్గవ్‌రెడ్డి హుటాహుటిన హైకోర్టును ఆశ్రయించారు. తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. సజ్జల ఇచ్చిన స్క్రిప్ట్, ప్రోత్సాహంతోనే సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా వారి కుటుంబ సభ్యులు, కమ్మ సామాజికవర్గంపై అసభ్య పదజాలంతో దూషించానని సినీ నటుడు పోసాని ఇచ్చిన నేర అంగీకార స్టేట్‌మెంట్ సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు తమను అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉందని సజ్జల రామకృష్ణారెడ్డి, భార్గవ్‌రెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు. పోసానిని మొదటి నిందితుడిగా పేర్కొంటూ ఓబుళవారిపల్లె పోలీసులు నమోదు చేసిన కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు.

బడ్జెట్ అంచనాల్లో నిజాయితీ లేదు: రాఘవులు

విజయవాడ, అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మాటల కోతలు, నిధుల కోతలు తప్ప ప్రజలకు ప్రాధాన్యం లేదు. బడ్జెట్ అంచనాల్లో నిజాయితీ లేదు' అని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. 'పార్లమెంటు సీట్ల పునర్విభజనపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన మోసపూరితం. ఏపీతో సహా దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గించబోమన్న మాటల్లో నిజాయితీ లేదు. అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఉమ్మడి అభిప్రాయం మేరకు ఆమోదయోగ్యమైన ప్రక్రియ చేపట్టాలి' అని రాఘవులు డిమాండ్ చేశారు.

నిధులు లేకున్నా భారీ బడ్జెట్: రామకృష్ణ

అంబాజీపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వం భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ప్రజలను మోసగించింది. నిధులు లేనప్పటికీ బడ్జెట్‌లో లెక్కలు మాత్రం భారీగా చూపారు' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో కామ్రేడ్ నేలపూడి సూరన్న 30వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'గతంలో ఎప్పుడు ఇంత బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం చూడలేదు. సూపర్ సిక్స్ పథకాల అమలుపై మాటలు తప్ప ఆచరణ లేదు' అని రామకృష్ణ విమర్శించారు.

పూర్తికాని వెలిగొండ జాతికి అంకితమా: నిమ్మల

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): 'పూర్తికాని వెలిగొండ ప్రాజెక్టును సీఎం హోదాలో జాతికి అంకితమిచ్చిన జగన్‌ను జనం క్షమించరు. ప్రాజెక్టును పూర్తిచేయకుండానే ప్రారంభోత్సవం చేసినందుకు జాతికి జగన్ క్షమాణ చెప్పాలి' అని మంత్రి నిమ్మల రామానాయుడు డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసి ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఫ్లోరైడ్ బాధలను నివారించాలని సీఎం చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు.

బడ్జెట్‌పై వైసీపీ నేతల దుష్ప్రచారం: అనురాధ

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే మెరుగైన బడ్జెట్‌ని ప్రవేశపెడితే.. వైసీపీ నేతలు తప్పుడు లెక్కలతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీ, మండలిలో చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ విమర్శించారు. ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేసినా జగన్‌కు బుద్ధి రాలేదన్నారు. బడ్జెట్ కేటాయింపుల విషయంలోనూ వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని, ఆ పార్టీ పుట్టుకే అబద్ధాల పునాదులపై జరిగిందని దుయ్యబట్టారు.

బడ్జెట్‌లో మహిళలకు పెద్దపీట: పీతల సుజాత

వైసీపీ హయాంలో మహిళా సంక్షేమానికి నామమాత్రపు కేటాయింపులు చేసి, వారు దాచుకున్న సొమ్మునూ దోచుకున్నారని మాజీమంత్రి పీతల సుజాత విమర్శించారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో మహిళలకు పెద్దపీట వేస్తే వైసీపీ నేతలు విమర్శించడం సిగ్గుచేటన్నారు. డ్వాక్రా మహిళలు దాచుకున్న రూ.2,100కోట్ల అభయహస్తం నిధులు దారి మళ్లించిన ఘనత, అమ్మఒడి రూ.13వేలు ఇచ్చి నాన్న బుడ్డీతో రూ.70వేలు దండుకుని పచ్చని కుటుంబాల్లో చిచ్చుపెట్టిన ఘనత జగన్‌దని దుయ్యబట్టారు.

పవన్‌పై నోరు పారేసుకుంటే సహించం


» అలా మాట్లాడినందుకే ఒకరు జైల్లో ఉన్నారు

» పవన్‌ను విమర్శించే హక్కు ఎవరికీ లేదు: నాదెండ్ల

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 1(ఆంధ్రజ్యోతి): నోరుంది కదా అని తమ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని, అలా మాట్లాడినందుకే ఒక వ్యక్తి జైల్లో ఉన్నారని జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడలో జనసేన ఆవిర్భావ సభ ఈనెల 14న నిర్వహించనున్నారు. సభా వేదిక ఏర్పాటుకు శనివారం అక్కడ భూమి పూజ చేశారు. అంతకుముందు కాకినాడ కుళాయిచెరువు కళాక్షేత్రంలో జనసేన పార్టీ ఆవిర్భావ సభ సన్నాహక సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మాట్లాడుతూ 100శాతం స్ట్రైక్ రేట్‌తో గెలిచిన తర్వాత నిర్వహిస్తున్న మొదటి సభ కావడంతో యావత్ దేశం చూపు పిఠాపురం సభపై ఉందని, దీన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభ నిర్వహణకు 14 కమిటీలు వేశామని, ఒకరితో ఒకరు సమన్వయం చేసుకోవాలని సూచించారు. పవన్‌కల్యాణ్ ప్రజాదరణను ఓర్చుకోలేక ఆయన్ను దూషించడం కొందరికి ఫ్యాషన్ అయిపోయిందని, ఇప్పుడు ఎమ్మెల్సీగా వ్యవహరిస్తున్న వ్యక్తి కూడా ఎలా వ్యవహరిస్తున్నారో చూస్తున్నామని పరోక్షంగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అతడికి కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు. 2014లో జనసేన స్థాపించినప్పటి నుంచి పవన్ సొంత రెక్కలతో పార్టీని ముందుకు నడిపారన్నారు. ఆయన ఎప్పుడూ రాజకీయలబ్ధి కోసం పనిచేయలేదని, మానవత్వం, నిజాయితీతో కూడిన ప్రయాణం మాత్రమే చేశారని, ఆయన్ను విమర్శించే హక్కు ఎవరికీ లేదన్నారు. అధినేత పవన్‌కల్యాణ్‌ను ఎవరైనా కించపరిచేలా మాట్లాడితే జనసైనికులు, వీర మహిళలు ఖండించాలన్నారు. దానికి ప్రజలు ఆమోదించే భాషనే ఉపయోగించాలని సూచించారు.

అందరినీ గుర్తిస్తారు..

కూటమిలో ఉన్న మూడు పార్టీలు సమానమేనని, కలిసికట్టుగా పనిచేస్తేనే ఇంతటి ఘనవిజయం సాధించామని చెప్పారు. పార్టీ గురించి పనిచేసిన అందరి గురించి పవన్‌కల్యాణ్‌కు తెలుసునని, సరైన సమయంలో ఇవ్వాల్సిన గుర్తింపు ఇస్తారని నాదెండ్ల తెలిపారు. సభ నిర్వహణకు ఇప్పటికే కమిటీలు ఏర్పాటు చేశామని, కమిటీలో పేర్లు లేకపోయినా ఆసక్తి ఉన్నవారు ఆ కమిటీలతో కలిసి పనిచేయవచ్చని సూచించారు. కమిటీల్లోని సభ్యులంతా సమన్వయంతో పని చేసి పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో 14న జరిగే జనసేన పార్టీ ఆవిర్భావసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు జనసేనపైనే ఉందన్నారు. నిష్కలంకమైన నాయకుడు పవన్‌కల్యాణ్ ఆలోచన ద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ హరిప్రసాద్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, సహా జనసేన ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.



కాకినాడలో జనసేన ఆవిర్భావ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్



కాపాడిన చిన్నారులతో విజయవాడ సీపీ రాజశేఖరబాబు, సిబ్బంది

పిల్లల్ని అమ్మే ముఠా అరెస్టు

» ఉత్తరాదిలో కొనుగోలు..విజయవాడలో విక్రయాలు

» మొత్తం ఏడుగురు శిశువులను తెచ్చినట్టు గుర్తింపు

» ముగ్గురు చిన్నారులను కాపాడిన పోలీసులు

» పట్టుబడిన ఐదుగురు మహిళలు

విజయవాడ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఉత్తరాది నుంచి చిన్నపిల్లలను కొనుగోలు చేసి విజయవాడకు తీసుకొచ్చి విక్రయిస్తున్న మహిళల ముఠాను విజయవాడ పోలీసులు పట్టుకున్నారు. ఐదుగురు మహిళలను అరెస్టు చేసి ముగ్గురు శిశువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు శనివారం విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. విజయవాడ సితార సెంటర్‌కు చెందిన బగలం సరోజిని గతంలో ఓ సంతాన సాఫల్య కేంద్రంలో పనిచేసింది. అక్కడ అండాలను దానం చేయించి కమీషన్లు తీసుకుంది. ఆ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఒక మహిళ పరిచయమైంది. ఆమె ఢిల్లీ యువతి ప్రీతి కిరణ్, అహ్మదాబాద్ వ్యక్తి అనీల్‌లను సరోజినికి పరిచయం చేసింది. ఉత్తరాది నుంచి ఆడ శిశువును రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షలకు, మగ శిశువును రూ.4 లక్షల నుంచి రూ.4.50 లక్షలకు సరోజిని కొనుగోలు చేసేది. మరో రూ.50 వేలు లాభం వేసుకుని సంతానం లేని దంపతులకు ఆ పిల్లలను విక్రయించేది. ఉత్తరాది నుంచి ఏడుగురు శిశువులను తెచ్చినట్టు పోలీసులు గుర్తించారు. వారిలో నలుగురిని ఇప్పటికే విక్రయించేశారు. మరో ముగ్గురిని విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ముఠాను పోలీసులు అరెస్టు చేసి, రూ.4 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు శిశువులను బాలల సంరక్షణ కేంద్రానికి అప్పగించారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో విక్రయించిన నలుగురు శిశువులనూ త్వరలో తీసుకొచ్చి బాలల సంరక్షణ కేంద్రంలో అప్పగిస్తామని చెప్పారు. కాగా, సరోజినిపై హైదరాబాద్‌లోని మేడిపల్లి పోలీసుస్టేషన్లో పలు కేసులు ఉన్నాయి. హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసినప్పుడు 40 మంది శిశువులను విక్రయించినట్టు అంగీకరించింది.

అబ్బే.. ఆ రోజు మేము షాపులో లేమండీ!

» ఏకసభ్య కమిషన్‌కు ముఖం చాటేస్తున్న బైరాగిపట్టెడ దుకాణదారులు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 1(ఆంధ్రజ్యోతి): జనవరి 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్‌కు సాక్ష్యం చెప్పడానికి దుకాణదారులు ఆసక్తి కనబరచడం లేదు. 'బైరాగిపట్టెడ పార్కు వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో మీరు కళ్లారా చూసింది చూసినట్టు చెప్పండి.. మీకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవు' అంటూ వీఆర్వోలు, ఏకసభ్య న్యాయవిచారణ కమిషన్ సిబ్బంది విజ్ఞప్తి చేయగా.. 'అబ్బే ఆ రోజు మేము షాపులో లేము' అని కొందరు.. షాపులు మూసివేశామని మరికొందరు.. జనాలు ఎక్కువ ఉండడంతో ఇంటికి వెళ్లి పోయామని ఇంకొందరు బదులిచ్చారు. వాంగ్మూలం ఇస్తే తర్వాత ఎక్కడ ఇబ్బంది పడాల్సి వస్తుందోనని వారు ముఖం చాటేస్తున్నారని తెలిసింది. తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై నిజనిర్ధారణకు నెల రోజులుగా ఏకసభ్య కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే.

ఏయూలో మాజీ ఉన్నతాధికారి ఇష్టారాజ్యం!

» కుమారుడి కోసం స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం తాజా మాజీ ఉన్నతాధికారి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. వర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా ఎంటెక్ విద్యార్థులకు స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించినట్టు తెలిసింది. 'ఎం-ప్లానింగ్' చేస్తున్న తన కుమారుడి కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. ఈ విషయాన్ని వీసీగా శనివారం బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ దృష్టికి తీసుకువెళ్లేందుకు కొందరు సిద్ధమైనట్టు చెబుతున్నారు. సదరు మాజీ ఉన్నతాధికారి కుమారుడు ఎంటెక్‌లో కీలకమైన కోర్సులో చేరాడు. అతను పరీక్ష ఫీజు చెల్లించకపోవడంతో సప్లిమెంటరీ రాసే అవకాశం లేకుండా పోయింది. ఎట్టి పరిస్థితుల్లోనూ కుమారుడు కోర్సు పూర్తిచేయాలన్న ఉద్దేశంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా స్పెషల్ సప్లిమెంటరీ పేరుతో రీ రిజిస్ట్రేషన్ లేకుండానే పరీక్షలు రాసే అవకాశం కల్పించారు. అందుకోసం అసిస్టెంట్ ప్రిన్సిపాల్‌తో ప్రత్యేకంగా లేఖ రాయించినట్టు చెబుతున్నారు. ఈ లేఖ విషయంలో నిబంధనలు పాటించలేదని తెలుస్తోంది. గతేడాది సెప్టెంబరు, డిసెంబరులో ఈ స్పెషల్ సెమిస్టర్1, సెమిస్టర్ 2కు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. సాధారణంగా ఉన్నతాధికారులకు సంబంధించిన కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరైనా ఉంటే కీలక నిర్ణయాలకు అధికారులు దూరంగా ఉంటారు. అయితే, సదరు మాజీ అధికారి మాత్రం నిబంధనలను పూర్తిగా విస్మరించారు. ఈ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు సుమారు 75మంది వరకు విద్యార్థులు హాజరైనట్టు చెబుతున్నారు. ఈ పరీక్షలు రాసిన కొందరు విద్యార్థుల పేపర్లకు నాలుగుసార్లు రీవాల్యూయేషన్ చేసినట్టు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అవకాశం లేదు. ఒకవేళ విద్యార్థుల అవసరాన్ని బట్టి అధికారులు నిర్ణయం తీసుకుంటే దానికి ఫీజు అదనంగా (ఒక్కో సబ్జెక్టుకు సుమారు రూ.15వేలు) చెల్లించాల్సి ఉంటుంది. కానీ, స్పెషల్ సప్లిమెంటరీకీ సాధారణ ఫీజులే వసూలుచేశారు.



సర్.. 'ఫోన్ పే' ప్లీజ్!

గుంటూరులో హైటెక్ భిక్షాటన

ఫ్లెక్సీలతో తమిళ మహిళ యాచన

కాలానికి అనుగుణంగా సమాజంలో పలు మార్పులు వస్తున్నాయి. ముఖ్యంగా నగదు లావాదేవీల వ్యవహారంలో మరిన్ని మార్పులు మార్పులు వచ్చాయి. 5 రూపాయల టీకి కూడా ఫోన్ పే, గూగుల్ పేలు అందుబాటులో ఉన్నాయి. దీంతో ఎవరూ చిల్లర దగ్గర ఉంచుకోవడంలేదు. దీనిని గుర్తించిన కొందరు యాచకులు.. తమ శైలిని మార్చుకుంటున్నారు. 'చిల్లర లేదు' అన్న మాట రాకుండా.. వారు కూడా డిజిటల్ పేమెంట్ల బాట పట్టారు. ఫేన్ పే, గూగుల్ పే వంటి డిజిటల్ మాధ్యమాలను వినియోగించి యాచన చేస్తున్నారు. తమిళనాడుకు చెందిన ఓ మహిళ విభిన్న ప్రతిభావంతుడైన కుమారుడు విక్రమ్‌ను తీసుకొని గుంటూరు నగరంలో డిజిటల్ భిక్షాటన చేస్తున్న వైనం ఆకర్షిస్తోంది. బిడ్డ పరిస్థితిని వివరించేందుకు తనకు తెలుగు రాకపోవడంతో ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన ఆమె దీనిలోనే భిక్షాటన కింద నగదు చెల్లింపు కోసం గూగుల్ పే, ఫోన్ పే స్కానర్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఆమెను చూసిన వారు 'చిల్లర లేదు' అని చెప్పి తప్పించుకోవడానికి వీల్లేకుండా అంతో ఇంతో ఫోన్ చేస్తున్నారు. - గుంటూరు, (ఆంధ్రజ్యోతి)



గూగుల్ పే, ఫోన్ పే కు సంబంధించిన స్కానర్‌తో ఫ్లెక్సీ



ఉపాధ్యాయుల బదిలీలకు చట్టం

ఇకపై ఏటా వేసవిలోనే బదిలీల ప్రక్రియ .. టీచర్లకు ఐదేళ్లు దాటితే తప్పనిసరి బదిలీ

» నాలుగు కేటగిరీల్లో ప్రాధాన్యతా పాయింట్లు

» టీచర్ల పనితీరుకూ ప్రత్యేకంగా కేటాయింపు

» ముసాయిదా విడుదల

» 7 వరకు ఆన్‌లైన్‌లో సూచనలు స్వీకరణ

» ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే సభలో బిల్లు

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళానికి ముగింపు పలకడానికి రంగం సిద్ధమైంది. టీచర్ల బదిలీలు నిర్దేశిత సమయంలో వివాదరహితంగా జరగాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా ఉపాధ్యాయ బదిలీల చట్టం తీసుకొస్తోంది. దీనిపై ఉపాధ్యాయ సంఘాల నుంచి అభిప్రాయాలు స్వీకరించి, సుదీర్ఘంగా కసరత్తు చేసిన పాఠశాల విద్యాశాఖ.. శనివారం ముసాయిదాను విడుదల చేసింది. దీనికి 'ఏపీ రాష్ట్ర ఉపాధ్యాయ బదిలీ నియంత్రణ చట్టం-2025' అని పేరు పెట్టింది. ఈ నెల 7వరకు దీనిపై సూచనలు ఆన్‌లైన్‌లో పంపాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయ రామరాజు కోరారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లును సభలో ప్రవేశపెడతారు. దానికి ఆమోదం లభించినగానే ఈ విద్యా సంవత్సరం నుంచే బదిలీల చట్టం అమల్లోకి వస్తుంది. ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో మాత్రమే టీచర్ల బదిలీలు జరుగుతాయి. అలాగే వివిధ అంశాలపై న్యాయవివాదాలు ఏర్పడే అవకాశం తగ్గుతుంది. నిర్దేశిత సమయంలో బదిలీల ప్రక్రియ పూర్తవడం వల్ల విద్యాసంవత్సరంపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదు.

చట్టంలోని అంశాలివీ...

బదిలీలకు విద్యా సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకుంటారు. ఒక స్టేషన్‌లో ప్రధానోపాధ్యాయుడు/ ఉపాధ్యాయుడు 9నెలలు దాటి పనిచేస్తే దానిని ఒక విద్యా సంవత్సరంగా పరిగణిస్తారు. ఒకే చోట ఐదేళ్లు దాటిన హెచ్ఎంలకు, 8ఏళ్లు దాటిన టీచర్లకు బదిలీ తప్పనిసరి. ఒక పాఠశాలలో కనీసం రెండేళ్లు పని చేస్తే బదిలీలకు అర్హుల జాబితాలోకి వస్తారు. బదిలీలకు ప్రాంతాల వారీగా నాలుగు కేటగిరీలు ఉంటాయి. కేటగిరీ-1లో జిల్లా కేంద్రాలు, నగర కార్పొరేషన్, ప్రభుత్వం నోటిపై చేసిన ప్రాంతాలు, కేటగిరీ-2లో మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, కేటగిరీ-3లో మండల కేంద్రాలు, రోడ్డు సదుపాయం కలిగిన గ్రామాలు, కేటగిరీ-4లో రోడ్డు సదుపాయం లేని గ్రామాలు, కొండ ప్రాంతాలు ఉంటాయి. టీచర్ల మొదటి నియామకం లేదా హెచ్ఎంగా పదోన్నతి పొందిన తర్వాత మొదటి పోస్టింగ్‌ను 3, 4 కేటగిరీ ప్రాంతాల్లో ఇస్తారు. బదిలీల సమయానికి రెండేళ్లలోపు మాత్రమే సర్వీసు ఉన్నవారిని కోరుకుంటేనే బదిలీ చేస్తారు. 50ఏళ్ల కంటే తక్కువ వయసున్న హెచ్ఎంలు, టీచర్లు బాలికల ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తుంటే తప్పనిసరిగా బదిలీ చేస్తారు. బాలికల ఉన్నత పాఠశాలలకు మహిళా హెచ్ఎంలు, టీచర్లను నియమిస్తారు. వారు అందుబాటులో లేకపోతే 50ఏళ్లు దాటిన పురుష టీచర్లను నియమిస్తారు. లైంగిక నేరాలు, బాలికల అంశాల్లో ఆరోపణలున్న పురుష టీచర్లకు బాలిక ఉన్నత పాఠశాలల్లో పోస్టింగ్ ఇవ్వరు. హెచ్ఎంలు, టీచర్లపై నమోదైన అభియోగాలు పెండింగ్‌లో ఉంటే బదిలీలకు పరిగణలోకి తీసుకోరు. వెబ్ కౌన్సిలింగ్ ద్వారానే బదిలీల ప్రక్రియను నిర్వహిస్తారు.

ప్రాధాన్యతా పాయింట్ల కేటాయింపు ఇలా..

ప్రస్తుత పాఠశాల ప్రామాణికంగా కేటగిరీ-1లో ఉన్న టీచర్లకు ఏడాదికి ఒక పాయింట్, కేటగిరీ-2లో ఉన్నవారికి 2 పాయింట్లు, కేటగిరీ-3లో ఉన్నవారికి 3 పాయింట్లు, కేటగిరీ-4లో ఉన్నవారికి ఏడాదికి 5 పాయింట్లు ఇస్తారు. బదిలీలు జరిగే సంవత్సరం మే 31 నాటికి అన్ని కేడర్లలో కలిపి సర్వీసులోని ప్రతి సంవత్సరానికి ఒక పాయింట్ ఇస్తారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, ఎయిడెడ్ సంస్థల్లో ఉద్యోగం చేస్తున్న వారి జీవిత భాగస్వామి అయిన టీచర్లకు ప్రత్యేక పాయింట్లు లభిస్తాయి. 40ఏళ్లు దాటిన అవివాహిత మహిళా టీచర్లు, దివ్యాంగులు, గుర్తించిన వ్యాధులు కలిగినవారు, వితంతువులు, ఒంటరి మహిళలు, మాజీ సైనికుల జీవిత భాగస్వాములు, స్కౌట్స్ అండ్ గైడ్స్‌గా పనిచేస్తున్న వారికీ ప్రత్యేక పాయింట్లు ఉంటాయి. అలాగే టీచర్ల పనితీరు ఆధారంగా కూడా పాయింట్లు కేటాయిస్తారు. అనధికారికంగా విధులకు హాజరు కానివారికి గైర్హాజరైన ప్రతి నెలకు ఒక పాయింట్ చొప్పున గరిష్ఠంగా 10 ప్రతికూల పాయింట్లు ఇస్తారు.

టీచర్ల సర్దుబాటు

మిగులు టీచర్లను అవసరం మేరకు సర్దుబాటు చేస్తారు. సెక్షన్-7 ప్రకారం సంవత్సరంలో ఒకసారి మాత్రమే సాధారణ బదిలీలు చేస్తారు. ఏటా బదిలీలకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేస్తుంది. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమందికి సమానమైన పాయింట్లు వస్తే కేడర్‌లో సీనియారిటీ, పుట్టిన తేదీ, మహిళలను ప్రాధాన్యత క్రమంలో తీసుకుంటా రు. విద్యా హక్కు చట్టం ప్రకారం టీచర్లకు జనా భా లెక్కలు, విపత్తుల సమయంలో సహాయ పనులు, ఎన్నికల విధులు తప్ప ఇంకేవీ కేటాయించరు. ఈ చట్టం విద్యాశాఖ పరిధిలోని మోడల్ స్కూళ్లు, గురుకుల సొసైటీలు, కేజీబీవీలకు వర్తించదు.

హరీశ్ కుమార్ గుప్తాకే చాన్స్?

» పూర్తిస్థాయి డీజీపీ ఎంపిక ప్రక్రియ ప్రారంభం

» కేంద్రానికి ఏడు పేర్లు పంపిన రాష్ట్ర ప్రభుత్వం

» జాబితాలో రాజేంద్రనాథ్ రెడ్డి, పీఎస్ఆర్ ఆంజనేయులు పేర్లు కూడా..

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రానికి పూర్తిస్థాయి డీజీపీ నియామక ప్రక్రియ మొదలైంది. యూపీఎస్సీ ద్వారా పోలీసు బలగాల అధిపతి(హెచ్ఓపీఎఫ్) ఎంపికకు ఫైలు కదిలింది. ఐపీఎస్ అధికారిగా కనీసం 30 ఏళ్ల సర్వీస్ ఉన్న ఏడుగురు డీజీపీ ర్యాంకు అధికారుల పేర్లను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపింది. ప్రస్తుతం రాష్ట్ర కేడర్ ఐపీఎస్‌లలో అంజనీ కుమార్(1990) అత్యంత సీనియర్ కాగా, తర్వాతి స్థానంలో మాదిరెడ్డి ప్రతాప్(1991) ఉన్నారు. ప్రస్తుత ఇన్‌చార్జి డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతోపాటు కసిరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డి, పీఎస్ఆర్ ఆంజనేయులు 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారులు. ఆ తర్వాతి బ్యాచ్‌కు చెందిన నళిన్ ప్రభాత్, అమిత్ గార్గ్ పేర్లను కూడా ప్యానల్ జాబితాలో పొందుపరిచినట్లు సమాచారం. సుప్రీంకోర్టు తీర్పు మేరకు పూర్తిస్థాయి డీజీపీని నియమించాలంటే యూపీఎస్సీ ద్వారా ఎంపిక జరగాలి. రాష్ట్రంలో గత కొద్ది కాలంగా పోలీస్ బాస్ పోస్టులు ఎఫ్ఏసీ(పూర్తిస్థాయి అదనపు బాధ్యతల)తో ఉంటున్నాయి. ప్రస్తుత డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా సైతం విజిలెన్స్ డీజీగా ఉంటూ డీజీపీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇన్‌చార్జుల నుంచి పూర్తిస్థాయి డీజీపీ నియామకానికి మొగ్గు చూపిన రాష్ట్ర ప్రభుత్వం యూపీఎస్సీ ద్వారా డీజీపీని ఎంపిక చేసి రెండేళ్లపాటు కొనసాగించాలని భావిస్తోంది. ఏపీ ప్రభుత్వం పంపిన ప్యానెల్‌పై యూపీఎస్సీ ఎంపిక కమిటీ సమావేశమై ముగ్గురి పేర్లను రాష్ట్రానికి తిరిగి పంపి వారిలో ఒక్కరిని ఎంపిక చేసుకోవాలని సూచిస్తుంది. అందులో మెరిట్ ఆధారంగా హరీశ్ కుమార్ గుప్తా పేరు ఉంటుందని, మరో రెండేళ్లపాటు ఆయనకు అవకాశం లభిస్తుందని పోలీసు ఉన్నతస్థాయి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

భారీ ప్రాజెక్టులపై సోలార్ ప్యానళ్లు!

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎత్తిపోతల పథకాలకు సొంతంగా విద్యుదుత్పత్తి చేసుకోవడానికి గుజరాత్‌లోని నర్మదా సరోవర్ మోడల్‌ను రాష్ట్రంలో అమలు చేయాలని జల వనరుల శాఖ నిర్ణయించింది. ఆ మోడల్ అధ్యయనం కోసం రాష్ట్రం నుంచి ఇంజనీరింగ్ అధికారుల బృందం వెళ్లి ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికను అందజేసింది. దీనిపై ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు ఆ బృందంతో శనివారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. గుజరాత్‌లో భారీ నీటి ప్రాజెక్టుల నిర్వహణ, గట్లపై కరెంట్ ఉత్పత్తి గురించి ఆరా తీశారు. మధ్యప్రదేశ్, ఒడిశాల్లోనూ జల వనరుల శాఖ ఇంజనీర్లు పర్యటించారు. ఈ అధ్యయన నివేదికలను సమగ్రంగా పరిశీలించాక తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు.

కొలువుల పత్రాలు లేకున్నా జీతాలు!

ఫైబర్‌నెట్‌లో వెలుగు చూసిన అక్రమం.. సర్కారుకు ఇన్‌చార్జి ఎండీ నివేదిక

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఏదైనా నియామక ఉత్తర్వులు ఉండాల్సిందే. అక్రమాలకు నిలయమైన ఫైబర్‌నెట్‌లో నియామక ఉత్తర్వులు లేకుండా దాదాపు 200 మంది పనిచేస్తున్నట్టు తాజాగా తేలింది. మూడు రోజుల కిందట ఫైబర్‌నెట్ ఇన్‌చార్జి ఎండీ ప్రవీణ్ ఆదిత్య... మంత్రి బీసీ జనార్దనరెడ్డి, ఐ అండ్ ఐ శాఖ కార్యదర్శి యువరాజ్‌కు పంపిన సమగ్ర నివేదికలో ఈ విషయాన్ని పేర్కొన్నట్టు సమాచారం. సాధారణంగా అయితే వారిపై చర్యలు తీసుకోవాలి. జీతాలు ఆపేయాలి. చిత్రంగా... వారిని ఉద్యోగాల నుంచి తొలగించకపోగా, ఫిబ్రవరి నెల జీతాలు ఇవ్వడానికి ఇదివరకే బిల్లులు పెట్టారు. రేపో, మాపో జీతాలు కూడా పడనున్నాయి. 2019-24 మధ్య కాలంలో జరిగిన అక్రమాలపై ఉన్నతాధికారులు ఉద్దేశపూర్వకంగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలోనే నియామక ఉత్తర్వులు లేకుండా వీరిని ఉద్యోగాల్లో నియమించారు. ఫైబర్‌నెట్ అక్రమాలపై ఇటీవల పెద్ద రచ్చ జరిగిన సంగతి తెలిసిందే. సంస్థ ఎండీ దినేశ్ కుమార్‌పై చైర్మన్ జీవీ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేయడం... ఆ తర్వాత చైర్మన్ పదవికి, టీడీపీకి జీవీ రెడ్డి రాజీనామా చేయడం... అదే రోజు ఫైబర్ నెట్ ఎండీ పదవి నుంచి దినేశ్ కుమార్‌ను ప్రభుత్వం తొలగించడం... వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఫైబర్‌నెట్‌లో రచ్చ తర్వాత ఇన్‌చార్జి ఎండీ ప్రవీణ్ ఆదిత్య తాజాగా ప్రభుత్వానికి నివేదిక పంపారు. 2014-19 మధ్యకాలంలో 119 మంది అవుట్ సోర్సింగ్, 12 మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉండేవారని పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నివేదికలోని వివరాల ప్రకారం... టెరాసాఫ్ట్‌కు ఫైబర్‌నెట్ ఆపరేషనల్ నిర్వహణ బాధ్యత అప్పగించాక 495 మంది ఉద్యోగులను నియమించుకున్నట్టు తెలిపారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ పార్టీ కార్యకర్తలను ఫైబర్‌నెట్‌లో నింపేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య 119 నుంచి 617కు, కాంట్రాక్టు ఉంద్యోగుల సంఖ్య 542 నుంచి 725కు పెరగగా... మొత్తం 1,342 మంది ఉద్యోగులు అయ్యారు. నెలకు రూ.4,04,29,565 చొప్పున జీతభత్యాలను చెల్లించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 617 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను 295కు, కాంట్రాక్టు ఉద్యోగులను 725 నుంచి 630కి కుదించారు. మొత్తంగా ఉద్యోగులను 925కు కుదించి, జీతభత్యాలను రూ.2,53,78,577కు తగ్గించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 295 మందిలో 167 మందికి నియామక ఉత్తర్వులే లేవు' అని నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. నియామక ఉత్తర్వులు లేని ఉద్యోగులను తొలగించాలని చైర్మన్‌గా జీవీ రెడ్డి చేసిన సిఫారసులను నాటి ఎండీ దినేశ్ కుమార్ పట్టించుకోలేదు. ప్రభుత్వమూ వారిని తొలగించేందుకు సముఖత వ్యక్తం చేయడం లేదు.

అప్పులపై లెక్కల్లేవు

2014-19 మధ్యకాలంలో ఫైబర్‌నెట్ కార్యకలాపాల నిర్వహణ కోసం రూ.642 కోట్లు అప్పు చేశారు. కానీ సంస్థ పూర్తిగా నిలదొక్కుకున్నాక 2019-24 మధ్యకాలంలో ఏకంగా 892 కోట్ల రుణం తీసుకున్నారు. ఇందులో సార్వత్రిక ఎన్నికలకు ముందు సంవత్సరం 2023-24లో రూ.887.94 కోట్ల అప్పు చేశారు. ఈ రుణం మొత్తానికి అప్పటి ఫైబర్‌నెట్ యాజమాన్యం లెక్కాపత్రాలను చూపడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ లెక్కల జోలికి వెళ్లకపోవడంపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

హెల్మెట్ ఉండాల్సిందే

» బైకుపై వెనుక కూర్చున్న వారికీ తప్పనిసరి

» కొత్త మోటార్ వాహనాల చట్టం అమలు ప్రారంభం

అమరావతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్న ద్విచక్ర వాహనదారుల రక్షణకు పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ.. హైకోర్టు ఆదేశాలతో కేంద్రం తీసుకొచ్చిన కొత్త మోటార్ వాహనాల చట్టాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. శనివారం నుంచి విజయవాడ, విశాఖపట్నం లలో అమలు ప్రారంభించారు. విడతలవారీగా జిల్లాలు, గ్రామస్థాయిల్లో అమలు చేయాలని భావిస్తున్నారు. కొత్త నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చునే వ్యక్తికి కూడా హెల్మెట్ తప్పనిసరి. విశాఖలో గత సెప్టెంబరు నుంచి, విజయవాడలో డిసెంబరు నుంచి హెల్మెట్ ధారణపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. దీని ద్వారా అవగాహన పెరిగి, ఎక్కువ మంది హెల్మె ట్ ధరిస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రాలు, హైవేలపై తనిఖీలు చేపట్టాలని ఎస్పీలకు ఆదేశాలు అందాయి. జరిమానాల సమాచారాన్ని తెలియజేసేలా జిల్లా కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.

ఉల్లంఘన	జరిమానా (రూ.ల్లో)
హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే	1,000
వెనుక కూర్చున్న వ్యక్తికి హెల్మెట్ లేకపోతే	1,000
బీమా లేకుండా వాహనం నడిపితే	2,000 (మొదటిసారి) 4,000 (రెండోసారి)
లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే	5,000
హెవీ లైసెన్స్ ఉండాల్సిన వాహనాలకు	10,000
కాలుష్య ధ్రువీకరణ పత్రం లేకపోతే	1,500
ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే	1,500 (మొదటిసారి) 10,000 (రెండోసారి)
యూనిఫాం లేకుండా ఆటో నడిపితే	150 (మొదటిసారి) 300 (రెండోసారి)
సీటు బెల్టు ధరించకపోతే	1,000 (డ్రైవర్‌కు) 1,000 (కూర్చున్న వారికి)
ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్, రెన్యువల్ సర్టిఫికెట్ లేకపోతే	2,000 (మొదటిసారి) 5,000 (రెండోసారి)
అతివేగంగా వాహనం నడిపితే	1,000
ట్రిపుల్ రైడింగ్	1,000
రేసింగ్‌లు చేస్తే	5,000 (మొదటిసారి) 10,000 (రెండోసారి)

రబీ సాగు 85 శాతం

» 8 లక్షల ఎకరాల్లో తగ్గిన పంటలు

» తుఫాన్లు, ఖరీఫ్ కోతల ఆలస్యమే కారణం

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రబీ సీజన్ దాదాపు ముగిసింది. అయితే ఈ ఏడాది రబీ సాగు 85శాతమే నమోదైంది. 53.80 లక్షల ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణంలో 45.67 లక్షల ఎకరాల్లోనే పైర్లు పడ్డాయి. నవంబరు నుంచి రబీ సీజన్ ప్రారంభమైనా ఇప్పటికీ 8లక్షల ఎకరాలు ఇంకా సాగులోకి రాలేదు. ఈ సీజన్‌లో 20లక్షల ఎకరాల్లో దాళ్వా వరి సాగవ్వాల్సి ఉండగా, 16.27లక్షల ఎకరాల్లోనే నాట్లు పడ్డాయి. గత నవంబరు, డిసెంబరులో వాయుగుండాలు, తుఫాన్ల కారణంగా ఖరీఫ్ వరి కోతలు ఆలస్యం కావడంతో ఇంకా రబీ వరి సాగు ఆలస్యమైంది. ఈ కారణంగా వరి సాగు 4లక్షల ఎకరాల్లో తగ్గింది. రాయలసీమ, ఉత్తరాంధ్ర ఏజెన్సీ ప్రాంతాల్లో 7.75లక్షల ఎకరాల్లో జరగాల్సిన చిరుధాన్యాల సాగు లక్ష ఎకరాలపైగా తగ్గింది. ఈ సీజన్‌లో 21.30లక్షల ఎకరాల్లో పప్పు ధాన్యాలు సాగవ్వాల్సి ఉండగా, 18.27లక్షల ఎకరాల్లోనే విత్తనం పడింది. శనగ(బెంగాలీ గ్రామ్) 10లక్షల ఎకరాలకు బదులు 7.50లక్షల ఎకరాల్లోనే సాగైంది. వేరుశనగ, ఇతర నూనె గింజల పంటలు 3.45 లక్షల ఎకరాల్లో వేయాల్సి ఉండగా, కేవలం 1.65ఎకరాల్లో సాగైంది. సాగైన మేరకు అన్ని పంటలకూ అనువైన వాతావరణం ఉండటంతో దిగుబడులు సాధారణం కంటే బాగానే ఉండే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.